అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 07-3-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 16 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

నాలుగు నెలలా.. మరీ ఎక్కువే

- ఎలక్టోరల్ బాండ్ల వివరాల వెల్లడికి అంత సమయం అవసరం లేదు
- 'ఒక్క క్లిక్'తో ఎస్బీఐ సమాచారాన్ని వెల్లడించొచ్చు : రాజకీయ విశ్లేషకులు, నిపుణుల వెల్లడి

వివరాలు 3లో



చెన్నైలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన

మీ ఆంక్షలు తగవు..?

కేరళకు కేంద్రం పెట్టిన షరతులపై సుప్రీం అసంతృప్తి

- ఆర్టికల్ 131 ప్రకారం పిటిషన్ దాఖలు వారి హక్కు
- ఆ పిటిషన్ ఉపసంహరించుకోవాలనే పట్టుదల తగదు : కేంద్రాని హితవు
- మరోసారి చర్చలు జరపండి : కేంద్రం, కేరళ ప్రభుత్వాలకు సుప్రీం సూచన



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర రుణ పరిమితిపై కేంద్ర ప్రభుత్వ ఆంక్షలను సవాలు చేస్తూ కేరళ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ ఉపసంహరించుకుంటే అదనపు రుణాలకు అనుమతిస్తామని కేంద్ర ప్రభుత్వం పెట్టిన షరతుపై అత్యున్నత న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. అది ఆర్టికల్ 131 ప్రకారం వారి హక్కు అని, కేరళ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని పట్టుపట్టొద్దని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. రాష్ట్ర రుణ పరిమితులపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలను సవాలు చేస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 131 ప్రకారం కేంద్ర ప్రభుత్వంపై కేరళ రాష్ట్రం దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. కేరళ రుణాలు తీసుకునే అధికారాలపై కేంద్రం విధించిన పరిమితుల వల్ల తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు మరో దఫా చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు కేరళ ప్రభుత్వాన్ని ధర్మాసనం కోరింది. ఈ సమస్యపై మరింత చర్చించేందుకు కేంద్రం, కేరళ రెండింటికి చెందిన బాధ్యులైన అధికారులందరూ నార్త్ బ్లాక్‌లో సమావేశం కావాలని సూచించింది. వివాదాన్ని పరిష్కరించేందుకు మరో దఫా చర్చల కోసం ఈ ప్రతిపాదనకు ఇరుపక్షాలు అంగీకరించాయి. కేంద్ర ప్రభుత్వం ఆఫర్ చేసిన రూ.13,608 కోట్లను కేరళ అంగీకరించి తదుపరి కేటాయింపు ...11లో

కేరళ బడిలో తొలి రోబో టీచర్ !

- మూడు భాషల్లో ముచ్చటించే ఉపాధ్యాయురాలు

వివరాలు 12లో




పాలమూరు ప్రజాదీవెన సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ప్రభుత్వం జోలికొస్తే అగ్నికణికలై అంతు చూస్తారు
ప్రజలు ఊరుకోరు

- ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే మోడీనైనా, కేడీనైనా నిలదీస్తా..
- చాకిరేవు బండ పగిలే దాకా పోరాడుతా
- గత రాష్ట్ర పాలకులు ప్రాజెక్టుల నిధులు దిగమింగారు
- కృష్ణా నదిపై ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదు?
- కేసీఆర్‌తో ఆర్ఎస్‌పీ జతకట్టడం హాస్యాస్పదం
- తెలంగాణలో 14 పార్లమెంటు నియోజకవర్గాలు గెలిచి తీరుతాం
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీతో పాటు రెండు ఎంపీ సీట్లు గెలిపించాలి : 'ప్రజాదీవెన' సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-మహబూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి

పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు రైల్వే, మూసీ నది ప్రాజెక్టు కోసం ఇచ్చిన హామీలను మోడీ అమలు చేయకపోతే సాకిరేవు బండ పగిలే దాకా పోరాటాలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సీడబ్ల్యూసీ సభ్యులు వంశీచంద్‌రెడ్డి చేపట్టిన 'ప్రజాదీవెన' పాదయాత్ర ముగింపు సభ బుధవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎన్‌వీఎస్ కళాశాల మైదానంలో దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత పాలకులు కృష్ణానదిపై అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పదేండ్లు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పితే పారతో గుంతలు తవ్వే ...10లో

కరువును కలిసికట్టుగా ఎదుర్కొందాం

- రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- ఆన్‌లైన్‌లో 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్

వివరాలు 2లో

గ్రూప్స్ రాతపరీక్షల తేదీలు ఖరారు

ఆగస్టు 7, 8న గ్రూప్-2

- అక్టోబర్ 21న గ్రూప్-1 మెయిన్స్
- నవంబర్ 17,18న గ్రూప్-3 : టీఎస్‌పీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్, గ్రూప్-2, గ్రూప్-3 రాతపరీక్షల తేదీలు ఖరారయ్యాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు ఏడు, ఎనిమిది తేదీల్లో గ్రూప్-2, అక్టోబర్ 21న గ్రూప్-1 మెయిన్స్, నవంబర్ 17,18 తేదీల్లో గ్రూప్-3 రాతపరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గతనెల 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను ...11లో

కోవలెంట్ పరిశ్రమలో
ఘోర ప్రమాదం

రియాక్టర్ వద్ద మంటలు అంటుకొని కార్మికుని మృతి

- పరిశ్రమ సేఫ్టీ ప్రికాషన్స్ పాటించకపోవడం వల్లే ప్రమాదం
- పరిశ్రమపై చర్యలు తీసుకొని, న్యాయం చేయాలంటూ.. మృతుని కుటుంబ సభ్యుల ధర్నా, రాస్తారోకో



నవ తెలంగాణ-హత్నూర

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం గుండ్లమాచనూర్ గ్రామ శివారులోని కోవలేంట్ పరిశ్రమలో రియాక్టర్ వద్ద మంటలు చెలరేగి ఒక కార్మికుడు మృతి చెందగా.. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోవలెంట్ పరిశ్రమలోని టీబీ బ్లాక్-4లో హత్నూరకు చెందిన వినోద్ కుమార్(30) కెమిస్ట్‌గా, ...11లో

ప్రాజెక్టులపై ఆరా..

- ఉత్తమ్‌తో ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ భేటి
- మేడిగడ్డ సహా ఆయా అంశాలపై చర్చ
- డాక్యుమెంట్లు, సమాచారం కమిటీకి ఇవ్వాలని ఆదేశం
- నివేదిక ఆధారంగానే చర్యలు : మంత్రి ఉత్తమ్ 11లో



ఏం చూసి మీకు ఓటెయ్యాలి?

- కాంగ్రెస్ రాగానే కరువొచ్చింది
- వరికి బోనస్ ఏమైంది? : సీఎం రేవంత్‌కు మాజీమంత్రి హరీశ్‌రావు సూటి ప్రశ్న

వివరాలు 10లో

లష్కర్‌లో లక్ ఎవరిదో..!

సికింద్రాబాద్‌పై ప్రధాన పార్టీల ఫోకస్

- ఆరు గ్యారంటీల అమలే ప్రచార అస్త్రంగా కాంగ్రెస్
- నియోజకవర్గాల సమావేశాలతో బీఆర్ఎస్ బిజీబిజీ
- విజయ సంకల్ప యాత్రలో బీజేపీ



నవతెలంగాణ-సిటీబ్యూరో


సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానంపై ప్రధాన పార్టీలు ఫోకస్ పెట్టాయి. ఎలాగైనా ఈ స్థానాన్ని తమ ఖాతాల్లో వేసుకునేందుకు అన్ని పార్టీలు పావులు కదుపుతున్నాయి. వివిధ కార్యక్రమాలతో పట్టు సాధించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నియోజకవర్గంలో పాగా వేసేందుకు పోటాపోటీగా పని చేస్తున్నాయి.

చేరికలపై కాంగ్రెస్ పార్టీ దృష్టి..

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గమనించాలని ...11లో

కేరళలో కొత్త అవతారం ఎత్తిన డబ్బావాలాలు !

- లంచ్ బెల్ ప్రాజెక్టు ప్రారంభించిన పినరయి విజయన్ ప్రభుత్వం
- యాప్ ద్వారా ఆర్డర్లు, రూ.60కే భోజనం



తిరువనంతపురం : ముంబయిలో ప్రసిద్ధి చెందిన డబ్బావాలాలు కేరళలో కొత్త అవతారం ఎత్తారు. కేరళలో కుదుంబశ్రీ 'లంచ్ బెల్' ప్రాజెక్టు ప్రారంభం కావడంతో కుదుంబశ్రీ వలంటీర్లు ఫుడ్ డెలివరీ యాప్ అయిన పాకెట్ మార్ట్ ద్వారా ఆఫీసులకు లంచ్ బాక్స్‌లను పంపిణీ చేయడం ఆరంభించారు. ఉదయం 7గంటల వరకు ఆర్డర్లు తీసుకుంటారు. మధ్యాహ్నం 12గంటల కల్లా లంచ్ బాక్స్‌లను అందచేస్తారు. తిరిగి 2గంటల కల్లా వలంటీర్లు లంచ్ బాక్స్‌లను తీసుకెళ్తారు. మూడు స్థాయిల్లో పరిశుభ్రమైన పద్ధతుల్లో కడిగిన తర్వాత మళ్లీ ఆ లంచ్‌బాక్స్‌లను ఉపయోగిస్తారు.

బడ్జెట్ లంచ్ బాక్స్ ఖరీదు రూ.60, ఇందులో అన్నం, సాంబారు, చట్నీ, ఊరగాయ, కేరళ వంటకాలైన ఎరిస్సెరి, కూట్టుకూరి వుంటాయి. ప్రీమియం లంచ్ బాక్స్ ఖరీదు రూ.99. ఇందులో మాంసాహార వంటలు వుంటాయి. తొలి దశలో లంచ్ బెల్ ప్రాజెక్టును తిరువనంతపురంలో సెక్రటేరియల్, అసెంబ్లీ, వికాస్ భవన్, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ఇతర ప్రైవేటు సంస్థల్లో అమలు చేస్తారు. రాబోయే కాలంలో గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తారు. రెండో దశలో కోచిలో ఈ ప్రాజెక్టును చేపడతారు.

తిరువనంతపురంలోని కెటిడిసి గ్రాండ్ చైత్రమ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేరళ స్థానిక స్వపరిపాలనా సంస్థల శాఖ మంత్రి ఎం.బి.రాజేష్ ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిన మహిళలతో కూడిన మొదటి ఫుడ్ డెలివరీ బృందం మొదటి ప్రయాణాన్ని కూడా మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, కుదుంబశ్రీ మహిళల ఆర్థిక సాధికారతకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు. కుదుంబశ్రీ మౌలిక లక్ష్యాలపై దృష్టి పెట్టడం ద్వారా కుదుంబశ్రీ సభ్యుల ఆర్థిక సాధికారతతో పాటూ వారి ఆదాయాలు పెంచే చర్యలను అమలు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. నైపుణ్యాలు, విశ్వసనీయతకు మారు పేరు కుదుంబశ్రీ అన్నారు. మహిళల ఆదాయాలు పెంచేందుకు ఈ ప్రాజెక్టు కింద వివిధ పథకాలను ప్రారంభించామన్నారు. అగ్రి కియోస్కులు రసాయనాలు లేని కూరగాయలు, పళ్ళు అందచేస్తాయన్నారు. వృద్ధులైన రోగుల సంరక్షణను చూసేందుకు కె 4 కేర్ స్కీమ్ ఏర్పాటు చేశామన్నారు. రాబోయే ఏడాది కాలంలో మూడు లక్షల మందికి జీవనోపాధి, ఉపాధి అవకాశాలు అందచేసేందుకు కె-లిఫ్ట్ 24 (కుదుంబశ్రీ లైవ్‌లీహుడ్ ఇనీషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్) ప్రాజెక్టును రూ.430కోట్లతో చేపట్టామన్నారు. మొత్తంగా అన్ని పథకాలు మహిళలకు ఉపాధిని, ఆదాయాలను ఉత్పత్తి చేసేందుకు ఉద్దేశించినవేనన్నారు.

ఈ పాకెట్ మార్ట్ యాప్ ద్వారా భోజనాలతో పాటూ ఇతర ఆహార పదార్థాలకు కూడా డిమాండ్ వుందని కుదుంబశ్రీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాఫర్ మాలిక్ తెలిపారు.

కేరళలో ఇకనుంచి కె-రైస్ !

- కిలో రూ.30చొప్పున విక్రయాలు

తిరువనంతపురం : శబరి కె-రైస్‌ను ప్రవేశపెట్టాలని కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి జి.ఆర్.అనీల్ బుధవారం ఇక్కడ జరిగిన పత్రికా సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. సప్లై కో కేంద్రాల ద్వారా ప్రజలకు సరసమైన ధరలకు మంచి నాణ్యత గల బియ్యాన్ని అందించాలన్న ఉద్దేశంతోనే ఈ పథకాన్ని ఆరంభించినట్లు మంత్రి తెలిపారు.

దీనితో పాటూ ప్రస్తుతం సప్లై కో నుండి కార్డుకు పది కిలోల చొప్పున సబ్సిడీ ధరలకు ఇస్తున్న బియ్యం పంపిణీ కూడా కొనసాగుతుందని మంత్రి చెప్పారు. కె-రైస్ అనేది కూడా అందులో భాగంగానే వుంటుందన్నారు. కిలో రూ.40 చొప్పున ప్రభుత్వం వివిధ రకాల బియ్యాన్ని కొనుగోలు చేస్తుంది. వాటిని రూ.30 చొప్పున సబ్సిడీ రేట్లకు విక్రయిస్తుంది. జయా రైస్ ధర రూ.29గా నిర్ధారించగా, కురువ, మట్టా రకాలు రూ.30కి అందుబాటులో వుంటాయి. జయా వెరైటీ బియ్యం తిరువనంతపురం ప్రాంతంలోనే విక్రయిస్తారు. మట్టా వెరైటీని కొట్టాయం, ఎర్నాకుళం ప్రాంతాల్లో, కురువ రకాన్ని పాలక్కాడ్, కొజిక్కోడ్ ప్రాంతాల్లో అందుబాటులో వుంటాయని మంత్రి చెప్పారు.

ఒక బ్రాండ్‌ను ఏర్పాటు చేసే ప్రక్రియలో భాగంగా మొదటి దశలో శబరి కె-రైస్‌ను ఆ లోగో గల గోనె సంచుల్లో విక్రయిస్తారు. మొత్తంగా ఈ గోనె సంచులకయ్యే బడ్జెట్ రూ.10లక్షల ల్లోపే వుంటుందని, దాన్ని సప్లై కో అడ్వర్టయిజ్‌మెంట్స్ బడ్జెట్ నుండి వాడతామని చెప్పారు.

కె-రైస్ బ్రాండ్ కింద సబ్సిడీ రేట్లకు అధిక నాణ్యత గల వెరైటీలను అందచేస్తుండగా, నాఫెడ్ ద్వారా కిలో రూ18.59కు, ఎన్‌సిసిఎఫ్ ద్వారా కిలో రూ.29 చొప్పున కొనుగోలు చేసి వాటిని రూ.29 చొప్పున భారత్ రైస్‌గా విక్రయిస్తున్నారని మంత్రి చెప్పారు. భారత్ రైస్ పేరుతో ప్రజలకు విక్రయించడం ద్వారా కేంద్రం కిలోకు రూ.10చొప్పున లాభం పొందుతోందన్నారు. అదే సమయంలో కె-రైస్‌ను విక్రయించేందుకు కిలోకు రూ.9.5 నుండి 11.11 వరకు అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందని మంత్రి అనీల్ చెప్పారు.

కరువును కలిసికట్టుగా ఎదుర్కొందాం

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- ఆన్‌లైన్‌లో 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కరువొచ్చినా.. ఎంత కష్టం వచ్చినా రైతులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో కరువు పరిస్థితులున్నాయనీ, కలిసికట్టుగా దాన్ని ఎదుర్కొందామని ఆయన పిలుపునిచ్చారు. ఏడాదిగా సరైన వర్షపాతం లేకపోవటంతో రిజర్వాయర్లలో నీళ్లు అడుగంటుతున్నాయనీ, అందుకే అన్ని ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. రిజర్వాయర్ల నుంచి నీళ్లను విడుదల చేయాలని కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లోని రైతులు, నాయకులు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. వారందరూ పరిస్థితిని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే వేసవిలో తాగునీటి కష్టాలు రాకుండా చూడాల్సిన అవసరముందనీ, అందుకనుగుణంగా అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని సీఎం తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి బుధవారం హైదరాబాద్‌లో ఉదయం తన నివాసం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ సెక్రెటరీ, కమిషనర్ రఘునందనరావు, డైరెక్టర్ గోపి, రైతు సంఘాల ప్రతినిధులు సుంకెట అన్వేష్ రెడ్డి, నల్లమల వెంకటేశ్వరరావు, వై.వెంకటేశ్వరరావు సచివాలయం నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి పలువురు రైతులు కాన్ఫరెన్స్‌లో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. తాము పండిస్తున్న పంటల ద్వారా లాభాలు సాధిస్తున్న తీరును వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,601 రైతు వేదికలను వీడియో కాన్ఫరెన్స్‌కు అనుసంధానం చేసి నేరుగా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. తొలి విడతలో ప్రయోగాత్మకంగా 110 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను నెలకొల్పింది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం సహకారంతో రాష్ట్ర వ్యవసాయశాఖ రూ.97 కోట్లతో ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. దీంతో రాష్ట్ర అధికారులతో పాటు వ్యవసాయ నిపుణులు నేరుగా గ్రామాల్లో, పంట పొలాల్లో ఉండే రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోనున్నారు. పంటలకు సంబంధించిన సలహాలు, సూచనలతో పాటు అధునాతన మెళకువలను ఎప్పటికప్పుడు వారికి అందించనున్నారు. ఆదర్శ రైతులు తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకునేందుకు ఈ కార్యక్రమం వీలు కల్పిస్తుంది. రైతు నేస్తం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు పాలుపంచుకున్నారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ ప్రతి సీజన్లో రైతులు ఎదుర్కొనే సమస్యలను దృష్టిలో పెట్టుకుని, ఎప్పటికప్పుడు వారికి సలహాలు, సూచనలిచ్చేందుకు రైతు నేస్తం ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులు నేరుగా వ్యవసాయ నిపుణులతో మాట్లాడేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. ప్రభుత్వమే ప్రజల దగ్గరికి వెళుతున్నదనీ, అందులో భాగంగానే రైతుల సమస్యలను తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. విత్తనాలు, ఎరువులు, ఏ పంట వేయాలనేది మొదలు పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకునేంత వరకూ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పంటలకు గిట్టుబాటు ధరే కాకుండా లాభసాటి ధర రావాలనే ఆలోచనతో ప్రభుత్వం ముందుకెళ్తున్నదని తెలిపారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతులకు విత్తనాలు అందుబాటులోకి తీసుకురావటం, ఐకేపీ సెంటర్లు, మార్కెట్ యార్డుల ద్వారా పంట ఉత్పత్తుల కొనుగోలు కార్యక్రమాలన్నింటినీ చేపడతామని వివరించారు.రాష్ట్రంలో దాదాపు 26 రకాల పంటలు పండటానికి అనుకూలమైన భూములు, వాతావరణం ఉందని ఆయన తెలిపారు. కేవలం వరి లేదా పత్తి మిర్చి పంటలకే పరిమితం కావద్దని రైతులకు సూచించారు. ఇతర పంటలను కూడా సాగు చేయాలనీ, పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. తక్కువ నీళ్లతో, తక్కువ పెట్టుబడితో ఎక్కువ పంట దిగుబడి, ఎక్కువ లాభాలు వచ్చేలా పంటల ప్రణాళికలను రూపొందించుకోవాలని చెప్పారు.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన సూచనలతో ప్రభుత్వం ఇటీవలే పంటల బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చిందని సీఎం గుర్తు చేశారు. రైతులు ఏదైనా ఆపదతో చనిపోతే ఆ కుటుంబాన్ని రైతు బీమా పథకం ఆదుకుంటుందని తెలిపారు. పంట పెట్టుబడి పెట్టినప్పటి నుంచి కరువు వచ్చినా, వరదొచ్చినా నష్టపరిహారం అందుతుందనీ, రైతులు పెట్టిన పెట్టుబడి వారికి తిరిగి వస్తుందని స్పష్టం చేశారు. దీంతో రైతులు ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి ఉండబోదని స్పష్టం చేశారు. ఎన్ని కష్టాలొచ్చినా రైతులు ధైర్యం కోల్పోవద్దనీ, ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం అన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లస్థలాలిస్తాం

- హెచ్‌యూజే డైరీ ఆవిష్కరణలో మంత్రి పొంగులేటి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లు లేదా ఇండ్లస్థలాలు ఇస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో త్వరలోనే అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తుందని చెప్పారు. హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే-టీడబ్ల్యూజేఎఫ్) డైరీని బుధవారం మంత్రుల నివాస సముదాయంలో సంఘం నేతలతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌యూజే కార్యవర్గానికి, సభ్యులకు పొంగులేటి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు జర్నలిస్టులు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఇండ్లు, ఇండ్లస్థలాలు, ఇతర జర్నలిస్టుల సమస్యలను హెచ్‌యూజే నేతలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై పొంగులేటి స్పందిస్తూ జర్నలిస్టు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. వారి సీనియార్టీని బట్టి కేటగిరీలుగా విభజించి అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ప్రభుత్వం దృష్టిలో అన్ని జర్నలిస్టు సంఘాలు సమానమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు బి అరుణ్ కుమార్, బి జగదీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, కోశాధికారి బి రాజశేఖర్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి రాధిక, కార్యదర్శి ఈ చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు రామకృష్ణ, హెచ్‌యూజే ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగవాణి, ఉపాధ్యక్షులు బి దామోదర్, ఎం రమేష్, జి వీరేష్, జాయింట్ సెక్రెటరీ ఎ ప్రశాంత్, కార్యవర్గ సభ్యులు పి విజయ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 15,205 మంది గైర్హాజరు

- ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మ్యాథమెటిక్స్-1బి, జువాలజీ, హిస్టరీ పేపర్-1 పరీక్షను నిర్వహించామని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా బుధశవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 4,26,197 మంది దరఖాస్తు చేయగా, 4,10,992 (96.5 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. 15,205 (3.5 శాతం) మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పెద్దపల్లిలో నలుగురు, కరీంనగర్‌లో ఒకరు, జగిత్యాలలో ముగ్గురు కలిపి మొత్తం పది మంది విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులను నమోదు చేశామని తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం మ్యాథమెటిక్స్-1బి, జువాలజీ, హిస్టరీ పేపర్-1 పరీక్షకు సెట్ బీ ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశామని వివరించారు. మంచిర్యాల, నారాయణపేట, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఇంటర్ బోర్డు నుంచి పరిశీలకులు వెళ్లి పరీక్షను పరిశీలించారని పేర్కొన్నారు. ఈ పరీక్ష ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జరిగిందని తెలిపారు.

సీఎంను కలిసిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో కలిశారు. తామా మర్యాదపూర్వకంగానే సీఎంను కలిసినట్టు తెలిపారు.

11న భద్రాచలంలో ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం

- ఈ ఏడాది 4.50 లక్షల గృహాల నిర్మాణం
- ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం : మంత్రి పొంగులేటి వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇండ్లు లేని పేదవారి కోసం రాష్ట్రంలో ఈ ఏడాది 4.50 లక్షల ఇండ్లను నిర్మించనున్నట్టు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ఈనెల 11న భద్రాచలంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని ఆయన తెలిపారు. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం చేయనున్నట్టు వెల్లడించారు. బుధవారంహైదరాబాద్‌లోని సచివాలయంలో హౌసింగ్ కార్పొరేషన్ అధికారులతో ఇందిరమ్మ ఇండ్లపై మంత్రి చర్చించారు. హామీలు ఇవ్వడమే కాదు ఇచ్చిన ప్రతి హామీని ఆచరణలో అమలు చేయడమే ఇందిరమ్మ రాజ్యమన్నారు. 'పేదవారికి సొంత ఇల్లు ఒక కల... అది నెరవేరితే పేదవాడి ఇంట పండుగే' అని అన్నారు. నిరుపేదలకు నిలువ నీడను కల్పించడం ప్రభుత్వాల తక్షణ కర్తవ్యమని వ్యాఖ్యానించారు. తొమ్మిదిన్నరేండ్లపాటు రాష్ట్రాన్ని ఏలిన గత పాలకులు ఆ కర్తవ్యాన్ని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను, ఆశలను గత ప్రభుత్వం వారి రాజకీయ అవసరాలకు మాత్రమే వాడుకుందని విమర్శించారు. కానీ తమ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల సహాయం అందించేందుకు అవసరమైన కార్యాచరణను ప్రారంభించిందని తెలిపారు. తొలి విడతగా ఈ సంవత్సరం ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లను మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్, జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు ఈ పథకాన్ని పర్యవేక్షిస్తారని తెలిపారు. తొలి విడతలో సొంత స్థలం కలిగిన వారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయనున్నామని తెలిపారు. 400 చదరపు అడుగులకు తక్కువ కాకుండా ఇండ్లను నిర్మించాలనీ, హాలు, బెడ్ రూమ్‌తోపాటు వంటగది, బాత్‌రూమ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మహిళల పేరుపై ఇండ్లను మంజూరు చేస్తామనీ, ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆహార భద్రత కార్డు ఆధారంగా లబ్దిదారులను ఎంపి చేస్తామని వివరించారు. ఇందుకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన మార్గదర్శకాలను వెంటనే విడుదల చేయాలని అధికారులకు సూచించారు. పేదవారి సొంతింటి కల సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పుడు సాకారం కాబోతున్నదని సంతోషం వ్యక్తం చేశారు.

పాలేరు పాతకాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలి

- ఒక్క తడికి నీళ్లిచ్చినా వేల ఎకరాల వరి పంట చేతికి అందుతుంది
- ఎండిన పంటలకు ప్రభుత్వమే నష్టపరిహారం అందించాలి
- జిల్లాకు ముగ్గురు మంత్రులున్నా.. నీరు రావడం లేదు : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు



నవతెలంగాణ -కూసుమంచి

పాలేరు రిజర్వాయర్ పాత కాలువ పరిధిలో నీళ్ల లేక వేల ఎకరాల్లో వరి పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే పాత కాలువకు నీటిని విడుదల చేసి, పొట్ట దశలో ఉన్న పంటలను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు డిమాండ్ చేశారు. ఇప్పటికే నీళ్ళు లేక ఎండిపోయిన వరి పంటలకు ప్రభుత్వమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మల్లేపల్లి, జక్కేపల్లి, పెరిక సింగారం గ్రామాల్లో పాత కాలువ ద్వారా నీళ్ళ అందక ఎండిన పొలాలను, ఎండిన కాలువ, వాగులను రైతు సంఘం నాయకులు, ఆయకట్టు రైతులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెరిక సింగారం గ్రామంలోని ఎండిన పొలాల దగ్గర ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ ఆయకట్టు పరిధిలో పాలేరు పాత కాలువకు నీళ్ల వస్తాయన్న ఆశతో కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో సుమారు పదివేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారని, ప్రస్తుతం వరి పొలాలు పొట్ట దశలో ఉన్నాయన్నారు. ఆయకట్టు పరిధిలో రైతులు ఒక్కొక్క ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టినా నీరు అందక ఇప్పటికే కొన్ని వేల ఎకరాల్లో పంట పూర్తిగా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎండుతున్న పంటల్లో పశువులను మేపుతున్నారని వాపోయారు. ప్రస్తుతం పాలేరు జలాశయం నీటిమట్టం 11 అడుగులుగా ఉందని, గతంలో 9 అడుగులు నీళ్ళున్నా పాత కాలువకు నీరు అందించి రైతన్నలను ఆదుకున్నారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నా నీళ్ల విడుదల చేయకుండా పంటలను ఎండబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర మంత్రులు స్పందించి పాత కాలువ పరిధిలోని పంటలకు నీటిని విడుదల చేసి రక్షించాలని కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆయకట్టు రైతులు కలిసినప్పుడు తేదీ వారీగా నీళ్లు పంటలకు అందిస్తానని హామీ ఇచ్చారని, నేడు నీళ్లు లేవంటూ రైతన్నలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు.


ఇప్పటికే నీళ్ల లేక ఎండిపోయిన వరి పంటలకు ప్రభుత్వమే బాధ్యత వహించి తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండి రమేష్, మండల అధ్యక్ష కార్యదర్శులు తోటకూరి రాజు, విక్కసాని గంగాధర్, జిల్లా నాయకులు యడవల్లి రమణారెడ్డి, శీలం గురుమూర్తి, మల్లెల సన్మతరావు, ముకుంద రెడ్డి, మండల నాయకులు మూడు గన్యా నాయక్, కర్ణ బాబు, పందిరి వీరారెడ్డి, మల్లేపల్లి సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి చీలంచర్ల రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఎప్‌సెట్‌కు 51 వేల దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్)కు 51,271 దరఖాస్తులొచ్చాయి. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో 32,769 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 18,451 మంది, ఆ రెండు విభాగాలకూ 51 మంది కలిపి మొత్తం 51,271 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు తుది గడువు వచ్చేనెల ఆరో తేదీ వరకు ఉన్న విషయం తెలిసిందే. మే తొమ్మిది నుంచి 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తారు. ఇతర వివరాల కోసం https://eapcet.tschc.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

నాలుగు నెలలా...మరీ ఎక్కువే



- ఎలక్టోరల్ బాండ్ల వివరాల వెల్లడికి అంత సమయం అవసరం లేదు
- 'ఒక్క క్లిక్'తో ఎస్బీఐ సమాచారాన్ని వెల్లడించొచ్చు
- రాజకీయ విశ్లేషకులు, నిపుణుల వెల్లడి
- ఇప్పటికే జూన్ 30 వరకు 'సుప్రీం'ను గడువు కోరిన ఎస్బీఐ

న్యూఢిల్లీ : మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ఇప్పటికే తీర్పునిచ్చింది. దాతలు, లావాదేవీల వివరాలను బహిరంగపరచాలనీ, బాండ్ల నిర్వహణ అధికారం కలిగిన ఏకైక బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)ను ఆదేశించింది. అయితే, ఈ డేటాను బహిర్గతం చేయటానికి గడువును జూన్ 30 వరకు పొడిగింపు చేయాలని అభ్యర్థిస్తూ సుప్రీంకోర్టులో ఎస్బీఐ దరఖాస్తు చేసింది. అంటే, ఈ సమయం దాదాపు నాలుగు నెలల అన్నమాట. అయితే, నిపుణులు, విశ్లేషకులు మాత్రం నాలుగు నెలల సమయం చాలా ఎక్కువనీ, ఎస్బీఐ తన వద్ద ఉన్న సమాచారాన్ని తక్కువ సమయంలోనే వెల్లడించొచ్చని అంటున్నారు.

ఎలక్టోరల్ బాండ్లపై తీర్పు ఇప్పటికే మోడీ సర్కారుకు ఎదురుదెబ్బగా అభివర్ణిస్తున్నారు సామాజిక కార్యకర్తలు, రాజకీయ పరిశీలకులు. ఈ నేపథ్యంలో ఎస్బీఐ కోరిన గడువుపై వీరితో పాటు ప్రతిపక్ష పార్టీలు కూడా దృష్టిని సారించాయి. వివరాలను బహిర్గతం చేయటానికి నాలుగు నెలల సమయం కావాలా? అనే ప్రశ్నలు సైతం వెల్లువెత్తుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎలక్టోరల్ బాండ్ల తీర్పు, దానిపై ఎస్బీఐ స్పందన ఇప్పుడు రాజకీయ యవనికపై తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



'గడువు కోరటం వెనక ఉన్నదెవరు?'

ఎలక్టోరల్ బాండ్స్ కేసులో నలుగురు పిటిషనర్లలో ఒకరైన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) గడువు పొడిగింపు కోసం ఎస్బీఐ చేసిన అభ్యర్థనను సవాలు చేయటానికి సిద్ధంగా ఉన్నది. ఇటు కాంగ్రెస్ సైతం తన అనుమానాలను వ్యక్తం చేస్తున్నది. జూన్ 30 వరకు గడువు కోరటం వెనక ఎస్బీఐపై ఒత్తిడి తెస్తున్నది ఎవరు? అని ఆ పార్టీ ప్రశ్నిస్తున్నది. డిజిటల్ యుగంలో కేవలం 'ఒక క్లిక్' ద్వారా బహిర్గతం చేయగల డేటాకు ఇంత సమయం దేనికనీ అంటున్నది. సమాచార వెల్లడికి నాలుగు నెలల సమయం అతి ఎక్కువ అనీ, అయితే, సమయం కోరటానికి ఎస్బీఐ వెనక వెనక ఎవరున్నారన్నది కీలకమని రాజకీయ విశ్లేషకులు, నిపుణులు అంటున్నారు. ఎలక్టోరల్ బాండ్స్ డేటాను సంకలనం చేయటానికి ఎస్బీఐకి నాలుగు నెలలు అవసరం లేదని నిపుణులు చెప్తున్నారు.

సుప్రీంకోర్టు ఫిబ్రవరి 15 నాటి తన తీర్పులో.. మార్చి 6 నాటికి ఎస్బీఐ.. ఏప్రిల్ 12, 2019 నుంచి 15 ఫిబ్రవరి 2024 మధ్య కొనుగోలు చేసిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఎన్నికల కమిషన్(ఈసీ)కు సమర్పించాలని ఆదేశించింది. ప్రతి ఎలక్టోరల్ బాండ్ కొనుగోలు తేదీ, దాత పేరు, వారు ఏ పార్టీకి విరాళమిచ్చారు, కొనుగోలు చేసిన ఎలక్టోరల్ బాండ్ డినామినేషన్ వంటి వివరాలను తప్పనిసరిగా మార్చి 13 లోపు ఈసీ బహిరంగపరచాలని కోర్టు తెలిపింది.

కోర్టు నిర్దేశించిన గడువుకు రెండు రోజుల ముందు, మార్చి 4న సుప్రీంకోర్టుకు చేసిన దరఖాస్తులో ఐదేండ్లలో (ఏప్రిల్ 12, 2019 నుంచి ఫిబ్రవరి 15, 2024 మధ్య) వివిధ పార్టీలకు 22,217 ఎలక్టోరల్ బాండ్లను జారీ చేసినట్టు ఎస్బీఐ తెలిపింది. రిడీమ్ చేయబడిన బాండ్లను అధీకృత శాఖలు ముంబయిలోని ప్రధాన ఎస్బీఐ బ్రాంచ్‌కు పంపినందున, సమాచార సెట్‌లను డీకోడ్ చేసి కంపైల్ చేయాల్సి ఉంటుందని ఎస్బీఐ వివరించింది.

ఒక వ్యక్తి ఏదైనా రాజకీయ పార్టీకి బాండ్‌ను అందజేసినప్పుడు.. రాజకీయ పార్టీ దానిని రీడీమ్ చేయటానికి ఎస్బీఐకి తిరిగి వెళ్లినప్పుడు.. బ్యాంక్ దాచిన నంబర్, కొనుగోలుదారు పేరును రికార్డులలో తనిఖీ చేస్తుంది. దానిని కూడా రికార్డ్ చేస్తారు.

ఈ ఎంట్రీలు, డేటా అన్నీ నిజ సమయంలో నమోదవుతాయని నిపుణులు అంటున్నారు. రెండు డేటా సెట్‌లను వెరిఫై చేయటానికి ఎక్కువ సమయం కావాలన్న అప్లికేషన్‌లో ఎస్బీఐ వాదనలను కూడా నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఆర్టీఐ కార్యకర్త కమోడోర్ లోకేష్ బాత్రా మాట్లాడుతూ.. ఎస్బీఐ ఒక దాతకు ఎలక్టోరల్ బాండ్‌ను జారీ చేసేటప్పుడు కేవైసీ వివరాలను తీసుకుంటే, దానికి సంబంధించిన డిజిటల్ రికార్డు తప్పనిసరిగా ఉంటుంది. "బాండ్‌ను ఎవరు కొనుగోలు చేసారు? ఏ రాజకీయ పార్టీ దానిని ఎన్‌క్యాష్ చేసింది? అనే డేటా వారి వద్ద ఉన్నది.

నేడు ఎస్బీఐ వంటి బ్యాంకులో సాంకేతికత ప్రపంచవ్యాప్తంగా లక్షల లావాదేవీలను అత్యంత వేగంతో చేస్తున్నది. కాబట్టి, న్యాయస్థానం అడిగిన డేటాను సిద్ధం చేయటం కష్టం కాదు" అని బాత్రా అన్నారు.

నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు

రోడ్ల మరమ్మతులకు రూ.30కోట్ల చొప్పున ఇస్తాం

- మల్లన్నసాగర్ నుంచి తాగునీరు : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మోత్కూరు మున్సిపల్ చైర్మెన్‌కు అభినందనలు

ఇటీవల ఎన్నికైన మోత్కూర్ మున్సిపల్ చైర్మెన్ గుర్రం కవితా లక్ష్మీనర్సింహారెడ్డి, ఇతర కౌన్సిలర్లను మంత్రి కోమటిరెడ్డి అభినందించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ప్రజాశ్రేయస్సు కోసం వినియోగించాలని చైర్మెన్‌కు సూచించారు. రానున్నది ఎన్నికల సమయమని ప్రతినిత్యం ప్రజలకు అందు బాటులో ఉండి కాంగ్రెస్ పార్టీని వారికి చేరువ చేయాలన్నారు.

నవతెలంగాణ-భువనగిరి రూరల్

ఈ నెల 11వ తేదీన భద్రాచలంలో ముఖ్యమంత్రి ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభిస్తారు.. ప్రథమ దశలో అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున.. ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు అందజేస్తామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని న్యూవివేరా హోటల్‌లో మీడియాతో మంత్రి మాట్లాడారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డితో సాగునీరు, తాగునీరు ప్రాజెక్టులపై చర్చించామని, జిల్లాలో అదనంగా మరో రూ.200 కోట్లతో గంధమల్ల, బస్వాపూర్ పనులు పూర్తి చేసుకుని మల్లన్నసాగర్ నుంచి తాగునీరు అందిస్తామని తెలిపారు. మరికొన్ని రోడ్లను కూడా మంజూరు చేసుకునే కార్యాచరణలో ఉన్నామని, రోడ్ల మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఒకటో తారీఖునే వేతనాలు అందించి మళ్లీ పాత రోజులు తీసుకొచ్చామన్నారు. మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం 30 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. శాసనసభ్యులు, మంత్రులు ఒక టీముగా ఏర్పడి ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలలో ఐదు అమలు చేస్తున్నామన్నారు. మెగా డీఎస్సీ ప్రకటించామని, వచ్చే నెలలో ఎగ్జామ్ ఉంటుందని తెలిపారు.

బస్వాపూర్ ఆర్అండ్ఆర్ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రధానమంత్రిని కలిసి ట్రిబుల్ ఆర్ రోడ్డుకు సంబంధించి నిధులు అడిగామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, ఎవరికి నష్టం కలగకుండా మార్పులు చేర్పులు చేసుకుంటూ పనులు ప్రారంభిస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ సూపర్ గేమ్ ఛేంజర్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రోడ్లకు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.30 కోట్ల చొప్పున ఇస్తామన్నారు. రాష్ట్రంలో రోడ్ల పనులకు రూ. 1150 కోట్లతో టెండర్లను పిలిచామని, రాయగిరి బ్రిడ్జి రోడ్డు పనులు కూడా వేగంగా నడుస్తున్నాయని తెలిపారు. అర్హులైన వాళ్లందరికీ త్వరలో రేషన్ కార్డు మంజూరు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఎల్ఆర్ఎస్ ఉచితంగా అమలు చేయాలి

- రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసన కార్యక్రమాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నిరసన కార్యక్రమాలు చేసింది. ధర్నాల్లో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు. ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వ వైఖరికి నిరసనగా హైదరాబాద్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, మాగంటి గోపీనాథ్ నిరసన తెలిపారు. పోలీస్ అధికారులు జీహెచ్ఎంసీ లోపలికి వెళ్లేందుకు అనుమతించకపోవడంతో ప్రధాన గేటు ముందే ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేస్తామని ఎన్నికలకు ముందు హామీనిచ్చిన కాంగ్రెస్ మాట తప్పిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్‌ను అమల్లోకి తీసుకొస్తే ఉచితంగా చేయాలని కాంగ్రెస్ కోర్టుకు వెళ్లిందని గుర్తు చేశారు. ఇప్పటి నుంచి ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇద్దరు కార్పొరేటర్లతోపాటు బీఆర్ఎస్ యువనాయకులు జై సింహా తదితరులు పాల్గొన్నారు.



ఎన్ని ఇబ్బందులైనా
నిజాం షుగర్స్‌ని పునరుద్ధరిస్తాం

- విలువ ఆధారిత పరిశ్రమగా తీర్చిదిద్దుతాం : ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ముత్యంపేట ఫ్యాక్టరీని సందర్శించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- చెరుకు రైతులతో ముఖాముఖి

నవ తెలంగాణ - జగిత్యాల టౌన్ / మల్లాపూర్

తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రధానాంశంగా పేర్కొన్న నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణను ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చేపడుతాం. ఈ ఫ్యాక్టరీని విలువ ఆధారిత పరిశ్రమగా తీర్చిదిద్దుతాం. గత బీఆర్ఎస్ పాలకులు చెరుకు రైతులను నిర్లక్ష్యం చేసి వారిని నష్టాలపాలు చేశారు' అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే సహా జిల్లా కలెక్టర్, అధికార బృందంతో కలిసి మంత్రి బుధవారం జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ మండలం ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఫ్యాక్టరీ పునరుద్ధరించే వరకూ గడ్డం తీయకుండా, చెప్పులు ధరించకుండా 9 నెలలుగా దీక్ష చేపట్టిన చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డిని కలిశారు. ఆయనకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. అనంతరం మల్లాపూర్‌లో చెరుకు రైతులతో ముఖాముఖి, జగిత్యాల జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సూచన మేరకు ఇక్కడి ప్రజల కష్టాలను అర్థం చేసుకుని ఈ ఫ్యాక్టరీ పునరుద్ధరణ అంశాన్ని మానిఫెస్టోలో చేర్చామని తెలిపారు. ఫ్యాక్టరీని పూర్తి స్థాయిలో అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఒక కమిటీని వేసిందని, చెరుకు రైతులు, అధికారులతో చర్చించామని తెలిపారు. సమస్యను అధిగమించేందుకు నిజాం షుగర్ ఫ్యాక్టరీని నడిపిన యాజమాన్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించారని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెరుకు రైతులను, అధికారులను లెక్క చేయకుండా నష్టపర్చిందని విమర్శించారు. ఆ ప్రభుత్వ నిర్వాకం వల్లే రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. సమావేశంలో జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సింగరావు, ఆ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

బీజేపీ డీఎన్‌ఏలోనే మహిళా వ్యతిరేకత

- మాటల్లోనే సాధికారత
- ఉన్మాదుల దాడులకు బలయ్యేది మహిళలే
- పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులను అదుపు చేయలేని దైన్యస్థితి
- రాజ్యాంగ విలువలకు తిలోదకాలిస్తున్న మోడీ సర్కార్
- ఉన్న చట్టాలను అమలు చేయటంలో విఫలం : అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో వక్తలు



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి



ఎస్వీ రమ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


బీజేపీ డీఎన్ఏలోనే మహిళా వ్యతిరేకత ఉందని పలువురు వక్తలు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'కేంద్ర బీజేపీ మతోన్మాద విధానాలను ప్రతిఘటిద్దాం, అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తిని కొనసాగిద్దాం' అనే అంశంపై సీఐటీయూ, ఐద్వా, టీఎస్‌యూటీఎఫ్, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ, ఐద్వా అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళలపై నిత్యం లైంగిక దాడులు, వేధింపులు, అవమానాలు, హత్యలు, ప్రేమోన్మాద దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాలు, న్యాయాలు, పోలీసు వ్యవస్థ ఉన్నా..మహిళలకు ఎక్కడా రక్షణ, న్యాయం కల్పించడం లేదని విమర్శించారు. మహిళా సమానత్వం, సాధికారత, హక్కుల గురించి ఎన్నికల ఉపన్యాసాల్లో మాట్లాడుతున్నారే తప్ప... ఆచరణలో వారికి అన్యాయం జరుగుతుంటే మాత్రం పట్టించుకోవటం లేదన్నారు. బేటీ పడావో.. బేటీ బచావో అంటూ గాండ్రించే బీజేపీ ప్రభుత్వ పెద్దలు మహిళలపై జరుగుతున్న దాడుల పట్ల ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రమ మాట్లాడుతూ శ్రామిక మహిళలు పని ప్రదేశాల్లో తీవ్ర వివక్ష, వేధింపులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రమకు గుర్తింపు, సమాన వేతనాలు, సమాన హక్కుల కోసం మాట్లాడటం నేరమవుతున్న సమాజంలో మనం ఇప్పుడు జీవిస్తున్నామని చెప్పారు. వేతనాలు, సర్వీసు కండీషన్లు, గౌరవం, పదోన్నతుల విషయంలో శ్రామిక మహిళలు తీవ్ర వివక్షకు, అవమానాలకు గురవుతున్నారన్నారని వాపోయారు. పని భారం కారణంగా అత్యధిక మంది మహిళలు తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగాలు వదిలేస్తున్నారని తెలిపారు. మన దేశంలో సగం మంది మహిళలలో అత్యధిక మంది సంరక్షణ, సేవా పనులను చేస్తున్నారని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, అనుబంధ పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు మొదలైన స్కీమ్ వర్కర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించటం లేదని చెప్పారు. మహిళలపై అత్యాచారాలు, హింసను అరికట్టడం, నేరస్థులకు కఠిన శిక్షలు అమలు చేయడంలో విఫలమవుతున్నందుకు పాలకులు సిగ్గు పడాలని వ్యాఖ్యానించారు. ప్రతిరోజూ ఏదో ఒక మూల, ఎక్కడో ఒక చోట లైంగిక దాడులు, హింస, యాసిడ్ దాడులు, హత్యలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకప్పుడు మహిళ అంటే వంటింటికే పరిమితమన్న భావన ఉండేదన్నారు. కానీ నేడు ఎందులోనూ తీసిపోమంటూ పురుషుడితో సమానంగా కార్యనిర్వాహణలోనూ రాణిస్తూ ముందుంటున్నారని గుర్తు చేశారు. పలురంగాల్లో ప్రతిభను కనబరుస్తూ అద్భుతాలు సృష్టిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నదన్నారని చెప్పారు.

చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఎన్నికల కోసం కాకూడదన్నారు. ప్రొఫెసర్ అరిబండి ప్రసాద్ మాట్లాడుతూ మహిళా సాధికారత గురించి చెప్పడమే తప్ప ప్రభుత్వాలు ఆ దిశగా కార్యాచరణ చేపట్టటం లేదని విమర్శించారు. లైంగిక వేధింపుల నిరోధక చట్టం వచ్చినా తగిన రీతిలో అమలు కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్‌యూటీఎఫ్ నాయకులు వందన, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. ప్రసాద్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్, డీవైఎఫ్ఐ మహిళా విభాగం కన్వీనర్ శృతి, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ మమత, మీనా, జీ కవిత,ఆశాలత, నాగలక్ష్మి, శశికళ, వినోద, కుమార్ తదితరులు మాట్లాడారు.

నాయకత్వ స్థానాల్లో మహిళల ప్రాతినిధ్యం తక్కువే

కుటుంబ బాధ్యతలే ప్రధాన కారణం



న్యూఢిల్లీ : 'ఫార్చ్యూన్ 500 ఇండియా లిస్ట్'లోని కంపెనీల్లో కేవలం 1.6 శాతం సంస్థలకు మాత్రమే మహిళలు నేతృత్వం వహిస్తున్నారు. తదుపరి ఐదు వందల కంపెనీల జాబితాలో 5శాతం సంస్థలను మహిళలు నిర్వహిస్తున్నారు. భారతీయ కంపెనీల్లో మహిళల నాయకత్వాన్ని పెంచే విషయంపై నిర్వహించిన అధ్యయనంలో భాగంగా ఈ విషయాలు వెలుగు చూశాయి. ఈ అధ్యయనాన్ని ఫార్చ్యూన్ ఇండియా, ఎస్‌పీ జైన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ రిసెర్చ్ సంయుక్తంగా నిర్వహించాయి. దీనికి మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ సహాయ సహకారాలు అందించాయి. ఈ అధ్యయనం ప్రకారం 30-40 శాతం మంది మహిళా ఉద్యోగులు మిడిల్ మేనేజ్‌మెంట్ (ఏదైనా సంస్థలో సీనియర్, జూనియర్ మేనేజర్ల మధ్యలో ఉన్న మేనేజర్ల స్థాయి)లో ప్రవేశించే సమయంలోనే ఉద్యోగాలు వదిలేస్తున్నారు. ఆ సమయంలో వారికి వివాహం కావడం, ఓ కుటుంబం ఏర్పడడమే దీనికి కారణం. మెటర్నిటీ సెలవు తీసుకొని, పిల్లలు పుట్టిన తర్వాత తిరిగి ఉద్యోగంలో చేరడం వారికి సవాలుగా మారుతోంది. మిడిల్ మేనేజ్‌మెంట్‌లో మహిళలను ఉద్యోగులుగా తీసుకునేందుకు కంపెనీలు వెనకాడుతున్నాయి. వారు తప్పనిసరిగా ఆరు నెలల పాటు మెటర్నిటీ సెలవులో ఉంటారని, దీంతో విధులకు అంతరాయం కలుగుతుందని అవి భావిస్తున్నాయి. పైగా సెలవు కాలంలో జీతం చెల్లించాల్సి వస్తుంది. చిన్న చిన్న కంపెనీలు అంత ఆర్థిక భారాన్ని మోయలేవు. మిడిల్ మేనేజ్‌మెంట్‌లో మహిళలను నియమించుకోవ డానికి కంపెనీలు ఇష్టపడకపోవడానికి మరో కారణం కూడా ఉంది. పిల్లలు బోర్డు పరీక్షలు రాసేటప్పుడు తల్లులు విధిగా సెలవు పెడతారు. పైగా 40 ఏళ్ల వయసున్న మహిళలు తల్లిదండ్రులు లేదా అత్తమామల బాగోగులు చూసుకోవాల్సి వస్తుంది. ఈ కారణాలన్నింటి వల్ల కంపెనీలలో నాయకత్వ బాధ్యతలు చేపట్టేందుకు మహిళలు ముందుకు రావడం లేదు.



సర్వే సూచనలు ఇవే

లిస్టెడ్ కంపెనీల బోర్డుల్లో మహిళల సంఖ్యను 8 శాతం నుంచి 17 శాతానికి పెంచారు. అయితే వీరిలో కొద్ది మందికి మాత్రమే డిమాండ్ అధికంగా ఉంటోంది.

ఈ నేపథ్యంలో నాయకత్వ స్థాయికి మరింత మంది మహిళలు రావాల్సిన అవసరం ఉన్నదని సర్వే అభిప్రాయపడింది. లింగ వైవిధ్యాన్ని పెంచేందుకు కృషి చేసే కంపెనీలకు కార్పొరేట్ పన్నులు తగ్గించాలని, మహిళలకు ఆదాయపన్ను మినహాయింపులు ఇచ్చి వారిని ప్రోత్సహించాలని సిఫారసు చేసింది. పనిగంటల విషయంలో మహిళలకు వెసులుబాటు కల్పించాలని, రాత్రి సమయంలో పనిచేసే మహిళల పట్ల అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, నివాసాల సమీపంలో ఉండే క్రచ్‌లు, వృద్ధుల బాగోగులు చూసే కేంద్రాలను ఉపయోగించుకునేందుకు మహిళలకు అవకాశం కల్పించాలని కూడా సర్వే సూచించింది.

సంపాదకీయం

విన్నపాలతో కాదు...



మెతక వైఖరి, కరుకుతనం... మన పనులు సవ్యంగా సాగాలంటే ఈ రెండింటిలో దేన్ని ప్రదర్శించాలనేది, ప్రదర్శిస్తామనేది ముఖ్యం. సమయాన్నిబట్టి, సందర్భాన్ని బట్టి లౌక్యాన్ని ప్రదర్శిస్తూ ముందుకు సాగాలంటారు పెద్దలు. ఆ తెలివిని ప్రదర్శించకుండా సాదాసీదాగా ముందుకెళ్తే ఎదురు దెబ్బలు తప్పవన్నది అనుభవం చెప్పే పాఠం. మనకున్న గత అనుభవాల రీత్యా తెలంగాణకు రావాల్సిన నిధులు, ఆర్థిక సాయాలు, గ్రాంట్లు, రాష్ట్ర హక్కుల విషయంలో కేంద్రంలోని మోడీ సర్కారు తీవ్ర నిర్లక్ష్యాన్ని, అంతకుమించిన బాధ్యతా రాహిత్యాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నది. గత పదేండ్ల నుంచి కొనసాగుతున్న తంతు ఇదే. ఇది ఇక్కడి అభివృద్ధికి, ప్రయోజ నాలకు గండి కొడుతోంది.

> సమాఖ్య వ్యవస్థ బలోపేతం, లౌకికత్వ పరిరక్షణ, మతోన్మాదానికి వ్యతిరేకంగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇటీవల ఢిల్లీలో గళమెత్తిన సంగతినీ తెలంగాణ సీఎం గుర్తు చేసుకోవాలి. ఆయన ఉద్యమానికి తమిళనాడు సీఎం స్టాలిన్ మద్దతు తెలిపిన విషయాన్నీ మననం చేసుకోవాలి. ఈ రకంగా దక్షిణాదిలోని మూడు రాష్ట్రాలు కేంద్రం తీరును, మోడీ సర్కారు వైఖరినీ దునుమాడుతున్న తరుణంలో మనం కేవలం వినతులు, విజ్ఞప్తులతోనే సరిపుచ్చితే అది వృథా ప్రయాసే అవుతుంది.

తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. .రాష్ట్రానికి సంబంధించిన డజనుకు పైగా సమస్యలను ప్రధాని మోడీకి ఏకరువు పెట్టారు. ఆయా అంశాలు, ప్రాజె క్టులను పూర్తి చేసేందుకు ఇతోధికంగా ఆర్థిక చేయూత నందించాలంటూ ఆయన ప్రధానికి విజ్ఞప్తి చేశారు. వీటిలో మూసీ ప్రక్షాళన, ఐపీఎస్‌ల కేటాయింపు, ఎన్టీపీసీలో 2,400 మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఏర్పాటు, జాతీయ రహదారుల నిర్మాణం తదితరాలు ప్రధానంగా ఉన్నాయి. ఇవి గాక గత పదేండ్ల మోడీ పాలనలో తెలంగాణపై కొనసాగిన వివక్ష, కొనసాగుతున్న పక్షపాత ధోరణికి అనేక దృష్టాంతాలు మన ముందున్నాయి. కేంద్రం నుంచి ప్రతీయేటా రాష్ట్రానికి చట్టబద్ధంగా రావాల్సిన నిధులు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో అందాల్సిన సాయాలకు కొర్రీలేస్తూ వస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో గ్రాంట్ల రూపంలో రూ. 41,259 కోట్లు రావాల్సి ఉండగా, అందులో కేవలం 11 శాతాన్నే (రూ.4,532 కోట్లు) విదిల్చారు. పద్నాలుగో ఫైనాన్స్ కమిషన్ రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు రూ.817 కోట్లను విడుదల చేయాలంటూ సూచించినా ఇప్పటి వరకూ అతీగతీ లేదు.

రాష్ట్ర పునర్ విభజన చట్టంలోని సెక్షన్ 94(2) ప్రకారం తెలంగాణలోని వెనుకబడిన జిల్లాలు, ప్రాంతాలకు రూ.1,350 కోట్లు ఇవ్వాల్సి ఉన్నా... దీనిపై కేంద్రం ఇప్పటి వరకూ నోరు మెదపలేదు. ఇక మిషన్ భగీరథ నిర్వహణ కోసం రూ.2,350 కోట్లు, వివిధ రంగాల అభివృద్ధికి రూ. 3,024 కోట్లు, పన్నుల్లో తగ్గిన వాటా రూపంలో ఇవ్వాల్సిన మొత్తం రూ.723 కోట్ల (2020-21)ను కేంద్రమే చెల్లించాలంటూ పదిహేనో ఆర్థిక సంఘం సిఫారసు చేసింది. చెరువుల పునరుద్ధరణ (మిషన్ కాకతీయ) కోసం మరో రూ.5 వేల కోట్లు సాయం చేయా లంటూ ఆ సంఘం సూచించింది. ఇవేవీ మోడీ గారి చెవికెక్కవు. వీటితోపాటు రాష్ట్ర పునర్ విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి కేటాయిం చాల్సిన గిరిజన యూనివర్సిటీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ప్రాజెక్టులకు జాతీయ హోదా తదితరాం శాలు ఎప్పుడో అటకెక్కాయి. తెలంగాణకు రావాల్సిన ఐటీఐఆర్‌ను చెప్పా పెట్టకుండా ఇతర రాష్ట్రాలకు తరలించుకుపోయారు. వీటిపై గత బీఆర్ఎస్ సర్కారు ఇదే మోడీకి వినతుల మీద వినతులు సమర్పించింది. ఆనాటి ముఖ్యమంత్రి సహా పలువురు మంత్రులు ప్రధానిని, ఇతర కేంద్రమంత్రులను కలిసి మొరపెట్టుకున్నారు. అయినా ఫలితం లేకపోయింది. గత పదేండ్లు బీజేపీని మోసిన బీఆర్ఎస్.. ఆ తర్వాత ఇది పుల్లటి ద్రాక్షంటూ శాపనార్థాలందుకుంది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీతో సహా అన్నింటిలో అది కాషాయ పార్టీతో అంటగాకింది. తనకే ఎసరు పెడుతోందని అర్థమైన తర్వాత ఏడ్చి గీపెట్టిన ప్పటికీ రాష్ట్రానికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

ఇప్పుడు నూతనంగా అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ రథసారధి రేవంత్ కూడా రెండు మూడుసార్లు ఇవే అంశాలపై మోడీని ఢిల్లీలో కలిశారు. ఆ తర్వాత తాజాగా రాష్ట్ర పర్య టనకు ఆయన విచ్చేసిన సందర్భంగా 'విన్నపాలు వినవలె...' అంటూ విజ్ఞాపన పత్రాలు సమర్పించారు. అంతే కాదు...'రాష్ట్రానికి పెద్దన్నలా వ్యవహరించి, సాయం చేయండి...'అంటూ అర్థించారు. కొందరు విమర్శిస్తున్నట్టుగా, కొన్ని పత్రికల్లో రాసినట్టుగా ఇదేమీ తప్పు కాదు. రాష్ట్ర ప్రయోజనాల రీత్యా కేంద్రంతో సఖ్యత కోసం ముఖ్య మంత్రి, ప్రధానిని కలవటాన్ని అర్థం చేసు కోవాల్సిందే. అయితే రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ సమాఖ్య వ్యవస్థను నీరు గారుస్తున్న కేంద్ర బీజేపీ సర్కార్ వైఖరిపై ఇదే కాంగ్రె స్‌కు చెందిన కర్నాటక సీఎం సిద్ధరామయ్య హస్తినాలోని జంతర్ మంతర్ వద్ద ధర్నాకు దిగిన సంగతిని రేవంత్ మరిచిపోకూడదు.

ఇదే తరహాలో సమాఖ్య వ్యవస్థ బలోపేతం, లౌకికత్వ పరిరక్షణ, మతోన్మాదానికి వ్యతిరేకంగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇటీవల ఢిల్లీలో గళమెత్తిన సంగతినీ తెలంగాణ సీఎం గుర్తు చేసుకోవాలి. ఆయన ఉద్యమానికి తమిళ నాడు సీఎం స్టాలిన్ మద్దతు తెలిపిన విషయాన్నీ మననం చేసుకోవాలి. ఈ రకంగా దక్షిణాదిలోని మూడు రాష్ట్రాలు కేంద్రం తీరును, మోడీ సర్కారు వైఖరినీ దునుమాడుతున్న తరుణంలో మనం కేవలం వినతులు, విజ్ఞప్తులతోనే సరిపుచ్చితే అది వృథా ప్రయాసే అవుతుంది. ఇదే సమయంలో కేంద్రంతో ఘర్షణ వైఖరిని చేపడితే.. పనులు కావంటూ కేసీఆర్ పాడిన పాతపాటే అందుకుంటే ఉప యోగం ఉండదంటూ సిద్ధరామయ్యను, విజయన్‌ను, స్టాలిన్‌ను చూసైనా రేవంత్ అర్థం చేసుకుంటే మంచిది. అందుకే తెలంగాణ హక్కులు, ప్రయోజనాల పరి రక్షణకు 'బడే భాయ్‌పై చోటా భాయ్' ఆందోళనలు చేపట్టాల్సిందే. పోరాట పంథాను ఎంచుకోవాల్సిందే.

మద్దతు ధరల హక్కు : మిథ్యా ప్రచారం, వాస్తవాలు

మద్దతు ధరల హక్కుకై దేశ రైతాంగం ఎన్నో సంవత్సరాలుగా ఆందోళనలు చేస్తున్నది. మోడీ ప్రభుత్వం "2014లో మోడీ స్వయంగా చేసిన వాగ్దానాన్ని" అమలు చేయాలనేది వీరి ప్రధాన డిమాండ్. రైతులు కోరుతున్నట్లుగా మద్దతు ధరల హక్కు కల్పిస్తే, పడే ఆర్థికభారం దేశ ఆర్థిక వ్యవస్థ భరించలేదని, అస్తవ్యస్తంగా మారుతుందని మిథ్యా ప్రచారం చేయబడుతోంది. ఈ ప్రచారంలో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రొఫెసర్ అశోక్ గులాటి, ప్రజాస్వామ్యవాదిగా చెప్పుకుంటున్న జయప్రకాష్‌నారాయణ లాంటి వాళ్ళు కూడా ఉన్నారు. ఒకడుగు ముందుకు వేసి జయప్రకాష్ నారాయణ మద్దతు ధరల హక్కు కల్పన వల్ల రైతులకు కలిగే మేలుకంటే కీడే చాలా ఎక్కువగా ఉంటుందని ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి ప్రచారం రైతుల్లో ఒక విధమైన భయ వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఈ నేపథ్యంలో, మద్దతు ధరల గురించి స్పష్టమైన అవగాహన అవసరం. ఇది మన దేశానికి, దేశ ఆహార భద్రతకు, దేశ పురోగాభివృద్ధికి చాలా ముఖ్యం.



అరిబండి ప్రసాద్ రావు
9490098903

పెరిగిన మద్దతు ధరల ప్రాధాన్యత

మద్దతు ధరల వ్యవస్థ హరితవిప్లవ కాలం 1966-67 ప్రాంతంలో ఒడిదుడుకులు లేకుండా వ్యవసాయోత్పత్తి కొనసాగడానికి ఉద్దేశించబడింది. 1990 వరకు అనుసరించిన స్వయం పోష కత్వ విధానాల కాలంలో వ్యవసాయోత్పత్తిలో మద్దతు ధరల ప్రాధాన్యతను రైతులు ఎక్కువగా పట్టించుకోలేదు. 1990వ దశకం నుండి కొల్లగొట్టే స్వభావం గల సరళీకరణ ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టిన తర్వాత వ్యవసాయోత్పత్తిలో పెట్టుబడులు, ఉపకరణాల ఖర్చులు ఒకవైపు పెరుగుతూ పోతుండగా, రెండో వైపు పూర్తి ఉత్పత్తి ఖర్చులను కూడా రాబట్టుకోలేని స్థితి, రుణభారాలతో భరించలేని లక్షలాది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం చూస్తున్నాం. ఇది చాలా బాధాకరం. రైతుల సంక్షోభ పరిస్థితుల నివారణకు, సంక్షోభ నివారణకు తగిన సూచనలు చేయడానికి హరిత విప్లవ అధ్యులు డాక్టర్ స్వామినాథన్ ఉత్పత్తి ఖర్చు జోడించి రైతులకు కుటుంబ నిర్వాహణ కోసం అందాల్సిన ఆదాయాన్ని నిర్దేశించింది. సమగ్ర ఉత్పత్తి ఖర్చు సి2+ 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలన్న సూత్రం. దీనిలో "50 శాతం" రైతు కుటుంబాల మనుగడకు దక్కాల్సిన ఆదాయం. దీని పరిమాణం మీదనే రైతు కుటుంబ బాగోగులు ఆధారపడతాయి. రైతులు రెండు రకాల అస్థిరత్వాలను ఎదుర్కొంటున్నారు. వాతావరణ ఒడిదుడుకుల వల్ల మొదటిదికాగా, మార్కెట్ ధరల హెచ్చు తగ్గుదల వల్ల తమ ఆదాయాన్ని పొందలేకపోవడం రెండవది. పంట ఉత్పత్తిలోని ఒడిదుడుకులను తట్టుకోవడానికి పంటల బీమా ఉద్దేశించబడింది. మార్కెట్ ఒడిదుడుకులకు రక్షణగా మద్దతు ధరల హక్కు కోరుతున్నారు.

1.మద్దతు ధరలు ఇప్పుడు కొద్దిమందికే అందుతున్నాయి. (10-20 శాతం). దేశ విస్తార ప్రాంతంలో మద్దతు ధరలు అందడం లేదు.

ఈ విషయాన్ని కేంద్ర ధరల నిర్ణయక కమిషన్ కూడా గుర్తిస్తోంది. అసలు మద్దతు ధరలు అందించని ప్రాంతాలకు కూడా విస్తరించాలని సూచిస్తుంది. కానీ, అమలుకు నోచుకోవడం లేదు. అయితే, వ్యవసాయోత్పత్తుల కొనుగోలు, నిర్వాహణలో మార్కెట్ల వైఫల్యం వల్ల మద్దతు ధరలు పొందడానికి రైతులు మార్కెట్లను నమ్మడం లేదు. ప్రభుత్వాన్నే విశ్వసిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతుల డిమాండ్‌ను అర్థం చేసుకోవాలి.

2. మద్దతు ధరల హక్కు అమలు ఖర్చు భారీగా ఉంటుందని, ఈ ప్రభావం ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తుందనే ప్రచారం.

ఇప్పుడు మద్దతు ధర నిర్ణయిస్తున్న 23 పంటలకు హక్కును కల్పించాలంటే రూ.10-15 లక్షల కోట్ల భారం ఆర్థిక వ్యవస్థపై పడుతుందని, ఆర్థిక వ్యవస్థ విచ్ఛినం అవుతుందని ప్రభుత్వం ఇతర సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించలేదని ప్రచారం చేస్తున్నారు. కానీ వాస్తవం దీనికి భిన్నంగా ఉంది. ఎంతో అంతర్జాతీయ విశ్వసనీయత గల క్రిసిల్ సంస్థ భారత దేశంలో మద్దతు ధరల హక్కు అమలు చేయడానికి 2022-23 పంటల ఆధారంగా మొత్తం వ్యవసాయోత్పత్తి విలువ దాదాపు రూ.15 లక్షల కోట్లుగా ఉంటుందని, అమ్మకానికి వచ్చే ఉత్పత్తుల్ని మార్కెట్‌లో కొనడానికి రూ. 7-8 లక్షల కోట్లు పెట్టుబడి (రివాల్వింగ్ ఫండ్) అవసరమవుతుందని, నికరంగా ఖర్చు దాదాపు రూ. 21 వేల కోట్లు అవుతుందని అంచనా వేసింది.

మార్కెట్, మద్దతు ధరల వ్యత్యాసాన్ని (భావాంతర్ భావ్ పథకం) ప్రయివేటు మార్కెట్‌ల ద్వారా రైతులకు చెల్లింపచేస్తే ప్రభుత్వంపై పడే ఖర్చు దాదాపు రూ.50 వేల కోట్ల కన్న మించదని ఇతరులు అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఇప్పుడు రూ.47 లక్షల కోట్లు. ఇటువంటి ఆర్థిక వ్యవస్థలో రూ.50 వేల కోట్ల ఖర్చును భరించడం అంత కష్టమేమి కాదు. కావాల్సింది రాజకీయ 'సంకల్పం'. అయితే, పాలకులు ఇలా ఎందుకు నిర్ణయించలేకపోతున్నారు? అనేది ఆలోచించాలి. దీనికి ప్రధాన కారణం కేంద్ర పాలకుల ఏ పార్టీకి చెందినప్పటికీ డబ్ల్యూటిఓ నియమ నిబంధనల ప్రకారం వ్యవసాయరంగాన్ని కార్పొరేటీకరించే ప్రయత్నం. ఈ విధానాలకు కట్టుబడ్డ మోడీ ప్రభుత్వం మద్దతు ధరల హక్కు కల్పించడానికి సిద్ధంగా లేదు.



> కేవలం అధికారం చెలాయిస్తున్న వారికి మద్దతుగా ఈ మిథ్య ప్రచారం జరుగుతుంది. కొల్లగొట్టే స్వభావం గల ఆర్థిక సరళీకరణ విధానాలతో, రుణ భారాలతో రైతుల ఆత్మహత్యలు ప్రారంభం అయినప్పటి నుండి ఏదో ఒక రూపంలో ఎన్నికలకు సంబంధం లేకుండా రైతులు దేశమంతా ఆందోళన చేస్తున్నారు. అయితే, ఈ ఆందోళన దేశమంతా ఒకే విధంగా లేదు. ఇదే వేరు ముఖ్యాంశం. మిగతా రాష్ట్రాలో అంత తీవ్రంగా ఉండకపోవచ్చు. వీరెవరు ఒక రాజకీయ పార్టీని ఒడించి రాజ్యాధికారం చేబట్టాలని ఆందోళన చేయడం లేదు. వీరి ఆందోళనల "చేసిన వాగ్దానాల అమలు కోసమే". అందువల్ల, మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నికల ముందు రైతులు ఆందోళన చేస్తున్నారనేది పూర్తిగా అవాస్తవం.

ఈ విషయంలో చేసిన వాగ్దానాన్ని అమలు చేసే నైతికతను ఉంచుకోవాలని భావించడం లేదు.

3. ఏ మద్దతు ధరలు లేని వ్యవసాయోత్పత్తులు వేగంగా పెరుగుతున్నాయి. ఉదాహరణకు వార్షికంగా పౌల్ట్రీ రంగం 9 శాతం, చేపలు 7-8 శాతం, పాలు 5-6 శాతం పెరుగుతున్నాయి. కానీ, మద్దతు ధరలు ఉన్న ఏ పంటల ఉత్పత్తి మేర పెరగడం లేదు. 3-4 శాతం మధ్యనే ఈ పెరుగుదల ఉంది. (అశోక్ గులాటి).

ఈ రంగాల్లోని రైతుల స్థితిని అశోక్ గులాంటి వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని భావించాల్సి వస్తుంది. పౌల్ట్రీ రంగంలో అసలు రైతులే లేరు. ఉత్పత్తి, నిర్వహణ, అమ్మకాలు మొత్తం కార్పొరేట్ చేతుల్లో కొనసాగుతున్నాయి. పెట్టుబడి కూడా పెద్దఎత్తున అవసరమౌతుంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి ఇలా కాదు. 86 శాతం పైగా కమతాలు ఐదెకరాల కన్న తక్కువగా ఉండే చిన్న-సన్నకారు రైతులవే. వీరికి కూలీలుగా తప్ప పౌల్ట్రీ రంగంలో మరో స్థానమేమి లేదు. ఇలాంటి కార్పొరేటీకరణ జరిగితే ఇప్పుడు భూమి కలిగిన రైతులంతా కార్పొరేట్ కూలీలుగా మారాల్సి వస్తుంది. దీనిని రైతులు అంగీకరించడంలేదు.

పాల ఉత్పత్తిలో ప్రధానంగా చిన్న-సన్నకారు రైతులే ఉన్నప్పటికీ కొన్ని కారణాల వల్ల వీటి ఉత్పత్తి, సాంకేతిక మద్దతు, సేకరణ, శుద్ధి ప్రక్రియలు, అమ్మకాలు ప్రధానంగా బలమైన సహకర రంగంలో కొనసాగుతున్నాయి. ప్రయివేటు రంగం ఇది, సహకార రంగంతో పోటిపడాల్సి వస్తుంది. అయితే ఉత్పత్తి దారులకు నిర్ణయించిన ధర వస్తునప్పటికీ ఉత్పత్తి ఖర్చులను పూర్తిగా రాబట్టు కోలేకపోతున్నారు. తెలంగాణలో ఇప్పుడు లీటరు రూ.5లు సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. చేపల రంగంలో చేపలు పట్టేవారి ఆర్థిక, సామాజిక స్థితి మన చిన్నకారు రైతుల కన్నా మెరుగ్గా ఏమీ లేదు. వ్యవసాయోత్పత్తి పెరిగినంత మాత్రాన దానిమీద ఆధారపడే వారి జీవితాలు కూడా మెరుగుపడతాయని ప్రస్తుత పరిస్థితుల్లో భావించలేం. ఇలా లేనందువలనే రైతులు మద్దతు ధరల హక్కును డిమాండ్ చేస్తున్నారు. వీరు మార్కెట్‌లను విశ్వసించడం లేదు.

4.మద్దతు ధరల హక్కు రైతులకు మేలు చేసే దానికన్న కీడే ఎక్కువగా చేస్తుంది. దీనికి బదులుగా ఉత్పత్తి-వినియోగదారుల మధ్య తుల్యత (లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్) కల్పించాలి. మద్దతు ధర హక్కుకు బదులు ఇతర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలి. (జయప్రకాశ్ నారాయణ).

రైతులు ఊహాలోకంలో జీవించడం లేదు. నిజ ఆర్థిక వ్యవస్థలో జీవిస్తున్నారు. గిట్టుబాటు ధరలను కల్పించడంలో ప్రయివేటు మార్కెట్‌ల వైఫల్యం వలనే ప్రభుత్వం నుండి మద్దతు ధరల హక్కును డిమాండ్ చేస్తున్నారు. మద్దతు ధరలు నిర్ణ యంలో ఉత్పత్తి ఖర్చులతోపాటు ఆర్థిక వ్యవస్థ, సామాజిక పరిస్థితులపై చూపగల ప్రభావం, అంతర్జాతీయ మార్కెట్ ధరల పరిస్థితుల లాంటి అంశాలను మద్దతు ధరల సూచించే సమయంలో పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశిస్తుంది. అందువల్ల, ఆర్థిక వ్యవస్థపై మద్దతు ధరల హక్కు తీవ్ర దుష్ప్రభావం కలిగి ఉంటుందనే ప్రచారం వాస్తవం లేదు.

జయప్రకాశ్ నారాయణ వాదన సర్వగర్భంగా కార్పొరేట్‌లకు అనుకూలంగా ఉంటుంది. వారి రాజకీయ ప్రస్థానం కార్పొరేట్‌ల ఫైనాన్స్‌తో (డెమోక్రోటిక్ ఫౌండేషన్ అనే పేరుతో ఉన్న అమెరికన్- ఇండియన్ కార్పొరేట్లు ఆర్థిక సహాయంతో) ప్రభుత్వయేతర సంస్థగా (ఎన్‌జిఓ) లోక్ సత్తా ప్రారంభమై రాజకీయ రూపుదిద్దుకుంది. ఈ నేపథ్యంలో, వీరి అభిప్రాయాల్ని అర్థం చేసుకోవాలి.

5. రైతులు ఎన్నికల సందర్భంలోనే ఆందోళన చేస్తున్నారు?దీని రాజకీయ అంతర్గతం అర్థం చేసుకోవాలి.

ఇది పూర్తిగా అవాస్తవం. కేవలం అధికారం చెలాయిస్తున్న వారికి మద్దతుగా ఈ మిథ్య ప్రచారం జరుగుతుంది. కొల్లగొట్టే స్వభావం గల ఆర్థిక సరళీకరణ విధానాలతో, రుణ భారాలతో రైతుల ఆత్మహత్యలు ప్రారంభమైనప్పటి నుండి ఏదో ఒక రూపంలో ఎన్నికలకు సంబంధం లేకుండా రైతులు దేశమంతా ఆందోళన చేస్తున్నారు. అయితే, ఈ ఆందోళన దేశమంతా ఒకే విధంగా లేదు. ఇదే వేరు ముఖ్యాంశం. మిగతా రాష్ట్రాలో అంత తీవ్రంగా ఉండకపోవచ్చు. వీరెవరు ఒక రాజకీయ పార్టీని ఓడించి రాజ్యాధికారం చేబట్టాలని ఆందోళన చేయడం లేదు. వీరి ఆందోళనలు "చేసిన వాగ్దానాల అమలు కోసమే". అందువల్ల, మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నికల ముందు రైతులు ఆందోళన చేస్తున్నారనేది పూర్తిగా అవాస్తవం. రైతులు తమ వృత్తి మనుగడకోసం, రుణ భారాల నుండి బయట పడి రాజ్యాంగం అందించిన హక్కులను ఇతర పౌరులతో సమానంగా అనుభవించడానికి మాత్రమే ఆందోళన చేస్తున్నారు. అందువల్ల, మద్దతు ధరలకు హక్కు కల్పించడానికి అడ్డుపడే విధంగా చేస్తున్న మిథ్య ప్రచారాల్ని అర్థం చేసుకోవాలి. దేశంలో సగం పైగా జనాభాకు (54 శాతం పైగా) ఉపాధిని, కుటుంబాలను, దేశ ప్రజల ఆహార భద్రతను, దేశ స్వాతంత్ర్యాన్ని రక్షిస్తూ పరాయీకరణను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా పోరాడుతున్న రైతు ఉద్యమానికి మద్దతునివ్వడం నిజమైన దేశభక్తికి ప్రతీక.

ఎవరికీ గ్యారంటీ? ఇంకెన్నాళ్లిస్తారు?

"మోడీ కా గ్యారెంటీ" అనే శీర్షిక దాదాపు ప్రతిరోజు ప్రధాన పత్రికలన్నింటిలో ఆయా పత్రికల పేరుతో పాటు లేదా అంతకుమించిన ప్రాధాన్యతతో ప్రచురించబడుతున్నది. పదేండ్ల కింద కరెంటూ, రోడ్డు రవాణా మార్గాలే లేనట్లు, అసలు వంటగ్యాస్ గురించి తెలియక దేశ మహిళలంతా గత 70 ఏండ్లుగా కట్టెల పొయ్యిల్లోనే పడి కాలిపోతున్నట్టు, ఆర్థిక వ్యవహారాలే జరగనట్టు, భారత దేశ పటం అంతర్జాతీయంగా ఇప్పుడే ప్రింట్ చేసినట్టు పటారం జరుగుతోంది. ఇంతటితో ఆగక ఆరు వేల కోట్ల రూపాయలను వెచ్చించి "సెల్ఫీ విత్ మోడీ" అంటూ మోడీ ఫొటోలను ప్రధాన కూడళ్లలో పెట్టి సెల్ఫీ దిగడానికి కూడా బలవంత పెడుతున్నారు.



జి.తిరుపతయ్య
9951300016

అంతర్జాతీయంగా పలుదేశాలు భారతదేశాన్ని మొదట్లో ల్యాండ్ ఆఫ్ గాంధీ, ల్యాండ్ ఆఫ్ నెహ్రూ అని సంబోధించేవారట, ఇప్పుడు మోడీ కా భారత్ అంటున్నారు! ల్యాండ్ ఆఫ్ గాంధీ అంటే శాంతికి చిహ్నమని, ల్యాండ్ ఆఫ్ నెహ్రూ అంటే సౌభ్రాతృత్వానికి చిహ్నమని చెబుతారు, మోడీ కా భారత్ అంటే నిరసనలను నిలువెత్తునా అణచివేసి ఒకే దేశంలోని ఒక సమూహం వేరొక సమూహంపై ఆధిపత్యం సాధించే క్రమం అంటు నెటిజన్లు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారంలో అభిప్రాయపడుతున్నారు. ప్రజాస్వామ్యంలో వ్యక్తి కన్నా సమిష్టికి ప్రాధాన్యత. కానీ వ్యక్తిని మితిమీరి కీర్తించడం రాజరికాల్లో లేదా ఏకస్వామ్యంలో మాత్రమే సాధ్యం. ప్రజాస్వామ్యమంటే మెజారిటీ వాదమనే నినాదాన్ని దాదాపు ఖరారు చేసినట్టే దేశంలో! భారత రాజకీయాలలో గ్యారెంటీగా భక్తి, మతము అనే రెండు కాగడాలతో ఎన్నికల రంగం సిద్ధమవుతోంది. ఈ కాగడాలను అంగీకరించిన వారు వాటి వెలుగులో ఉంటారు వ్యతిరేకించిన వారు వాటిచే కాల్చివేయబడతారు అనే విధమైన బలవంతం కూడా ముందుకొస్తున్నది. ఇంతటి భయంకర వాతావరణంలోనూ నిర్లక్ష్యానికి గురౌతున్న ప్రధాన అంశాలను ప్రస్తావించాల్సిందే, అవి చివర్లో రాస్తాను. ఏమి సాధించామో మరేమి గ్యారెంటీగా సాధించబోతున్నామో కాలమే నిర్ణయిస్తుంది. కానీ పటిష్టమైన నాయకత్వం నుండి బలిష్టమైన నాయకుడి వైపు దేశం వాలిపోతుంది! ఇది ప్రమాదానికి సంకేతం. మోదీకా గ్యారెంటీ అంటే ఎవరికి గ్యారెంటీ అనేది మొదటగా ఉత్పన్నమయ్యే ప్రశ్న. అంర్జాతీయంగా దోషిగా నిలబెట్టబడిన మనిషి అదానీని పార్లమెంటు సాక్షిగా వెనకేసుకొచ్చి, కుంభకోణాల సూత్రదారికి కుర్చీ వేసి మళ్లీ ప్రపంచ ప్రథమ స్థానానికి చేర్చే గ్యారంటీయైతే అది వద్దు. మండుతున్న మణిపూర్‌ను గాలికొదిలి బెంగళూరులో బంతి పూలవర్షం కురిపించుకునే సంస్కృతి గ్యారంటీగా వద్దు.



> వెలుగుతున్న కొవ్వొత్తిని మాత్రమే ప్రచారంలో పెట్టి దానికింద సమిధలైన మొత్తం జాతిని చీకట్లో పడేసిన వాస్తవాలను ఈ మధ్యనే గోల్డ్ మాన్ సాక్స్ అనే ప్రఖ్యాత రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్ వెలువరించింది. ఈ దేశ తలసరి ఆదాయం అధికారికంగా రూ .1,73,000. మింట్ పత్రికలో వెలువడిన పైన పేర్కొన్న నివేదిక ప్రకారం 49.7శాతం అనగా దాదాపు 50 శాతం దేశ ప్రజల(ఉపాధిలో పాలుపంచుకుంటున్న వారు మాత్రమే, వర్కింగ్ ఏజ్ పాపులేషన్) ఆదాయం 1,25,000 కన్నా తక్కువగా ఉన్నది. అనగా సగం జనాభా నెలసరి ఆదాయం పదివేల రూపాయల కన్నా తక్కువ, అనగా రోజువారి రూ.334 కన్నా తక్కువ.

వెలుగుతున్న కొవ్వొత్తిని మాత్రమే ప్రచారంలో పెట్టి దానికింద సమిధలైన మొత్తం జాతిని చీకట్లో పడేసిన వాస్తవాలను ఈ మధ్యనే గోల్డ్ మాన్ సాక్స్ అనే ప్రఖ్యాత రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్ వెలువరించింది. ఈ దేశ తలసరి ఆదాయం అధికారికంగా రూ .1,73,000. మింట్ పత్రికలో వెలువడిన పైన పేర్కొన్న నివేదిక ప్రకారం 49.7 శాతం అనగా దాదాపు 50 శాతం దేశ ప్రజల (ఉపాధిలో పాలుపంచుకుంటున్నవారు మాత్రమే, వర్కింగ్ ఏజ్ పాపులేషన్) ఆదాయం 1,25,000 కన్నా తక్కువగా ఉన్నది. అనగా సగం జనాభా నెలసరి ఆదాయం పదివేల రూపాయల కన్నా తక్కువ, అనగా రోజువారి రూ.334 కన్నా తక్కువ. 20.3శాతం ప్రజల వార్షిక ఆదాయం 1,25,000 నుండి 2,10,000 మధ్యలో నమోదవుతున్నది. 18.1 శాతం ప్రజల ఆదాయం రెండు లక్షల పదివేల రూపాయల నుంచి, నాలుగు లక్షల పదివేల రూపాయల మధ్య ఉన్నది, 7.8శాతం ప్రజల ఆదాయం 4లక్షల పదివేల నుండి 8 లక్షల 30 వేల ఆదాయంగా ఉన్నది. 4.1శాతం ప్రజల ఆదాయం 8లక్షల30 వేల పైన వున్నదని తేలింది. ఇవి నమోదైన గణాంకాలు. 2020-23 ఆర్థిక సంవత్సరాలలో ఇదే జాబితాకు సంబంధించిన వారి ఆదాయాల పెరుగుదల లేదా పెరుగుదల శాతాలను గమనిస్తే....49.7శాతం ప్రజల వార్షిక ఆదాయం మైనస్ 2.5శాతంగా నమోదయింది. 20.3శాతం ప్రజల వార్షిక ఆదాయం మూడు శాతం వృద్ధి సాధించగా 18.1శాతం ప్రజల ఆదాయం 6.9 శాతం వృద్ధి సాధించింది. 7.8శాతం ప్రజల ఆదాయంలో 10.4శాతం వృద్ధి కనపడగా 4.1శాతం ప్రజల ఆదాయం 12.6శాతంగా పెరిగినట్లు వెలువడింది. ఈ ఆదాయార్జితాల నిష్పత్తులను బట్టి స్పష్టంగా అర్థమయ్యేది ఏమంటే తక్కువ ఆదాయం కలిగిన వాళ్ళ మైనస్‌లో గాని లేదా అతి తక్కువ వృద్ధితో గాని కనపడితే ఎక్కువ ఆదాయం కలిగిన వాళ్ళ ఎక్కువ శాతం వృద్ధిని చేజిక్కించుకుంటున్నారు. దేశ జీడీపీ పెరుగుతుంది, స్టాక్ మార్కెట్ దూసుకుపోతుంది ప్రపంచంలో 5,4,3వ ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతుంది.ఇవన్నీ సరే ప్రపంచంలో ఎక్కడ లేనంతగా ఈ దేశంలో పనిచేసే వారిలో సగం మంది విపరీతమైన దోపిడీకి గురవుతున్నారు. దీనికి వారి దురదృష్టం కాదు ఆ దోపిడీకి అవకాశం కల్పిస్తున్న పరిపాలన విధానాలు. దీనికి పరిష్కారం కనుగొనబడే గ్యారెంటీని ఇవ్వకపోతే రాత్రిపూట విందు సందర్భంగా వెలుగు తగ్గిందని ఖైదీలను కాల్చివేసి తద్వారా రగిలిన కార్చిచ్చులో చిందులేసిన నీరో చక్రవర్తికి మనకి తేడా ఉండదు.

గడచిన పదేళ్ల గ్యారెంటీని ఒకసారి పరిశీలిద్దాం..

ప్రజాస్వామ్యమంటే సంఖ్యకు పరిమితమా? ఎలాగైనా చేసి మెజారిటీ సంఖ్యను పొందితే సరిపోతుందా? ఈ ప్రశ్నకు సమాధానం అవును అని గత పదేండ్ల పాలన స్పష్టం చేస్తుంది. గత నెల ఛండీగర్‌లో మేయర్ ఎలక్షన్స్ సందర్భంగా రిటర్నింగ్ అధికారి బ్యాలెట్ పేపర్లను చెల్లనివిగా మార్చేక్రమం సీసీటీవీలో నమోదయింది కాబట్టి సుప్రీంకోర్టు మొట్టికాయలు వేస్తూ 'ప్రజాస్వామ్యాన్ని మర్డర్ చేయకండి' అంటూ తిట్టిపోసి, ఎన్నికను రద్దు చేసి ప్రజాస్వామ్యాన్ని రక్షించింది. ఉత్తర భారత్‌లో కొందరు అభ్యర్థులు ఈవీఎంలను తస్కరించి ఎత్తుకుపోతున్నారు. వీటిపైన ఎలాంటి చర్యలకు అధికారులు ఉపక్రమించలేదు. భారత ఎన్నికల కమిషన్ ఒక స్వతంత్ర సంస్థ, దాని స్వతంత్రతను కాపాడడానికి కమిషనర్ల ఎన్నిక ఏకపక్షంగా ఉండకూడదని త్రిసభ్య కమిటీని- ప్రధానమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాలను సభ్యులుగా పాటిస్తూ వస్తున్నారు. దీనిని తోసి రాజని చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాను తొలగిస్తూ ప్రధానమంత్రి తమ మంత్రివర్గంలోని ఒకరిని నామినేట్ చేయొచ్చు అన్న కొత్త ప్రతిపాదనను సాధించుకున్నారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి వంతపాడుతూ ఉంటుంది,వారు కావాలనుకున్నప్పుడే ఎన్నికల తేదీలను ప్రకటిస్తుంది అది పూర్తిగా ఏకపక్షం ఉన్నది అని ప్రశాంతి కిషోర్ లాంటి వాళ్లు అనేకసార్లు వాపోయారు. ఇకనుండి ఆ అవసరమే ఉండదు ఎందుకంటే ముగ్గురు సభ్యుల్లో ఇద్దరు ఒకే పార్టీకి చెందినవారు కాబట్టి. 2019 ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అధికారికంగా ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన వివరాల ప్రకారం రూ. 1,264 కోట్ల ను ఖర్చు చేసింది. కమిషన్ నిబంధనల ప్రకారం ఒక పార్లమెంటు సభ్యుడు రూ.95లక్షల కన్నా ఎక్కువ ఖర్చు చేయకూడదు. అలాంటప్పుడు రూ.415 కోట్ల కన్నా ఎక్కువ ఖర్చుకాకూడదు. మరి 1,264 కోట్లు ఖర్చుపెట్టినప్పుడు ఎన్నికల కమిషన్ ఏం చేస్తూ కూర్చున్నట్టు? సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ అనే సంస్థ ప్రకారం ఒక్క బీజేపీ 2019 ఎన్నికలలో రూ.27 వేల కోట్లు ఖర్చు పెట్టిందట. ఈ దేశంలో హార్స్ ట్రేడింగ్ (అభ్యర్థులను కొనుగోలు చేసి ప్రభుత్వాలను మార్చడం) చాలా బాహాటంగా జరుగుతుంది. రిసార్ట్ పాలిటిక్స్ అంటూ దానికి పేరు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ద్వారా రెయిడ్ చేయబడిన అనేకమంది ప్రతిపక్ష నాయకులు వ్యాపారులు బీజేపీలోకి చేరిపోతే శుద్ధ నీతిమంతులు అవుతున్నారు. ఈ అంశాలన్నీ ఎన్నికల కమిషన్ పరిశీలించాల్సిన అవసరం లేదా? సుమోటోగా కేసులను స్వీకరించాల్సిన అవసరం లేదా? ఇదే పదేళ్ల గ్యారెంటీలో గతంలో ఎందు లేనంతగా గవర్నర్ల వ్యవస్థ దిగజారిపోయింది. కేరళ, తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, మహారాష్ట్ర, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాలలో గవర్నర్లు ప్రత్యామ్నాయ ప్రభుత్వంగా వ్యవహరిస్తున్నారు. దీనికి కేంద్రం వత్తాసు పలకడం లేదంటే నమ్మగలమా? మీడియా మొత్తాన్ని తమ గుప్పిట్లో పెట్టుకున్న ఘనత ఈ పదేండ్ల గ్యారెంటీలోనే మనం చూడగలం. దూరదర్శన్ ఛానెళ్లలో ఇతరులకు అవకాశం లేదు. కాస్త కూస్తో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎన్.డి టీవీని హస్తగతం చేసుకున్నారు. అడ్వర్‌టైజ్‌లన్నీ కేవలం ప్రభుత్వానికి వత్తాసు పలికే మీడియా హౌసెస్‌కు మాత్రమే వెళుతున్నాయి. నాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ 62సార్లు నిషేధం లేని, కనీసం వంద మందికి తగ్గకుండా రిపోర్టర్లను ఆహ్వానించి, ప్రెస్‌మీట్లు నిర్వహించారు. కానీ ఈ పదేళ్ల కాలంలో నిషేధంతోనైనా ఒక్క ప్రెస్‌మీట్ కూడా నిర్వహించబడలేదు. ఈ పద్ధతిని పునరావృతం చేసే గ్యారంటీ వద్దు.

వీటికి గ్యారంటీ ఇవ్వండి...

దేశ ప్రజలకు గ్యారంటీలు కావాలి, వాటిని పాలకులు నెరవేర్చాలి కూడా. మొట్టమొదటిది మత సామరస్యం. అది కర్ర పెత్తనం కాదు, క్లాస్ రూములోనిదైనా సరే! కోర్టు రూములోనో లేదా పోలీసు స్టేషన్‌లోనో కనిపించే నిశ్శబ్ద శాంతి కాదు. భక్తి దేవుడిపై శ్రద్ధ కన్నా పక్క వాడిపై అధిపత్యాన్ని సాధించానన్న ద్వేశానికి ప్రతీకగా మారింది, దానికి విరుగుడు కావాలి. ప్రతిపక్ష పార్టీలు, ప్రభుత్వాలను ప్రశ్నించే గొంతుకలను బద్ధ శత్రువులుగా భావించే విధానానికి స్వస్తి చెప్పే గ్యారంటీ కావాలి, దేశాభివృద్ధి ద్వేషంలోంచి ఏర్పడిన ఐక్యతలో లేదని గుర్తించాలి. రెండవది, ఎన్నికలు, ప్రభుత్వాల ఏర్పాటు/ కూలదోత, ఆ తరువాతి పరిపాలనా, ఆశ్రిత పక్షాపాతాలు ఇప్పుడున్నట్లుగా కాకుండా! ధర్మము, సంస్కృతీ, దేశ భక్తీ ఎన్నికల అస్త్రాలు చేయరాదు. మూడవది, వందశాతం అక్షరాస్యతకు హామీ. నాల్గవది, నమోదైన వృద్ధి నాదని చెప్పే ముందు స్థిరమైన ఉపాధి లేక తిరోగమన ఆదాయాలతో సమిధలౌతున్న వారికి ఉపశమనం కేవలం రాజకీయాల్లో లేదని గుర్తించాలి, దానికి కారకులౌతున్న కార్పొరేటీకరణకు ముకుతాడు వేయకపోతే గ్యారంటీగా నష్టపోతాము. ఇక ఐదవది, జీఎస్టీ పేరు మీద సొమ్మంతా తమ ఖజానాలోనే పడేట్టు చేసుకుని రాష్ట్రాలు తమ వాటా కోసం ఢిల్లీలో ధర్నాకు దిగే పరిస్థితి వుండకూడదు. ఇక పరోక్ష పన్ను విధానం ద్వారా పేదలనుండి 65శాతం రెవెన్యూను రాబట్టుకుని మరింత పేదరికంలో నెట్టే విధానానికి చరమగీతం పాడాలి.

తునికాకు సేకరణ-ఆదివాసుల హక్కు




కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో వ్యవసాయం తర్వాత తునికాకు సేకరణ రెండోపంటగా ముఖ్యమైన ఆదాయవనరుగా ఉంది. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ రెండు ఫారెస్ట్ డివిజన్‌లు. ఆసిఫాబాద్‌లో 12, కాగజ్‌నగర్‌లో 13, మొత్తం 25 యూనిట్లు, 250కి పైగా కల్లాలుండేవి. దాదాపు 30 వేల మంది కూలీలు ప్రతి సీజన్‌లో ఆకుసేకరణలో భాగస్వాములవుతారు. వీరితో పాటు గోడౌన్ కార్మికులు, ట్రాన్స్‌పోర్ట్, కల్లేదార్లు, ఉపాధి పొందుతారు. కాంట్రాక్టర్లకు లక్షల రూపాయల ఆదాయం లభిస్తుంది. ప్రభుత్వానికి సైతం ఎటువంటి పెట్టుబడి (ఖర్చు) లేకుండా ఆదాయం వస్తుంది. ఆకుసేకరణపై ఆధారపడి బీడీ పరిశ్రమ ఉంది. ఈ పరిశ్రమపై వేల కార్మికులు ఉపాధి పొందుతారు. ఆకు విదేశాలకు ఎగుమతై విదేశీ మారకం కూడా వస్తుంది. దీని ద్వారా ఈ ఒక్క సీజన్‌లోనే దాదాపు 25 వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుంది.

ఇదంతా ఒక ఎత్తయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల ఉపాధికొట్టే ప్రయత్నాలు శరవేగంగా అమలు చేస్తున్నది. అటవీ ప్రయివేటీకరణ నిబంధనలకు తలొగ్గి పెద్దపులులు సంచరిస్తున్నాయనే పేరుతో ఈ ఏడాది సీజన్‌లో తునికాకు సేకరణ నిలిపివేయాలని, ఫారెస్ట్ ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి నివేదిక పంపినట్టుగా వార్తలొచ్చాయి. అధికారులతో మాట్లాడి కాస్తా కూపీలాగితే ఇది వాస్తవమేనని తెలిసింది. 2006-అటవీ హక్కుల చట్టం ప్రకారం తునికాకు సేకరణ చిన్న తరహా అటవీ ఉత్పత్తుల కిందకు వస్తుంది. తునికాకును సేకరించడం వారి హక్కు. పులులను రక్షించాల్సిన బాధ్యత కూడా అటవీశాఖపై ఉంది. కానీ ఈ పులుల సాకుతో ఆకు సేకరణ నిలిపేయడం ఎంతమాత్రం సరికాదు. ఆసిఫాబాద్ డివిజన్‌లో కవ్వాల్ టైగర్‌జోన్, మైనింగ్ పేరుతో ప్రతి ఏడాది యూనిట్లు తగ్గిస్తూ వచ్చారు అటవీశాఖ అధికారులు. గతేడాది కేవలం 2 యూనిట్లకే టెండర్లు పిలిచారు. కాగజ్‌నగర్ డివిజన్‌లో కడంబ టైగర్‌జోన్ పేరుతో గతేడాది 13 యూనిట్లకుగాను 9 యూనిట్లు టెండర్లు పిలిచారు. ఈ విధంగా ప్రతి ఏడాది యూనిట్లు, కల్లాలు తగ్గుతూ వచ్చాయి. ఈ ఏడాది 2024 సీజన్‌కి గాను మొత్తం ఆకు సేకరణ నిలిపేయాలనే ఆలోచన చేయడం ఆదివాసులు, దీనిపై ఆధారపడి జీవించే పేదకూలీల కడుపు కొట్టడమే.

'తునికాకు సేకరణ లేనట్టే' అని వార్తా పత్రికల్లో రాగానే తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం (టీఏజీఎస్) స్పందించింది. జిల్లా కలెక్టర్‌కు టెండర్లు పిలవాలని వినతిపత్రం అందజేసింది. దీనికి స్పందించిన కలెక్టర్ ఫారెస్ట్ చీఫ్ కన్వీనర్‌కి లేఖ రాశారు. తర్వాత, తునికాకు కల్లేదార్‌లు సమావేశం నిర్వహించి, జిల్లాలోని ఎమ్మెల్యేలకు వినతి పత్రాలిచ్చే కార్యక్రమాలను అమలుచేశారు. దశలవారిగా పోరాటాలూ నిర్వహించారు. జనవరి 29న ఆసిఫాబాద్ జిల్లాలోని అటవీశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిఎఫ్‌ఓకి మెమోరాండం అందజేశారు. టీఏజీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి సైతం వినతిపత్రం అందజేయడంతో పోరాటానికి దిగొచ్చిన ప్రభుత్వం, అటవీశాఖ జిల్లాలోని 15 యూనిట్లు,179 కల్లాలకు టెండర్లు ఆహ్వానించింది. ఇంకా యూనిట్లు అధికారులు పరిశీలించి, టెండర్ల అనంతరం ఎన్ని యూనిట్లు ఓకే చేస్తే ఆ గ్రామాల పరిధిలో కూలీలకు ఉపాధి దొరుకుతుంది.ఇది టీఏజీఎస్ కూలీల తరపున పోరాడి సాధించిన విజయం. తునికాకు సేకరణకు ఏర్పాటు చేసిన యూనిట్ల ద్వారా వచ్చిన డబ్బులు మళ్లీ మార్కెట్‌లోకి వస్తే వ్యాపారాలు పెరుగుతాయన్న విషయం తెలియనిది కాదు.

ఇదే సందర్భంలో 2016 నుండి తునికాకు బోనస్ పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే. అనేక పోరాటాల ఫలితంగా ఎన్నికల ముందు గత ప్రభుత్వం హడావిడిగా కొన్ని చెక్కులు పంపిణీ చేసింది. జిల్లాలో దాదాపు 45 వేల మంది కూలీలకు బోనస్ రావాల్సి ఉండగా ఇంకా 8,300 మందికి పెండింగ్‌లో ఉంది. పెండింగ్ బోనస్ కూడా పోరాడితేనే వస్తుందన్న విషయం గమనంలో ఉంచుకోవాలి. కల్లాలు ఎలాగైతే పోరాడి సాధించు కున్నారో, బోనస్ సాధించడం కోసం కూడా కూలీలు ఏకమై పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.



- కోట శ్రీనివాస్, 970339151

8న ఉచిత కార్ వాష్

- మహిళా దినోత్సవం సందర్భంగా మహిళకు భారీ డిస్కౌంట్
- కార్ ఇన్ ఆటోమార్ట్ చైర్మన్ అబ్దుల్ అజీమ్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 8న, ఖమ్మంలోని సెల్ఫ్ డ్రైవింగ్ చేసే మహిళాలకు ఉచిత కార్ వాష్ సేవ అందిస్తామని కార్ ఇన్ ఆటోమార్ట్ యాజమాన్యం ఒక ప్రకటన లో తెలిపారు. అదనంగా, రోజును మరింత ప్రత్యేకంగా చేయడానికి, అన్ని ఇతర ఉపకరణాలు 50శాతం అదనపు తగ్గింపుతో అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్ ఇన్ ఆటోమార్ట్ చైర్మన్ అబ్దుల్ అజీమ్ మాట్లాడుతూ గతంలో మహిళా వాహన యజమానులకు ప్రత్యేకంగా డ్రైవర్లు ఉండేవారు కానీ ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ మహిళలు పురుషులతో పోటీ పడుతూ ఏ విషయంలోను ఇతరులపై ఆధారపడకుండా స్వతంత్రంగా తమ పనులు తాము చేసుకుంటున్నారు. తమ వాహనాలు తామే డ్రైవ్ చేసుకుంటున్నారు. ఇది చాలా మంచి పరిణామంఅని అన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే తామే స్వయంగా డ్రైవ్ చేసుకొనే ఆత్మ విశ్వాసం వారిలో రావడం మంచి పరిణామం అన్నారు. అలాంటి మహిళలను ప్రోత్సహించే ఉద్దేశంతో, మరి ముఖ్యంగా అన్ని రంగాల్లో అపూర్వ విజయాలను సాధిస్తున్న మహిళల పట్ల గౌరవంతో ఆఫర్ అందిస్తున్నామని తెలియచేసారు.



ఉమ్మడి ఖమ్మం జిల్లా మహిళా ప్రాంగణం అధ్యక్షురాలు, ఉపాధి కల్పనా అధికారి వేల్పుల విజేత ఈ ఆఫర్ పట్ల హర్షం వ్యక్తం చేసారు. కార్ ఇన్ ఆటోమార్ట్ సంస్థ ఎల్లప్పుడూ సమాజ సేవ విషయంలో అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఈ సందర్భంగా తెలియ చేసారు.

వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి సండ్ర పరామర్శ

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని పెద్దకోరుకొండి గ్రామానికి చెందిన వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాతృమూర్తి ఇటీవల మరణించగా బుధవారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వరుదుని ఆశీర్వదించిన సండ్ర

చంద్రుపట్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు వైకుంఠపు కృష్ణారావు కళారాణి కుమారుడు నరేష్, వధువు నాగజ్యోతిల వివాహ వేడుకల్లో పాల్గొని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య వరుడు నరేష్ ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట జెడ్పీటీసీ కట్ట అజయ్ కుమార్, ఎంపీపీ బీరవెల్లి రఘు, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ బోబోలు లక్ష్మణరావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ కాటంనేని వెంకటేశ్వరరావు, చంద్రు పట్ల మాజీ సర్పంచ్ గొల్లమందల ప్రసాద్, గ్రామ శాఖ అధ్యక్షులు నాయకులు వల్లభనేని శ్రీనివాసరావు, వల్లభనేని రవి, జక్కంపూడి కిషోర్, రవి, బొక్క వెంకటేశ్వర్లు, విశ్వనాథం, గోసు రమణయ్య, నరసయ్య, సిహెచ్ కిరణ్ కుమార్, సతీష్, వాచనాయక్ తండ నాయకులు నేపాల్ కృష్ణ, రాములు, లక్ష్మణ్, చారి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలో కల్లూరు, పుల్లయ్య బంజర, కిష్టయ్య బంజర గ్రామాల మధ్యలో గల రహదారి ఏర్పాటుకు అధికారులు బుధవారం శ్రీకారం చుట్టారు. కల్లూరు కాశ్మీర మహదేవర క్షేత్రం దేవస్థానం నందు జరుగు మహాశివరాత్రి ఉత్సవాలు 7, 8, 9 తేదీలలో జరగబోవు జాతరను పురస్కరించుకొని సత్తుపల్లి శాసనసభ సభ్యులు మట్ట రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు అధికారుల పర్యవేక్షణలో కిష్టయ్య బంజర గ్రామం నుండి నాగుల చెరువు కట్టమీదుగా శివాలయం వరకు ఉన్నటువంటి చెట్లను జేసీబీ సహాయంతో తొలిగించారు. కిష్టయ్య బంజర గ్రామ కాంగ్రెస్ కమిటీ పసుపులేటి శ్రీనివాసరావు, జంగం నరసింహారావు, వాడపల్లి శ్రీనివాసరావు, తండు రాములు, వేల్పులు కిరణ్, జంగం చిన్న కృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనితోపాటు ఎమ్మెల్యే రానున్న రోజుల్లో కిష్టయ్యబంజర్ గ్రామం నుంచి నాగుల చెరువుకట్ట మీదగా పుల్లయ్యబంజర బీటి రోడ్డు వరకు కిలోమీటర్ మేరకు బీటీ రోడ్డు మాజూరు చేస్తానని ఎన్నికల ప్ర చారంలో హామీ ఇచ్చారు. శివాలయానికి నలుమూలల ఉన్నటువంటి గ్రామాల భక్తులు ముఖ్యంగా తల్లాడ, కల్లూరు మండలాల పరిధిలోగల గ్రామాలు రంగం బంజర, పాయపూరు, విశ్వనాథపురం ముచ్చారం, ఓబులరాబంజర, యజ్ఞనపురం, లింగాల, చెన్నూరు, పెద్ద కోరుకొండి, బోడిమల్లే, కప్పల బంధం, బత్తులపల్లి, తూర్పులోకారం, పడమటిలోకారం, పుల్లయ్య బంజర, కిష్టయ్య బంజర, లక్ష్మా తండా, హనుమా తండా, మలుసూర్ తండా సంబంధించిన ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

అమ్మర్లపూడి అమృతమ్మకు సీపీఐ(ఎం) నివాళి

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సానుభూతిపరాలు అమర్లపూడి అమృతమ్మ(60) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, నల్లమోతు మోహన్ రావు, పులి వెంకట నరసయ్య తాళ్లూరు రాములు జానీ నాగులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మారాళ్ళ మల్లికార్జున్ నివాళులర్పించారు.

ధరణి సమస్యలపై రైతు సంఘం సర్వే

నవతెలంగాణ-తల్లాడ



ధరణి సమస్యలపై తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని నూతనకల్ గ్రామంలో బుధవారం నాయకులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ మాట్లాడుతూ డిజిటల్ పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి రైతులకు సమస్యగా మారిందని, ప్రతి రైతుకు ధరణి సమస్య ఉందని పాత పట్టాదార్ పాస్ పుస్తకం ఉన్న, ఆన్లైన్లో ఉన్న బంచరాయి, గట్టు భూములకు, ఇనాం భూములకు, మాన్యాలకు, పొజిషన్లో ఉన్న భూములకు సాగులో ఉన్న భూమికి సర్వేనెంబర్‌కు తేడాలు ఉన్నాయని, తదితర కారణాలు రైతు సంఘం దృష్టికి వచ్చాయన్నారు. వాస్తవ సాగుదారులందరికీ సమగ్ర భూ సర్వే నిర్వహించి, ధరణిలో చేర్చి, డిజిటల్, పాస్ పుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. భూమి ఉండి ధరణి సమస్యల ఫలితంగా రైతుబంధు బ్యాంకు రుణాలకు అర్హత లేకపోవడం, ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించడం వలన రైతుల నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతు సమస్యలపై దృష్టి సారించిసారించి, పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు సేలం సత్యనారాయణ రెడ్డి, నల్లమోతు మోహన్ రావు, అయినాల రామలింగేశ్వర రావు, కళ్యాణ కృష్ణయ్య, కళ్యాణపు నాగేశ్వరరావు, చల్లా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని కోర్లగూడెం గ్రామ రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్సింగ్ అనుసంధానం కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్ట రాగమయ దయానంద్ పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హైద్రాబాద్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త ఫణి కుమార్, మండల ప్రత్యేక అధికారి కే. సునీత, వ్యవసాయ సహాయ సంచాలకులు యు.నరసింహారావు, తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి ఎం.రూప, ఐదు మండలాల అధికారులు విస్తరణ అధికారులు రైతు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

శిక్షణ కలెక్టర్ మాయాంక్ అగర్వాల్

నవతెలంగాణ-ముదిగొండ



వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని శిక్షణ కలెక్టర్ మాయాంక్ అగర్వాల్ అధికారులకు ఆదేశించారు. బుధవారం శిక్షణ కలెక్టర్ మయాంక్ అగర్వాల్ ముదిగొండ, న్యూలక్ష్మీపురం గ్రామాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీల పరిధిలో మంచినీటి సరఫరా, చేతి బోర్డులను తనిఖీ చేశారు. రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. న్యూలక్ష్మీపురం, కస్తూర్బాగాంధీ జూనియర్ కళాశాల పక్కన ఓపెన్ వెల్, ఎస్సీ కాలనీలోని చేతిపంపులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఎస్.శ్రీధరస్వామి, ఎంపిఓ పి.సూర్యనారాయణ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఇస్సాంపల్లి విజయరాజు, పంచాయతీ కార్యదర్శి పి.సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు అడ్డగింత



నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం అర్బన్ మండల పరిధిలోని ధంసలాపురం గ్రామం వద్ద నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను రామకృష్ణాపురం, ధంసలాపురం గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. ధంసలాపురం వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవేకు విజయవాడ ఖమ్మం రోడ్లకు ఎగ్జిట్ పాయింట్ ఇవ్వాలని, గత కొంతకాలంగా రామకృష్ణాపురం తదితర గ్రామాల ప్రజలు గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారులతో పోరాటానికి దిగారు. ఈ క్రమంలో గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారులు నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ విషయాన్ని సంబంధిత నిర్వాహకులు నేషనల్ హైవే అథారిటీ అధికారులకు విన్నవించారు. అయినప్పటికీ నేషనల్ హైవే అధికారులు స్థానికుల విన్నపాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా సదరు ప్రాంత ప్రజలకు అన్యాయం చేసే విధంగా నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రామకృష్ణాపురం గ్రామస్తులు కురుగుంట్ల రవీందర్ రెడ్డి, పిన్నెల్లి శ్రీనివాస్, వాకా సీతారాం రెడ్డి ఆధ్వర్యంలో సుమారు వందమంది గ్రీన్ ఫీల్డ్ నిర్మాణ పనులను అడ్డుకొని నిరసన తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రీన్ ఫీల్డ్ అధికారులు గ్రామస్తులను కలిసి చర్చలు చేసేందుకు ప్రయత్నం చేశారు. అయినప్పటికీ గ్రామస్తులు ఎట్టి పరిస్థితుల్లో తాము ఎగ్జిట్ పాయింట్ ఇచ్చేవరకు నిర్మాణ పనులు చేయనీయమని తేల్చి చెప్పారు. ఈనెల 8 మహాశివరాత్రి సందర్భంగా ఇక్కడ సమీప గ్రామంలో మహాశివరాత్రి నవరాత్రులను అనంతరం చుట్టుపక్కల అన్ని గ్రామాల ప్రజలను పోగుచేసి నిర్మాణ పనులకు ఆటంకం కలిగించే విధంగా తగు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులు స్పష్టం చేశారు. కోట్లాది రూపాయల విలువైన భూములను అతి తక్కువ ధరలకు తమ గ్రామస్తులు గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం దారాదత్తం చేశారని, రామకృష్ణాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కురుగుట్ల రవీందర్ రెడ్డి, పిన్నెల్లి శ్రీనివాస్, శెట్టి మోహన్ రావు అన్నారు. తమ గ్రామాల్లో భూములు తీసుకునే క్రమంలో బోనకల్లు రోడ్డుని కలుపుతూ ఎగ్జిట్ పాయింట్ ఇస్తామని గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారులు తమకు హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ హామీని తుంగలో తొక్కి ఇష్టా రాజ్యాంగ నిర్మాణ పనులు చేపడుతున్నారని, బోనకల్ రోడ్డు ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ అతి తక్కువ కాలంలో గమ్యాలు చేరుకోవడానికి వీలుగా ఉండే మార్గమని ఇక్కడ ఎగ్జిట్ పాయింట్ ఇవ్వకుండా ఉండటం తమ గ్రామస్తులను గ్రీన్ ఫీల్డ్ అవే అధికారులు మోసం చేసినట్లేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తుల అవసరాలను గుర్తించి ఇప్పటికైనా రామకృష్ణాపురం, ధంసలాపురం గ్రామాల మధ్య ఎగ్జిట్ పాయింట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ నామ నాగేశ్వరరావు చొరవ చూపి గ్రీన్ ఫీల్డ్ హైవే కి ఎగ్జిట్ పాయింటు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

8న బుగ్గపాడు విశ్వ ధర్మక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు

నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్



బుగ్గపాడు శ్రీవిశ్వ ధర్మక్షేత్రం యందు మహాశివరాత్రి మహోత్సాలు ఘనంగా నిర్వహించ తలపెట్టినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలియజేశారు. బుగ్గపాడు గ్రామంలో బ్రహ్మశ్రీ వెల్లటూరి ప్రసాదాచారి, గ్రామ ప్రజలచే సుమారు ఐదు కోట్ల ఖర్చు అంచనాలతో సుందర రాతి దేవాలయ నిర్మాణం తలపెట్టారు. ఈ కార్యక్రమం శ్రీ విశ్వధర్మక్షేత్రం యందు ఎంతో వైభవంగా గత 28న అన్నపూర్ణ సహిత మోక్ష రుద్రేశ్వర స్వామి వారి పరివార దేవతాగణాలు కొలువు తీరారు. అటువంటి మహా పుణ్యక్షేత్రం నందు ఈ నెల 8వ తేదిన మహా శివరాత్రి పండుగ సందర్భంగా మహోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు నిర్వాహకులు వి.పవన్, కమిటీ అధ్యక్షులు తుమ్మూరు ప్రసాద్ బాబు, బొడ్డు శివబాబు, కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అన్నపూర్ణ సహిత మోక్షేశ్వర స్వామి వారి దేవాలయం నందు శివరాత్రి మహోత్సవాలు ఉదయం నాలుగు గంటల నుంచి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, స్వామివారికి నిత్య రుద్రాభిషేక కార్యక్రమం, రుద్రహోమం, సాయంత్రం 8 గంటల నుంచి 108 మంది దంపతులచే ఆది దంపతులకు కళ్యాణ మహోత్సవం నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొననున్న 108 మంది దంపతులకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. అదేవిధంగా రాత్రి లింగోద్భవ సమయం నందు ప్రత్యేక అభిషేక కార్యక్రమం, కుంభాభిషేకం నిర్వహించబడును, ఈ కార్యక్రమంలో పీటల మీద కూర్చోనున్న దంపతులు మేనేజింగ్ ట్రస్టు 900052248ను సంప్రదించవలసిందిగా వారు కోరారు.



మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం

నవతెలంగాణ-మధిర

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా బుధవారం మధిర మున్సిపాలిటీ కార్యాలయం నందు మహిళ పారిశుధ్య కార్మికులకు, మెప్మా ఆర్పిలకు మహిళా మునిసిపల్ వార్డ్ ఇన్‌చార్జీలకు ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళల స్థితిగతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెందదు. ఏ పక్షి అయినా ఒక రెక్కతో ఎగరలేదు అన్న స్వామి వివేకానంద మాటలు మరోసారి స్మరిస్తూ.. జయహో. జనయిత్రి' ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళామూర్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్ల, మునిసిపల్ వైస్ చైర్మన్ విద్యాలత, 6వ వార్డు కౌన్సిలర్ వరలక్ష్మి, ఏడవ వార్డు కౌన్సిలర్ కళ్యాణి, 8వ వార్డు కౌన్సిలర్ అప్పారావు, 17వార్డ్ కౌన్సిలర్ మునుగోటి వెంకటేశ్వర్లు, 21వ వార్డు కౌన్సిలర్ ఎర్రగుంట్ల లక్ష్మి, 22వార్డ్ కౌన్సిలర్ కట్టా గాంధీ, కో ఆప్షన్ సభ్యురాలు భరణి, హెల్త్ అసిస్టెంట్ రేవతి, మెప్మా సీఈవో ఉపేంద్రమ్మ, మేనేజర్ రవీందర్, ఆర్ఐ రాము, ఏఈ నరేష్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు బ్రాహ్మణపల్లి సొసైటీ సీఈవో నాగరాజు తొలగింపు

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి సొసైటీ తాత్కాలిక సీఈవో చేపూరి నాగరాజును బుధవారం పాలకవర్గం ఎట్టకేలకు తొలగించారు. బ్రాహ్మణపల్లి సొసైటీ పాలకవర్గం బుధవారం సొసైటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి కాంగ్రెస్‌కు చెందిన ఇరువురు, సీపీఐకి చెందిన ఇరువురు డైరెక్టర్లు గైర్హాజరయ్యారు. బీఆర్ఎస్‌కి చెందిన నలుగురు, సీపీఐ(ఎం)కి చెందిన ఒకరు రాపల్లి తాజా మాజీ సర్పంచ్ మందడపు తిరుమలరావు వర్గానికి చెందిన రెబల్ కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు సమావేశానికి హాజరయ్యారు. 11 మంది పాలకవర్గానికి గాను ఏడుగురు హాజరయ్యారు. సీఈవోగా బీఆర్ఎస్ చెందిన చేపూరి నాగరాజు గత రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. అయితే నాగరాజుపై అనేక ఆరోపణలు రావడంతో పాలకవర్గంలోనే కొంతమంది అతన్ని తొలగించాలని 2024 జనవరి 27న ఆనాటి డీసీవో విజయ కుమారికి ఫిర్యాదు చేశారు. ఆమె వెంటనే విచారణ నిర్వహించి అతనిపై వచ్చిన ఆరోపణ రుజువు కావడంతో 2024 జనవరి 6న నాగరాజుని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాని ఆ ఆదేశాలను నాగరాజు పాలకవర్గానికి తెలియకుండా రహస్యంగా ఉంచాడని కాంగ్రెస్, సీపీఐలకు చెందిన డైరెక్టర్లు తెలిపారు. 9 కోట్ల టర్నోవర్ తో ఉన్న బ్రాహ్మణపల్లి సొసైటీకి శాశ్వత సీఈఓను నియమించాలని పాలకవర్గం సభ్యులు కాంగ్రెస్ నాయకులు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని సైతం కలిసి ఫిర్యాదు చేశారు. నాగరాజు సొసైటీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడని, అతనిని వెంటనే విధులనుంచి తొలగించాలని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. డిసిఓ ఆదేశాలను సైతం అమలు చేయకుండా పాలకవర్గం నేటి వరకు వాయిదా వేసుకుంటూ వచ్చింది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం కాంగ్రెస్ అసమ్మతి నాయకుడు ఒకరు రెండు రోజుల క్రితం జిల్లా సహకార బ్యాంకు అధికారులను సైతం కలిశారు. తమ ఆదేశాలను పాలకవర్గం అమలు చేయకపోతే పాలకవర్గాన్ని రద్దు చేస్తామని జిల్లా డీసీసీబీ అధికారులు స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో గత్యంతరం లేక పాలకవర్గం అత్యవసర సమావేశమై నాగరాజుని తొలగిస్తున్నట్లు ప్రకటించారని సొసైటీ ఉపాధ్యక్షుడు గంగసాని రాఘవరావు డైరెక్టర్ ఏనుగు సుధాకర్ రావు తెలిపారు. సొసైటీలోనే కంప్యూటర్ ఆపరేటర్ గా ఎన్నో సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్న చిన్నకేసి అనీల్ ను తాత్కాలిక సీఈఓగా నియమించినట్లు వారు తెలిపారు.

మందడపు తిరుమలరావుకి భారీ షాక్

బ్రాహ్మణపల్లి సొసైటీ తాత్కాలిక సీఈవోగా విధులు నిర్వహిస్తున్న చేపూరి నాగరాజుని కాపాడేందుకు రాపల్లి మాజీ తాజా సర్పంచ్ కాంగ్రెస్ అసమ్మతి నాయకుడు మందడపు తిరుమల రావు విశ్వ ప్రయత్నాలు చేశారు. మొదట నాగరాజుని తొలగించాలని తన వర్గం చేత ఆనాటి డీసీఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయించాడు. కానీ కొన్ని రోజులకే యూటర్న్ తీసుకున్నాడు. ఫిబ్రవరి నుంచి నాగరాజుని సీఈవో నుంచి తొలగించకుండా తిరుమల రావు చేయని ప్రయత్నం అంటూ ఏమీ లేదు. ఆయన చేయాల్సిన అన్ని ప్రయత్నాలు చేశారు. కాని నాగరాజు పై బలమైన ఆరోపణలు ఉండటంతో పాలకవర్గం గట్టి పట్టుబట్టింది. దీంతో జిల్లా కేంద్ర బ్యాంక్ అధికారులు కూడా నాగరాజుని తొలగించాలని ఆదేశాలు సైతం జారీ చేశారు. తాను చేసిన అన్ని ప్రయత్నాలు బెడస కొట్టాయి. పాలకవర్గం నాగరాజును తొలగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో తిరుమలరావుకి కోలుకోవాలని భారీ షాక్ తగిలిందని మండలంలో జోరుగా చర్చ సాగుతుంది.



డిసిఓకి ఫిర్యాదు చేస్తున్న తిరుమల రావు వర్గం - (ఫైల్) (రౌండులో ఉన్నవారు)



సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని పినపాక గ్రామంలో 47 లక్షల నిధులతో పూర్తి చేసిన సీసీ రోడ్లను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టారాగమయి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు వేదికలో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా రంజకంగా పాలన సాగిస్తున్నామన్నారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలను త్వరలోనే పూర్తిగా అమలు చేస్తామన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు, అధికారులు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పంచాయతీ కార్మికుల వినతి

తమ సమస్యలు పరిష్కరించాలంటూ గ్రామపంచాయతీ కార్మికులు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయికి బుధవారం వినతి పత్రం అందించారు. గ్రామ పంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానం కాకుండా నెలవారి వేతనాలు మంజూరు చేయాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, బిల్ కలెక్టర్లను పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని, సమ్మె చేసిన కాలంలో వేతనాలను విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది సంఘసాని శ్రీహరి వేలాద్రి, చాంద్ పాషా, బాబురావు, శంకర్ బాలరాజు, మల్లికా, విజయ, ధనమ్మ ,లక్ష్మీ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వృద్ధురాలిని బంధువులకు అప్పగింత

నవతెలంగాణ-ఖమ్మం

మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం కుమ్మరి కుంట్ల గ్రామానికి చెందిన కరుణపాక వీరమ్మ అనే వృద్ధురాలు తప్పిపోయి కరుణగిరి ప్రాంతంలో సంచరిస్తుండగా యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ బాధ్యులు నరసింహారావు గమనించి ఆమెను చేరదీశారు. వివరాలు తెలుసుకొని దంతాలపల్లి పోలీస్ స్టేషన్ కి సమాచారం అందించారు. వృద్ధురాలి కూతురు వైరా గ్రామంలో ఉంటుందని తెలుసుకొని, వారి మనవడికి సమాచారం అందించి తగిన ఆధారాలను తీసుకుని అప్పగించామని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సిఐ బి.బాలాజీ నాయక్ తెలిపారు. సదరు వృద్ధురాలు కూతురును చూడడానికి వచ్చే క్రమంలో తప్పిపోయినట్లుగా తెలిపారు.

స్టెమ్, ఎస్‌డీజీల ద్వారా గ్రామీణ తెలంగాణ పిల్లలను భవిష్యత్తుకు సిద్ధం చేస్తున్న ఎన్ఎక్స్ ప్లోరర్స్



నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

షెల్ ఇండియా మద్దతుతో, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఖమ్మంలో ఎన్ ఎక్స్‌ప్లోరర్స్ కార్నివాల్‌ను స్మైల్ ఫౌండేషన్ నిర్వహించింది. గ్రామీణ పాఠశాల పిల్లలకు స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్)లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి, జాతీయ స్థాయి విద్యా విధానం (ఎన్ఈపీ) 2020కి అనుగుణంగా ఎస్‌డీజీలను (యునైటెడ్ నేషన్స్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్) అవగాహన చేసుకోవడానికి ఒక వేదికను అందించాలనే లక్ష్యంతో ఈ రోజంతా కార్నివాల్ నిర్వహించారు. స్మైల్ ఫౌండేషన్ తెలంగాణలో వరంగల్, ఖమ్మం, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం వంటి ఎనిమిది జిల్లాల్లోని 116 ప్రభుత్వ పాఠశాలల్లో షెల్ అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మకమైన సోషల్ ఇన్వెస్ట్‌మెంట్ స్టెమ్ ఎడ్యుకేషనల్ కార్యక్రమం అయిన ఎన్ఎక్స్‌ప్లోరర్స్ జూనియర్ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తోంది.

ఈ కార్నివాల్‌కు హాజరైన ప్రముఖులలో టి.అంజలి, రీజనల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ (ఆర్‌సీవో), ఎంజీపీ స్కూల్స్, పూర్వపు ఖమ్మం జిల్లా చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ రాజ్ శేఖర్, ఖమ్మం జిల్లా సైన్స్ ఆఫీసర్ డి.జగదేశ్వర్ ఉన్నారు. తెలంగాణలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన 17 పాఠశాలలకు చెందిన 101 మంది విద్యార్థులు ఈ కార్నివాల్ సందర్భంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) విభాగాల్లో ఎంపిక చేసిన 31 ప్రాజెక్టులు, వినూత్న నమూనాలను ప్రదర్శించారు. రీజినల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ (ఆర్‌సీవో) టి.అంజలి మాట్లాడుతూ.. "ఈ అద్భుతమైన కార్యక్రమం భవిష్యత్ తరాన్ని తీర్చిదిద్దటంతో పాటుగా ప్రపంచాన్ని స్థిరమైన భవిష్యత్తు వైపు నడిపించే సామర్థ్యాన్ని కలిగి ఉందని అన్నారు. చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ రాజ్ శేఖర్ మాట్లాడుతూ, "సంక్లిష్ట సమస్యను పరిష్కరించిన ఒక చిన్న ఆలోచన కూడా శతాబ్దాల పాటు గుర్తుండిపోతుంది, వినూత్న ఆలోచనలపై దృష్టి సారించే ఎన్ఎక్స్‌ప్లోరర్స్ ప్రోగ్రామ్ పిల్లలు అన్ని అంశాలలో ఎదగడానికి సహాయపడుతుందని అన్నారు.

ఖమ్మం జిల్లా సైన్స్ అధికారి డి.జగదేశ్వర్ మాట్లాడుతూ.. ప్రతి సమస్యకు ప్రకృతి మాత పరిష్కారం చూపుతుంది. సమాజంలో స్థిరమైన పరిష్కారాలను రూపొందించడానికి విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలన్నారు. విజ్ఞాన శాస్త్రాన్ని జీవన విధానంగా అంగీకరించాలి" అని అన్నారు.

విద్యతోనే మహిళల అభివృద్ధి

- ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు స్వర్ణకుమారి

నవతెలంగాణ-ఖమ్మం

విద్యతోనే మహిళాభివృద్ధి, బాలికలు చదువుల్లో రాణించాలని ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు స్వర్ణకుమారి అన్నారు. బుధవారం ఖమ్మంలోని జెడ్పీ హాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మం నగరంలోని వివిధ కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇచ్చారు. సఖి అడ్మిన్ సరిత మాట్లాడుతూ మహిళల్లో ఎటువంటి ఆత్మీయత భావం అందరికంటే తక్కువనే వైఖరి ఉండకూడదని, సమాజంలో స్త్రీలు అన్ని రంగాలలో ముందుండాలంటే వారి హక్కుల కోసం పోరాడాలన్నారు. అందుకు సఖి సెంటర్ ఎల్లవేళలా మహిళల్లో చైతన్య నింపడానికి పనిచేస్తుందని ఆమె చెప్పారు. బాధిత మహిళా సమస్యలపై ఎల్లప్పుడూ సఖి సెంటర్ లో కౌన్సెలింగ్ చేయడానికి అవసరమైనటువంటి లాయర్లు, సైకాలజిస్టులు అందుబాటులో ఉంటారని, మహిళలు ఎటువంటి అవసరాలలోనైనా సఖి సెంటర్ ని సంప్రదించవచ్చని తెలిపారు. యూనివర్సిటీ పీజీ కాలేజ్ లెక్చరర్ లక్ష్మీ హరిత, న్యాయవాది షేక్ నజీమా



మాట్లాడుతూ దేశంలో ఈనాటికి మహిళలపై అత్యాచారాలు, హింస, నేరాలకు పాల్పడుతున్నారని, సమాజంలో స్త్రీలకు రక్షణ లేదని, నేటికీ దేశంలో కొన్ని ప్రాంతాలలో మహిళలపై కఠినమైన నేరాలకు పాడిగడుతున్నారని తెలిపారు. మహిళలందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళా ఆరోగ్య నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రేమ లతా, మహిళా జర్నలిస్ట్ మధులత మాట్లాడుతూ మహిళలు అని రంగాలలో అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి మహిళా సంఘం అధ్యక్షురాలు పిఆర్ దేవి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి భూక్య ఉపేంద్ర, ఉపాధ్యక్షురాలు కామాన అనంతలక్ష్మి, భూక్య మణి, చాట్ల సునీత, కార్యదర్శి రమ్య సహాయ కార్యదర్శి నాగలక్ష్మి, ఝాన్సీ, జ్యోతి, కోశాధికారి సత్యవతి, పాల్గొన్నారు.



పలువురిని పరామర్శించిన జిల్లా పరిషత్ చైర్మన్

నవతెలంగాణ-మధిర

మధిర మున్సిపాలిటీ 11వ వార్డు నాయకులు గద్దల ప్రకాష్ (నాని) మాతృమూర్తి, కౌన్సిలర్ గద్దల మాధురి అత్త అనారోగ్యంతో ఉండటంతో వారిని వందన హాస్పిటల్ నందు జిల్లా ప్రజా పరిషత్ చైర్మెన్ లింగాల కమల్ రాజు పరామర్శించారు. అనంతరం మధిర బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు ఖురేషి భార్య అనారోగ్యంతో ఉండటంతో వారిని కూడా అదే హాస్పిటల్ నందు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షులు పల్లపోతుల వెంకటేశ్వరరావు, సెక్రెటరీ అరిగ శ్రీనివాసరావు, టౌన్ పార్టీ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, సెక్రెటరీ బొగ్గుల భాస్కర్ రెడ్డి మధిర సొసైటీ చైర్మన్ బిక్కీ ప్రసాద్, కౌన్సిలర్ యన్నంశెట్టి అప్పారావు నాయకులు పాల్గొన్నారు.



దారెల్లి నాగేశ్వరరావు క్రమశిక్షణ కలిగిన కార్యకర్త
సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు

నవ తెలంగాణ - బోనకల్

దారెల్లి నాగేశ్వరరావు క్రమశిక్షణ కలిగిన సీపీఐ(ఎం) కార్యకర్త అని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు కొనియాడారు. మండల పరిధిలోని చొప్పకట్లపాలెంలో దారెల్లి నాగేశ్వరరావు సంస్మరణ సభ చలమల అజయ్ కుమార్ అధ్యక్షతన బుధవారం జరిగింది. తొలుత నాగేశ్వరరావు చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సంస్మరణ సభలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నాగేశ్వరరావు పార్టీ కార్యక్రమాలు ఎక్కడ జరిగినా తప్పనిసరిగా పాల్గొనేవాడని అన్నారు. చొప్పకట్లపాలెంలో పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశాడన్నారు. ఈ సంస్మరణ సభలో పార్టీ మండల కమిటీ సభ్యులు బంధం శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చలమల హరికిషన్‌రావు, మాజీ సర్పంచ్ బూసి వెంకటేశ్వర్లు, సిపిఎం శాఖా కార్యదర్శులు బోయినపల్లి పున్నయ్య, బండి శ్రీనివాసరావు, నాయకులు బొప్పాల రమేష్, పరిటాల కొండలరావు, ఉన్నం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బీమా నగదు అందజేత

నవతెలంగాణ -ఎర్రుపాలెం

గత కొద్ది రోజుల క్రితం నుండి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు బీమా నగదును అయ్యవారిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు అందించారు. మండల పరిధిలోని భీమవరం గ్రామానికి చెందిన సంఘ సభ్యురాలు వెల్లటూరి భ్రమరాంబ మృతి చెందడంతో నామిని ఆమె భర్త సత్యనారాయణ చారికి 50 వేల రూపాయల బీమా నగదును మండల కేంద్ర మైన ఎర్రుపాలెం డిసిసిబి బ్యాంకు నందు అందచేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ మగినం వీరభద్రం, అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి, సూపర్వైజర్ మహేష్, క్యాషియర్ భానుప్రియ, సీఈవో మోహనరావు, సొసైటీ సిబ్బంది మురళి, రమణారెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-కారేపల్లి

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కారేపల్లి పోలీసులు, రెవిన్యూ అధికారులు బుధవారం పట్టుకున్నారు. కారేపల్లి మండలం కొమ్ముగూడెం నుండి 22 క్వింటాళ్ళ బియ్యాన్ని కల్తి బాలకృష్ణ అనే వ్యక్తి తన మహేంద్ర మినీ ట్రక్ వాహనంలో తరలించే ప్రయత్నం చేస్తుండగా సమాచారం అందుకున్న కారేపల్లి ఎస్సై ఎస్.రాజారామ్, ఆర్ఐ జార్జ్ ఆధ్వర్యంలో అధికారులు పట్టుకున్నారు. పట్టుకున్నరేషన్ బియ్యాన్ని కారేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌కే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీనియర్ న్యాయవాది లక్కినేని రామభద్రయ్య మృతి

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లికి చెందిన సీనియర్ న్యాయవాది లక్కినేని రామభద్రయ్య (80) బుధవారం హైదరాబాద్‌లో మరణించారు. కల్లూరుకు చెందిన రామభద్రయ్య న్యాయవాద విద్యనభ్యసించాక సత్తుపల్లి వచ్చి న్యాయవాద వృత్తిని చేపట్టారు. 25యేండ్లకు పైగా సత్తుపల్లిలో వృత్తిని కొనసాగించిన ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. రామభద్రయ్యకు ఇద్దరు కుమారులు, కుమార్తె, భార్య ఉన్నారు. ఒక కుమారుడు, కుమార్తె న్యాయవాద విద్యను అభ్యసించగా పెద్ద కుమారుడు ఖమ్మంలో గ్రానైట్ ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నారు.

స్థానాల లక్ష్మీపురంలో అన్నదానం

నవతెలంగాణ-వైరాటౌన్

స్థానాల లక్ష్మీపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం నందు మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం గ్రామస్తులు డాక్టర్ శ్రీరామ వెంకటరమణ, శైలజ, దంపతులు, గ్రామస్తులు, భక్త బందం, బంధుమిత్రులు అందరు శివరాత్రి సందర్భంగా వచ్చే భక్త బందానికి అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అన్నదానం కార్యక్రమాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క ప్రారంభిస్తారని ఒక ప్రకటనలో తెలిపారు.

పోడులో పంటల నమోదు పరిశీలించిన జేడీఏ

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలంలో పోడులో పంటలు సాగుచేస్తున్న రైతుల పంటల వివరాల నమోదును జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల బుధవారం తనిఖీ చేశారు. కొత్తతండా, లాల్‌తండా గ్రామాల పరిధిలో అటవీ హక్కులు కల్గిన పోడు భూముల సందర్శించిన జిల్లా వ్యవసాయాధికారి రైతులతో మాట్లాడారు. పోడులో వేస్తున్న పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రైతు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను తప్పని సరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. పంటల నమోదుతో ప్రభుత్వానికి పంటల సాగు విస్తీరణం, దిగుబడి అంచనా తెలుస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలకు పంటల అమ్మకాలు చేయాలన్నా, మార్కెట్‌కులో అమ్ముకోవాలన్నా పంటల ఆన్‌లైన్ నమోదు చేసి ఉండాలన్నారు. అనంతరం పెసర పంటను



పరిశీలించి దానిలో పేనుబంక, మరకమచ్చల పురుగు నివారణకు చేపట్టాల్సిన సస్య రక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఏవో కే.ఉమామహేశ్వర్‌రెడ్డి, ఏఈవో ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి

నవతెలంగాణ-ముదిగొండ

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 ఏళ్లలో మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగి రక్షణ కరువైందని ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి అన్నారు.ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని అయ్యగారిపల్లిలో ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వయసుతో నిమిత్తం లేకుండా పురుషాదిపత్య సమాజంలో మహిళలపై లైంగిక దాడులు, వేధింపులు కనివిని ఎరగని రీతిలో కుల మతాలకు సంబంధం లేకుండా జరుగుతున్నాయన్నారు. మహిళా రక్షణ చట్టాలు ఉన్నా ఉపయోగం లేదన్నారు. రోజురోజుకు సమాజంలో స్త్రీలపై జరుగుతున్న అమానుషపు దాడులు, అత్యాచారాలు నివారణకు ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. మహిళలు రక్షణకై ఐక్యంగా ఉద్యమించాలన్నారు. స్త్రీల హక్కులు పరిరక్షణకు పాటుపడే సంఘాల బాటలో నడవాలన్నారు. మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరిగిన నరహంతక దాడులపై ప్రధాని మోడీ నోరు విప్పికపోవటం



విచారకరమన్నారు. వంటింటికే మహిళలు పరిమితం కాదని, అన్ని రంగాల్లో మహిళలు రాణించాలన్నారు. మహిళల పట్ల జరుగుతున్న వివక్షత,అసమానతలకు వ్యతిరేకంగా ఐద్వా నిర్వహిస్తున్న ఉద్యమాలలో పాల్గొవాలని మాచర్ల భారతి పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ మహిళలు విద్యా వైద్య రంగాలతో పాటు రాజకీయాల్లో రాణించాలన్నారు. చదువుతూ సమాజాన్ని అర్థం చేసుకోవాలన్నారు. కుటుంబ బాధ్యతలతో పాటు, సమాజంలో జరుగుతున్న రుగ్మతలకు రూపుమాపేందుకు కృషి చేయాలన్నారు. చదువు ద్వారానే సమాజంలో గుర్తింపు, గౌరవం పెరిగిగద్దన్నారు. అనంతరం సిపిఐ(ఎం) నేత కుక్కల రామచంద్రం కూతురు రమ్య చదువులో అత్యంత ప్రతిభ కనబరిచి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఉచిత సీటును సాధించి, ఖమ్మంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం చదువుతూ కుటుంబానికి, గ్రామానికి పేరు తెచ్చిన చిన్నారి రమ్యను అభినందించి ఐద్వా ఆధ్వర్యంలో ఘనంగా చిరు సత్కారంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు బండి పద్మ, మండల అధ్యక్ష కార్యదర్శి మందరపు పద్మ, పయ్యావుల ప్రభావతి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వాసిరెడ్డి వరప్రసాద్, సిఐటియు మండల కన్వీనర్ టిఎస్ కళ్యాణ్, సిపిఐ(ఎం) మండల నాయకులు మరికంటి వెంకన్న, పంద్రకొల రాంబాబు, గ్రామశాఖ కార్యదర్శి కుక్కల కుటుంబరావు మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా పోరాటాలకు స్ఫూర్తినిచ్చిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఖమ్మం : ఐద్వా, సిఐటియు ఖమ్మం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సుకు బండి పద్మ పిన్నింటి రమ్య అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి మాట్లాడుతూ మహిళా సాధికారత అని చెప్తున్నటువంటి ప్రభుత్వాలు మహిళలకి బడ్జెట్లో, నిధులు కేటాయింపుల్లో వివక్ష చూపడం జరుగుతుందని, అలాగే 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి దాన్ని 2026 అమలు చేస్తావని మాయమాటలు చెబుతున్నటువంటి దుర్మార్గ కేంద్ర ప్రభుత్వ విధానాల్ని ఎండగట్టాలని అన్నారు. మనుధర్మ భావజాలాన్ని ప్రచారం చేస్తున్నటువంటి ప్రభుత్వాల నీడలో మహిళలకు రక్షణ లేదని సోషలిజం సాధించినప్పుడే నిజమైన మహిళా విముక్తి కలుగుతుందని అన్నారు. మహిళలకి ఆత్మగౌరవం, సమాన పనికి సమాన వేతనం, వివక్ష లేని సమాజం రావాలంటే మహిళలందరూ ఐక్యంగా పోరాడితే తప్ప సాధించలేమని అన్నారు. సదస్సులో సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్యాణ వెంకటేశ్వరరావు, అధ్యక్షులు తుమ్మ విష్ణు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు మెరుగు రమణ, నాగ సులోచన, పయ్యావుల ప్రభావతి, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మావతి, ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమణ, ఐద్వా నాయకులు అమరావతి, కుమారి, రజిత, అజిత, విజయ, బిబి, పావని, అరుణ, రమ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమస్యల సాధనకై నిరంతర పోరాటం

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పద్మావతి

నవతెలంగాణ- ఖమ్మం

మహిళా సమస్యల సాధనకై నిరంతర పోరాటం నిర్వహిస్తుందని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పద్మావతి అన్నారు. బుధవారం ఖమ్మంలోని మంచికంటిభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టిఎస్ ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ ఆర్టీసిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులపై నిరంతర పని ఒత్తిడి కొనసాగుతుందని, మహాలక్ష్మి పథకం పెట్టినప్పటి నుండి బస్సులు సరిపడా లేక ఒకే బస్సులో పరిమితికి మించి ఎక్కుట వలన అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రతిరోజు ఉదయం 5 గంటల నుండి రాత్రి వరకు వరుసగా



ఆరు రోజులు చేసిన తర్వాత వీక్లీ ఆఫ్ ఉంటుందని, రోజుకు ఎనిమిది గంటల పని విధానం అనేది ఆర్టీసీలో అమలు కావడం లేదని, బస్టాప్‌లలో మహిళల కనీస అవసరాలు తీర్చుకునేందుకు రెస్ట్ రూములు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. దోపిడీ లేని సమాజం కోసం నిరంతర పోరాటాలు చేసేందుకు మనల్ని మనం పునరంకితం చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణువర్ధన్, కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్రంశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి పిట్టల సుధాకర్, జిల్లా ప్రచార కార్యదర్శి తోకల బాబు, కోశాధ్యక్షులు పర్వీన, ఖమ్మం డిపో గౌరవాధ్యక్షులు బుగ్గవేటి లింగమూర్తి, డిపో అధ్యక్షులు పగిళ్లపల్లి నరసింహారావు, కార్యదర్శి గుగ్గిళ్ళ రోశయ్య ప్రచార కార్యదర్శి జి.బాబు, మహిళా కన్వీనర్ కె.పద్మ, సహాయ కార్యదర్శులు సిహెచ్.రామకృష్ణ, రామలక్ష్మి, మల్లికాంబ, రాధిక, సుల్తానా, రమాదేవి పాల్గొన్నారు.

సత్తుపల్లి ప్రాంతంలో పచ్చదనాన్ని అభివృద్ధి చేయండి

- రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్
- అర్బన్ పార్కులో అటవీ ఉద్యోగుల వైద్య శిబిరం

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి ప్రాంతంలో పచ్చదనాన్ని మరింతంగా అభివృద్ధి చేయడానికి అధిక మొత్తంలో మొక్కలు నాటాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. బుధవారం స్థానిక వేంసూరు రోడ్డులోని నీలాద్రి అర్బన్ పార్కులో ప్రభుత్వ, సింగరేణి, ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో సత్తుపల్లి డివిజన్ అటవీ ఉద్యోగుల కోసం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన వైద్య శిబిరంలో డాక్టర్ దయానంద్ పాల్గొని ప్రసంగించారు. సింగరేణి వచ్చాక సత్తుపల్లి ప్రాంతమంతా కలుషితమయిందన్నారు. దుమ్మూధూళి కారణంగా ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఆరోగ్య ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పరిస్థితిని కొంతవరకైనా నియంత్రించేందుకు అధిక మొత్తంలో మొక్కలు నాటాలని సింగరేణి అధికారులను కోరారు. పచ్చదనం వృద్ధి చెందడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన ప్రాణవాయువు అందుతుందన్నారు. అలాగే అటవీశాఖ వారు కూడా అర్బన్ పార్కులో తులసి వనం పెంచాలన్నారు. నీలాద్రి ఆలయ సమీపంలో అర్బన్ పార్కు ఏర్పాటు చేయడం ద్వారా అక్కడికి వచ్చే భక్తులకు సౌకర్యంగా



ఉంటుందన్నారు. అనంతరం దయానంద్ అటవీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి శిబిరాన్ని ప్రారంభించారు. సత్తుపల్లి ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ మంజుల అధ్యక్షతన జరిగిన ఈ వైద్య శిబిరంలో జేవీఆర్ ఓసీ ఇన్‌చార్జి పీవో మునగంటి వేదాద్రి నరసింహారావు, రేంజర్లు స్నేహలత, అరవింద్, డీఆర్వో శ్రీనివాసరావు, సెక్షన్ ఆఫీసర్ తేజావత్ నరసింహ, బీట్ ఆఫీసర్లు సాంబయ్య, వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మెన్ తోట సుజలరాణి, కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, కమల్‌పాషా, గాదె చెన్నకేశవరావు, రామిశెట్టి సుబ్బారావు, పింగిలి సామేలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-నేలకొండపల్లి



ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరట్లగూడెం ఎంపీటీసీ రేగూరి వాసవి అన్నారు. బుధవారం కోరట్లగూడెం ఎంపీటీసీ పరిధిలోని ఆచార్లగూడెం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా 28 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. టిఆర్ఎస్ పాలనలో ప్రజలు ఇల్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్లు వంటి అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది గంటల వ్యవధిలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలలో రెండు పథకాలను దిగ్విజయంగా ప్రారంభించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. అనంతరం ఒక్కొక్కటిగా ఇచ్చిన హామీలను అమలు చేసుకుంటూ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నారన్నారు. రానున్న కాలంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల కష్టాలు తొలగిపోనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్ కుమార్, మాజీ ఎంపీపీ చిర్రా లక్ష్మమ్మ, మాజీ సర్పంచ్ రేగూరి శ్రావణ్ కుమార్ మాజీ ఉపసర్పంచ్ మాగం సైదులు, మాజీ వార్డ్ మెంబర్స్ మారుతి గోపి, లిక్కిమల్లేశం, లిక్కి మద్దిరాజు, కొలికపొంగు సీతారాములు, పులిమి వీరారెడ్డి పాల్గొన్నారు.

మణికంఠ జనరల్ స్టోర్ ప్రారంభించిన వైస్ చైర్మెన్

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు నందు ఎంపిడిఓ ఆఫీస్ వద్ద మణికంఠ కిరాణం అండ్ జనరల్ స్టోర్‌ను వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణికంఠ కిరాణా షాప్ బాగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముళ్లపాటి యువజన నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

రాజీవ్ స్వగృహ ఆస్తుల ధరల నిర్ణయానికి చర్యలు : కలెక్టర్

నవతెలంగాణ- ఖమ్మం

రాజీవ్ స్వగృహ జలజ టౌన్‌షిప్ ఆస్తులను ఖచ్చితమైన ధరల నిర్ణయానికి ప్రతిపాదనలు సమర్పించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ పేర్కొన్నారు. బుధవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మంరూరల్ మండలం పోలేపల్లిలో గల జలజ టౌన్‌షిప్ (రాజీవ్ స్వగృహ) గృహసముదాయాల ఆస్తులను ధరలు నిర్ణయించడానికి జిల్లా కలెక్టర్, చైర్మన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ మార్గదర్శకాలపై రాజీవ్ స్వగృహ కార్పోరేషన్ లిమిటెడ్, రెవెన్యూ, మున్సిపల్, ఆర్‌అండ్‌బి, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న 8 టవర్స్ (576), ఫ్లాట్స్, ఖాళీ స్థలాన్ని 2013లో పనిచేపట్టబడి అసంపూర్తిగా ఉన్నటువంటి వాటి విలువను నిర్ధారించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో కూలంకషంగా చర్చించి తదుపరి చర్య నిమిత్తం సంబంధిత ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించేందుకు కమిటీ ఆమోదం తెలపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఎస్ఈ సి.భాస్కర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బి ఎస్ఈ శ్యాంప్రసాద్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ పద్మ, ఖమ్మం రెవెన్యూ డివిజనల్ అధికారి జి.గణేష్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్‌గోపాల్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ మీడియట్ పరీక్షల నిర్వహణ సరళిని పరిశీలించిన కలెక్టర్

ఖమ్మం: ఇంటర్ మీడియట్ పరీక్షల నిర్వహణ సరళిని జిల్లా కలెక్టర్ విపి. గౌతమ్



బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం నగరం ఎస్ఎస్.పి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో ఎంత మంది విద్యార్థులను కేటాయించిందని, హాజరైన విద్యార్థులు వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పోల్చి చూశారు. వేసవి దృష్ట్యా తాగునీరు, విద్యుత్ నిరంతరాయంగా ఉండేలా చూడాలన్నారు. సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌తో సహా ఇన్విజిలేటర్లు, పరీక్షా నిర్వహణ విధులకు కేటాయించిన ప్రతి ఒక్కరిని తనిఖీ చేసి లోనికి అనుమతించాలని, సెల్‌ఫోన్‌ను అనుమతించకూడదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్ష కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్, అధికారులు పాల్గొన్నారు .

నీడనిచ్చే చెట్ల నరికివేతపై ఏటీడీవో విచారణ

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండల పరిధిలోని రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో నీడనిచ్చె చెట్లను నరికివేసిన ఘటనపై గిరిజన సంక్షేమ శాఖ ఏటీడీవో జహిరుద్దీన్ బుధవారం విచారణ చేశారు. ఆశ్రమ పాఠశాలలో పెద్దపెద్ద చెట్లను నరికి వేసి వాటిని వంట చెరుకుగా వినియోగిస్తున్న విషయాన్ని మీడియాలో కథనాలు రావటంతో స్పందించిన ఆయన రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలను సందర్శించి వివరాలు సేకరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఏటిడీవో వచ్చిన విషయం తెలుసుకున్న రేలకాయలపల్లి, ఫైల్‌తండా గ్రామస్తులు ఆశ్రమ పాఠశాలకు వెళ్లి పాఠశాలలో సమస్యలను వివరించారు. చెట్లను విచక్షణారహితంగా కొట్టటమే కాకుండా విద్యార్థులతో కట్టెలను మోయించారని ఫిర్యాదు చేశారు. పాఠశాల నిర్వహణ సరిగా లేదని, విద్యార్థులు నిద్రించే డార్మెట్రీలు అశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. పాఠశాలను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చెట్లను నరికి వాటిని వంట చెరుకుగా వినియోగించటంపై ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్ వీరునాయక్‌ను విధుల నుండి తొలగించారు. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు ఉంటాయని ఏటీడీవో తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు..యువకుడు మృతి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

కారు అదుపు తప్పి చెట్టును ఢీకొనగా యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఆరెంపుల వద్ద బుధవారం చోటు చేసుకుంది.రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముదిగొండ మండల కేంద్రానికి చెందిన పందిరి గౌతమ్(21) తన స్నేహితుడు వినయ్ కలిసి కారులో వరంగల్ వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఆరెంపుల వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో గౌతమ్‌కు తీవ్ర గాయలైయ్యాయి. చికిత్స కోసం ఖమ్మంలోని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో గౌతమ్ మృతి చెందాడు. వినయ్‌కు స్వల్పగాయాలైయ్యాయి. సంఘటనపై మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు 'పుల్లారావు' మృతి

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు మోరంపూడి పుల్లారావు (75) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. రెండేండ్ల కిందట తీవ్ర అనారోగ్యానికి గురైన పుల్లారావు వైద్య చికిత్స జరిపించుకొని కొంత వరకు కోలుకొని ఇంటి వరకే పరిమితమయ్యారు. ఈయనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

సీపీఐ(ఎం) అభివృద్ధికి ఎనలేని కృషి

సత్తుపల్లి ప్రాంతంలో సీపీఐ(ఎం) అభివృద్ధికి పుల్లారావు కృషి మరువలేనిది. అనేక భూపోరాటాలు, పేద ప్రజల గూడుకోసం ఉద్యమాలు, కార్మిక, కర్షక, హమాలీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించిన క్రమంలో ఆయనపై అనేక కేసులు నమోదయ్యాయి. రాజీవ్‌గాంధీ హత్యకు గురైన సమయంలో కాంగ్రెస్ శ్రేణులు పుల్లారావు ఇంటిపై జరిపిన దాడిలో ఆస్తినష్టం కూడా జరిగింది.

మమత వైద్య కళాశాలకు పుల్లారావు భౌతికకాయం

వైద్య విద్యార్థుల పరీక్షల కోసం ఖమ్మంలోని మమత వైద్య కళాశాలకు పుల్లారావు మృతదేహాన్ని అప్పగించేందుకు అతని కుటుంబ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. నేడు (గురువారం) పుల్లారావు ఇంటివద్ద సంతాపసభ అనంతరం మృతదేహాన్ని మమత వైద్య కళాశాల వారు తీసుకెళ్తారని కుటుంబ సభ్యులు తెలిపారు.

భౌతికకాయాన్ని సందర్శించిన సీపీఐ(ఎం) నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర



మోరంపూడి పుల్లారావు మరణవార్త తెలిసిన వెంటనే సత్తుపల్లి ప్రాంతంలోని సీపీఐ(ఎం) నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాసరావు, రావుల రాజబాబు, కొలికపోగు సర్వేశ్వరరావు, ఓబిళ్ల వెంకటేశ్వరరావు, మోరంపూడి వెంకటేశ్వరరావు ఉన్నారు.

మహారాజ శ్రీ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు ఖమ్మం
O.S No. 170 / 2024

బిట్వీన్:
1) జిక్కుల రమాదేవి
2) జిక్కుల భవిష్య
3) జిక్కుల భిక్షమయ్య
4) జిక్కుల లింగమ్మ .....వాదులు

మరియు

1) తహశీల్దార్, ఖమ్మం అర్బన్(మం) ఖమ్మం
2) ఎవరికి సంబంధించితె వారికి .....ప్రతివాదులు

నోటీసు

టు:R2: ఎవరికి సంబంధించితే వారికి

పైన తెలిపిన వాది ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ మీకు ముట్టనందున పైన తెలిపిన కోర్టు వారి నందు మీపై దావా దాఖలు పరిచినారు. ఇట్టి దావా లో మీ హాజరు కొరకు ది. 08-04-2024 న వాయిదా ఉన్నది. మీరు ఆరోజున స్వయంగా గాని లేక న్యాయవాది ద్వారా గాని **ది: 08-04-2024 న ఉ॥గం॥ 10:30 ని॥లకు పైన తెలిపిన కోర్టువారి ఎదుట హాజరుకాగలరు.** లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

// కోర్టు వారి అనుమతితో //
కోప్పుల కిషోర్ అంబేద్కర్
న్యాయవాది
ఖమ్మం

మహారాజ శ్రీ గౌరవ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టు ఖమ్మం
O.S No: 154 / 2024

బిట్వీన్:
మూకర సులోచన .....వాది

మరియు

1) తహశీల్దార్, ఖమ్మం అర్బన్ ఖమ్మం
2) ఎవరికి సంబంధించితే వారికి .....ప్రతివాది

టు,
R2ఎవరికి సంబంధించితే వారికి

నోటీసు

పైన తెలిపిన వాది. కీ॥శే॥ మొగిలి ఆదెమ్మ గారి కూతురు అయి ఉన్నారు. కీ॥శే॥ మొగిలి ఆదెమ్మ గారు ది. 11-06-2023 న మరణించినారు. వారికి వాది తప్ప ఇతర చట్టబద్ధమైన వారసులు లేరు. కావున వాదిని కీ॥శే॥ మొగిలి ఆదెమ్మ గారి చట్టబద్ధమైన వారసురాలిగా ప్రకటించమని పైన తెలిపిన కోర్టు వారి నందు డిక్లరేషన్ ఆఫ్ లీగల్ హెయిర్స్ దావా ను దాఖలు పరిచినారు. ఇట్టి దావాలో మీహాజరు కొరకు ది. 27-03-2024 న వాయిదా ఉన్నది. మీరు ఆరోజున స్వయంగా గాని లేక న్యాయవాది ద్వారా గాని ది. 27-03-2024 న ఉ॥గం॥ 10:30 ని॥లకు పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరుకాగలరు. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

// కోర్టు వారి అనుమతితో //
గరిక సంపత్ కుమార్
న్యాయవాది, ఖమ్మం
సెల్: 9989274504

పునః నియామకానికి ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణిలో గైర్హాజరు కారణంగా 1జనవరి 2019 నుండి 31డిసెంబర్ 2022 వరకు డిస్మిస్ అయిన అర్హత కలిగిన కార్మికులకు పునః నియామకం కొరకు హైపర్ కమిటీ బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయం హెచ్ఆర్‌డి కాన్ఫరెన్స్ హాల్ నందు డైరక్టర్ (పి అండ్ పి) జి.వేంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ సందర్భంగా డైరక్టర్ జి.వేంకటేశ్వరరెడ్డి డిస్మిస్ అయిన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ సింగరేణి సంస్థ నందు ఉద్యోగం పొందటం ఒక వరం లాంటిదని, బయట పోటీ ప్రపంచంలో ఉద్యోగం రాక చాలా మంది బాధపడుతున్నారని, అలాంటిది సింగరేణి సంస్థ నందు పొంది గైర్హాజరు కారణంగా డిస్మిస్ కావటం చాలా బాధాకరన్నారు. ఇప్పుడు సింగరేణి సంస్థ అర్హత గల డిస్మిస్ అయిన కార్మికులు ఒక్క అవకాశం ఇచ్చి మళ్ళీ అవకాశం ఇచ్చిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నెలకు 20 మస్టర్లు చేస్తూ ఉద్యోగాలను పోగొట్టుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో జిఎం(సిపిపి) జక్కం రమేష్, జిఎం (పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం బి.హనుమంత రావు, జిఎం (ఎంఎస్) టి.సురేశ్ బాబు, ఏజిఎం (ఎఫ్ అండ్ ఏ) జి.కొమరయ్య, డిజిఎం (పర్సనల్) వైవిఎల్ వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నువ్వు వస్తానంటే.. నేను వద్దంటాను..!

- తెల్లం రాకను వ్యతిరేకిస్తున్న పొదెం
- భద్రాచలంలో రగులుతున్న రాజకీయం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎలాంటి నిర్ణయమైనా తీసుకుంటానికి సిద్ధమేనని భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు ప్రకటించిన 24 గంటలు గడవకముందే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన జ్వాలలు రగులుతున్నాయి. నువ్వొస్తానంటే నేను వద్దంటాను.. అన్నట్టుగా తెల్లం రాకను వీరయ్య వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఇటీవల మీడియాతో తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే అధికార పార్టీతో వివాదాలకు వెళ్లి అభివృద్ధి చేయలేకపోయారని చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీలోని పొదెం వీరయ్య వర్గం తెల్లం వెంకట్రావు దిష్టిబొమ్మను తగలబెట్టిన ఘటనతో ఒక్కసారిగా భద్రాచలం రాజకీయం రగులుకుంది. ఈనెల 11వ తేదిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి సమక్షంలో భారీగా చేరికలు, చేర్పేందుకు ఉమ్మడి జిల్లా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇప్పటికే తెల్లం వెంకట్రావుతో సంప్రదింపులు చేసి ఆయనతో పాటు మరి కొంతమంది ఇతర పార్టీ నాయకులు సైతం కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు రంగం సిద్ధం చేసిన విషయం తెలిసిందే. గత ఎన్నికల్లో తనపై గెలిచిన తెల్లం వెంకటరావుని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటే తన రాజకీయ భవిష్యత్తు మస్కాబారే ప్రమాదం ఉందని పసిగట్టిన పొదెం వీరయ్య ముందే మేలుకొని తెల్లం వెంకట్రావు రాకను నిరసిస్తూ తన అనుచర గళంతో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి తెల్లం వెంకట్రావుని విమర్శించడమే కాక దిష్టిబొమ్మను సైతం దహనం చేయించారు. తెల్లం వెంకట్రావు కాంగ్రెస్లోకి చేరితే ఆయనతో పాటు గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన అనేక మంది నాయకులు సైతం తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవ్వగా వారి రాకను సైతం స్థానిక కాంగ్రెస్ నాయకత్వం వ్యతిరేకిస్తున్నట్టు కనిపిస్తుంది. ఇదిలా ఉండగా కాంగ్రెస్‌లోని మరో వర్గం స్థానిక శాసనసభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరితేనే నియోజవర్గం అభివృద్ధి చెందే అవకాశం ఉందని తెల్లని కాంగ్రెస్‌లో చేర్చుకోవాలని అధిష్టానని కోరుతున్నారు. ఎమ్మెల్యే హోదాలో తెల్లం వెంకట్రావు తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరితే కాంగ్రెస్ జిల్లా పార్టీ అధ్యక్షులు వీరయ్య రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి ఉన్న నేపథ్యంలో ఎలాగైనా తెల్లం రాకను అడ్డుకోవాలని పొదెం వీరయ్య వర్గం గట్టిగా ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో మరోసారి భద్రాచల కాంగ్రెస్ రాజకీయం రగులుకుంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 11న జరిగే ముఖ్యమంత్రి పర్యటన కంటే కూడా చేరికలు, ఫిరాయింపులు, అలకలతో భద్రాచలం కాంగ్రెస్ పార్టీలో అలజడి మొదలైంది.

ప్రజలకు ప్రభుత్వానికి వారధులు జర్నలిస్టులు

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-పాల్వంచ



ప్రజా సమస్యల పరిష్కారంకి.. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా జర్నలిస్టులు పనిచేయాలని కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం గెట్ టుగెదర్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని విలేకర్లను ఉద్దేశించి మాట్లాడుతూ పాల్వంచ మండలంను చాలా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందాన్నారు. ప్రజలు నాపై నమ్మకంతో తనను మెజారితో గెలిపించు కున్నారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా పాల్వంచ పాత్రికేయులు తన గెలుపులో ప్రధాన పాత్ర పోషించారని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవాల్సిన అవసరం ఉందని, అసెంబ్లీలో కూడ ప్రజల సమస్యలపై కొన్ని ప్రతిపాదనలు తీసుకొచ్చానని వాటిని ముందుకు తీస్తూ పోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని చెప్పారు. కేటీపీఎస్‌లోని ఓ అండ్ ఎం పాత ప్లాంటుని పునర్నిర్మాణం చేయాల్సిన అవసరం ఉంది దానివలన స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కల్పన దొరుకుతుందన్నారు స్పాంజ్ ఐరన్ కర్మగారంను పునర్మించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాల్సిన కొన్ని ప్రత్తిపాదనలను సిద్ధం చేశానని అవి ప్రతి వ్యక్తికి ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, జర్నలిస్టులకుహెల్త్ కార్డులు మంజూరు చేయాలని, జర్నలిస్టులు పిల్లలకుప్రైవేట్ స్కూళ్లలో 50% రాయితీ కల్పించాలని,పేదవారికి ఉచితంగా వైద్యం, విద్య,ఉపాధి కల్పించాలని. అన్నారు. పాలవంచలో ఉన్నటువంటి ప్రభుత్వ హాస్పిటల్‌ను 100 పడకల ఆసుపత్రిగా, చేయాలనీ, అందులో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనీ (లా)కాలేజీ, జేఎన్టీయూ యూనివర్సిటీ, బీఈడీ కాలేజ్, సబ్ జైలు(కారాగారం), ఐటీ హబ్, ఈఎస్ఐ హాస్పిటల్, పాలవంచలో నెలకొల్పాలని మొదలగు సౌకర్యాలను కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు చేరువ చేయుటకొరకు ఈ ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని పేర్కొన్నారు. పాత్రికేయ మిత్రులు పత్రికా ముఖంగా ప్రభుత్వానికి తెలియజేసే విధంగా తమవంతు కృషి చేయాలన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్యలో వారధిగా ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇండ్లు మంజూరు చేసే విధంగా కృషి చేస్తానని, తప్పకుండా వస్తాయని ఆధర్యపడవద్దని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కూనంనేనికి పత్రికేయ బొకేలు అందించి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాష, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, తహసిల్దార్ వినయ్ మున్సిపల్ కమిషనర్, జిల్లా మండల కార్యదర్శి వీశంశెట్టి పూర్ణచంద్రరావు, పట్టణ కార్యదర్శి జిల్లా సమితి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, వీ.పద్మజ, డీ.సుధాకర్, కాంగ్రెస్ నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య నూకల రంగారావు, కొండా వెంకన్న, సిపిఐ నాయకులు విశ్వేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగరపు శ్రీనివాస్ రావు, వైయస్ గిరి, ఎస్కే పాషా, కాంగ్రెస్ నాయకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పట్ల సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



రాష్ట్రంలో నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మొట్టమొదటిసారి భద్రాచలం వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాచలం అభివృద్ధి పట్ల స్పష్టమైన ప్రకటన చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన నిర్వహించిన భద్రాచలం పట్టణ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలం అభివృద్ధి పట్ల గత బిఆర్ఎస్ ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. రాష్ట్ర విభజనలో, జిల్లా విభజనలో భద్రాచలం తీవ్రంగా నష్టపోయిందని ఆ నష్టాన్ని పూడ్చేందుకు గత ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. నిత్యం రాముని జపం చేసే బిజెపి ప్రభుత్వం కూడా భద్రాచలం పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిందన్నారు. నేపథ్యంలో తొలిసారి భద్రాచలం వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలం అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలలో భాగంగా భద్రాచలంకు రక్షణ కవచంగా ఉన్న కరకట్టను ఎత్తు పెంచి పొడిగించి పటిష్టపరిచేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, భద్రాచలంకు ఆనుకొని ఉన్న ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపెందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. భద్రాచలం కేంద్రంగా ఉన్న సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని, భద్రాచలం ఆలయాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని, పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ తో భద్రాచలంకు పొంచి ఉన్న ప్రమాదంపై నిర్దిష్టంగా సర్వే చేసి ముంపుపై స్పష్టత నివ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే స్థానికంగా ఉన్నటువంటి అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి స్థలాలు లేనివారికి స్థలాలు కేటాయించి నిర్మాణం ఇవ్వాలని కోరారు. పట్టణ సమస్యలతో పాటు నియోజకవర్గంలోని పోడు భూముల సమస్య త్రాగు, సాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి. నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, వై. వెంకట రామారావు, నాదెళ్ల లీలవతి, పట్టణ కమిటీ సభ్యులు డి. లక్ష్మి, జీవన జ్యోతి, కున్జా శ్రీను, నాగరాజు, సి. హెచ్. మాధవరావు, ఎస్‌డి. ఫిరోజ్, సీనియర్ నాయకులు ఎంవి యస్. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలి

- సీఐటీయూ నాయకులు అర్జున్

నవతెలంగాణ-అశ్వారావుపేట



మధ్యాహ్న భోజన కార్మికులకు బకాయి వేతనాలు, వంట, గుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలని, ఈ నెల 11 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక విద్యాశాఖ మండల కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట కార్మికులు అనేక ఇబ్బందులు పడి,బయట వడ్డీలకు అప్పులు తెచ్చి వంట నిర్వహణ నిర్వహిస్తున్న అప్పటికి సకాలంలో బిల్లులు చెల్లించని కారణంగా అనే ఇబ్బందులు పడుతున్నారన్నారు. నెలలు తరబడి బిల్లులు బకాయి పడుతున్న కారణంగా మా బిల్లులు విడుదల చేయండి అని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదని తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 11 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నామని ఆ మేరకు ఎంఈఓ క్రిష్ణయ్యకి సమ్మె నోటీసు ఇచామన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం మండల అధ్యక్షురాలు నన్ని యామిని, నాగ దుర్గ, సీత దశమి దేవి, వెంకమ్మ, సత్యవతి లీల తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

నవతెలంగాణ-బూర్గంపాడు



అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం బూర్గంపాడు మండలంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పినపాక నియోజకవర్గంలో 3500 ఇండ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించటం సరైనది కాదన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు గత ప్రభుత్వం నకిరిపేట నుంచి గోపాలపురం పోయే రోడ్లో 10 ఏళ్ల నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. నేటికి పూర్తి కాలేదని, బూర్గంపాడు మండల పరిధిలో డబుల్ బెడ్ రూములు కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పనులను ప్రారంభించి నిర్మాణం పూర్తి అయ్యాక అర్హత కలిగిన వారికి ఇవ్వాలన్నారు. గోపాలపురం, టేకులచెరువు, నకిరి పేట ఆ గ్రామాలకు చెందిన వారికి అదేవిధంగా మండల వ్యాప్తంగా ప్రతి నిరుపేదలకు డబుల్ బెడ్ రూములు అమలు చేయాలని ఆయన అన్నారు. 11 వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్మీ పురం వస్తున్న సందర్భంగా ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చే విధంగా నిర్ణయాలు తీసుకుం టారని పేర్కొన్నారు. వారందరికీ అందే విధంగా డబుల్ బెడ్రూంలు ప్రభుత్వం ఆ రకంగా చర్యలు తీసుకుంటారని తెలిపారు. అర్హత కలిగిన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలన్నారు. స్థలం లేని వారికి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని, స్థలం ఉన్న వారికి ఐదు లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు గుంటక కృష్ణ, దాసరి వెంకన్న, కనితి రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సమాజానికి రోల్ మోడల్స్‌గా ఉండాలి



- జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ

మహిళలు సమాజానికి రోల్ మోడల్స్‌గా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అన్నారు. బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ మహిళలు అభివృద్ధికి విద్యా ప్రధానమైనది అన్నారు. విద్యావంతురాలు అయిన అన్ని రంగాల్లోనూ తన శక్తి సామర్థ్యాలు నిరూపించుకొని ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని, సంక్షేమ కార్యక్రమాలన్నీ మహిళా పేరు మీదే మంజూరు చేస్తుందన్నారు. డిఆర్‌డిఓ విద్యాచందన మాట్లాడుతూ మహిళల పట్ల లింగ వివక్ష నిర్మూలకు కుటుంబ వ్యవస్థ నుండే ప్రారంభం కావాలన్నారు. మహిళా శిశు సంక్షేమ అధికారి విజేత మాట్లాడుతూ మహిళలు సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందాలంటే విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ జండర్ ఈక్విటీ అధికారి అన్నామని, సిడిపివోలు కనకదుర్గ, జ్యోతి, లక్ష్మీ ప్రసన్న, సులోమి, రూప, మహిళా సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు : మండల పరిధిలోని సారపాక గాంధీ నగర్‌లో గల అంగన్వాడి కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఎంతో మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఐటిసి స్వచ్ఛంద సంస్థ మమత వారు మహి ళలందరిచే కేక్‌ని కట్ చేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి మహిళా దినోత్సవ ప్రాధాన్యత గురించి వివరించారు. అనంతరం మహిళలందరూ కలిసి పాఠశాల



ప్రధానోపాధ్యాయులు పద్మావతి, అంగన్వాడీ టీచర్ రచనలను సన్మానించి సత్కరించారు. వచ్చిన వారందరికీ బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పేరాల శ్రీను, లక్ష్మీనారాయణ, ఆవాస ప్రాంతంలోని మహిళలు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

నవతెలంగాణ-బూర్గంపాడు

ఐటిసి ఎమ్మెస్ మమత సంస్థ హెచ్ఐఎంసీ ఆధ్వర్యంలో మండలంలోని రెడ్డిపాలెంలో బుధవారం గర్భిణీలకు సామూహిక సీమంతాలు, చిన్న పిల్లలకి అన్నప్రసన్న నిర్వహించారు. ఐటిసి వారి సహకారంతో మమత సంస్థ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలలో అనీమియ నివారణ, పోషకాహారం తీసు కోకపోవడం వల్ల పిల్లలలో కలిగే న్యూట్రీ షియన్ లోపం గురించి తెలియచేయటం, నివారించుట గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఓ స్టాఫ్ డిస్టిక్ కో ఆర్డినేటర్ అనిల్ కుమార్, జరీనా, ఐసి డిఎస్ సిడిపిఓ ప్రమీల, సూపర్వైజర్ సక్కు బాయి, అంగన్వాడి వర్కర్స్ శంకరమ్మ, శ్రీదేవి, సీతారావమ్మ, నాగేశ్వరి, సరళ కుమారి, ఏఎన్ఎం తులసి, ఏఎన్ఎం, తులసి, ఆశా వర్కర్స్ బాయమ్మ వనిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ ఉమెన్స్ గిల్డ్ ప్రమాణ స్వీకారం

- రాష్ట్రంలోనే తొలి ఉమెన్స్ గిల్డ్ ఆవిర్భావం

నవతెలంగాణ-కొత్తగూడెం

ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ (ఐఎస్‌జిఎఫ్) ఉమెన్స్ గిల్డ్ ఆవిర్భావ ప్రమాణస్వీకారం ఘనంగా జరిగింది. బుధవారం కొత్తగూడెం మున్సిపాలిటీలోని తాటి పల్లి రెసిడెన్సిలో ఏర్పాటు చేసిన ఎస్‌జిఎఫ్ జిల్లా సర్వసభ్య సమావేశంలో రాష్ట్రంలోనే తొలిసారిగా ఏర్పాటు చేశారు. ఎస్‌జిఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు లోగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాసీంల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సింగరేణి రిటైర్డ్ అధికారి బీఎస్‌జి కమిషనర్, ఎస్.జి.ఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రామ కృష్ణారావు ఉమెన్స్ గిల్డ్ కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు సిడిపిఓ కనకదుర్గ, కోశాధికారి చిట్టి మల్ల బ్రహ్మం చారి, మహిళ కార్యదర్శులు జ్యోతి రాణి, జరీనాలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఎస్‌జిఎఫ్ మహిళా విభాగం నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఎస్‌జిఎఫ్ ఉమెన్స్ గిల్డ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలిగా డాక్టర్ నూరి మెహరున్నిసా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సిహెచ్.శ్వేతా, కోశాధికారిగా సోనా, జిల్లా ముఖ్య సలహాదారులుగా ఐసీడిఎస్ సీడీపీఓ కనకదుర్గ, హెచ్ఎంలు ఎం.జ్యోతిరాణి, జరీనా బీ, జిల్లా ఆర్గనైజర్లుగా హేమావతి, ఉమా, నసీమ్ పాషా లు ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం సిగ్గుమాలిన చర్య

- కాంగ్రెస్ చర్యను ఖండించిన బీఆర్ఎస్ నేతలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్ : వాస్తవాలు మాట్లాడిన స్థానిక శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు దిష్టిబొమ్మను కాంగ్రెస్ శ్రేణులు దహనం చేయటం సిగ్గుమాలిన చర్య అని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అరికల తిరుపతిరావు విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య ప్రజలకు అందుబాటులో లేకుండా నియోజవర్గ అభివృద్ధిని అడ్డుకున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి కొడిశెట్టి కృష్ణమూర్తి, రత్న రమాకాంత్, బొంబోతుల రాజీవ్, ఆకో సునీల్, పెద్దినేని శ్రీనివాస్, లంక రాజు, గాడి విజయ్, తదితరులు పాల్గొన్నారు.



వల్లమల పుష్పకు నివాళులు

నవతెలంగాణ-జూలూరుపాడు

మండల కేంద్రమైన జూలూరుపాడులో బుధవారం నిర్వహించిన వల్లమల పుష్ప దశదిన కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు పాల్గొని నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, మండల కార్యదర్శి యాసా నరేష్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, భూక్య రమేష్, పార్టీ మండల కమిటీ సభ్యులు గార్లపాటి వెంకటి, వలమల చందర్‌రావు, బానోత్ మధు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు వితరణ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఇంటి పెద్దదిక్కు కోల్పోయిన ఓ నిరుపేద కుటుంబానికి బీసీఎం ప్రెస్ క్లబ్ అండ్ మీడియా వెల్ఫేర్ సొసైటీ ఆసరాగా నిలిచింది. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డి.రవి కుమార్ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలో భగవాన్ దాస్ కాలనీకి చెందిన బొల్లి అచ్చయ్య గత నెల 24 న చనిపోయారు. ఇంటి పెద్ద కోల్పోయి దిక్కు తోచని స్థితిలో ఉన్న కుటుంబానికి బిసిఎం ప్రెస్ క్లబ్ అండ్ మీడియా వెల్ఫేర్ సొసైటీ కమిటీ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం నిత్యవసర సరుకులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడారు. ఈ సందర్భంగా బొల్లి అచ్చయ్య కుటుంబ సభ్యులు ప్రెస్ క్లబ్ కమిటీకి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డి. రవికుమార్, సెక్రెటరీ బి. సాయి కౌశిక్, కోశాధికారి పి. జీవన్ శివకుమార్, గౌరవ అధ్యక్షులు కటారి కృష్ణ, జి. వెంకటేశ్వర్లు, మరియు కారకవర్గం సభ్యులు ఏ. సుధీర్, ఎండి. యాకోబ్ మియా,కే. రాజేష్, జి.సాంబశివ, డి.సతీష్ బాబు, జి. సాయిబాబు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో మహిళలకు అత్యంత ప్రాధాన్యత

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి సంస్థ ప్రతి సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహిస్తూ మహిళలను ప్రోత్సహిస్తుందని జిఎం(పర్సనల్) ఈఈ అండ్ సిఎస్ఆర్, ఉమెన్స్ సెల్ కన్వీనర్ కవితా నాయుడు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని-ఉమెన్స్ సెల్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు, కాంట్రాక్ట్ మహిళా ఉద్యోగులకు బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2024 సంధర్భంగా కార్పొరేట్ ఏరియా పరిధిలోని అన్ని డిపార్ట్మెంట్ల నందు పనిచేసే మహిళా అధికారులకు, ఉద్యోగులకు, మహిళా కాంట్రాక్ట్ కార్మికులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కవితా నాయుడు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్నారు. అత్యధిక సంఖ్యలో మహిళా ఉద్యోగులు, కాంట్రాక్ట్ మహిళా ఉద్యోగులు ఈ పోటీలలో పాల్గొనడం చాలా సంతోషకారమన్నారు. సింగరేణి సంస్థ ప్రతి సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహిస్తూ మహిళలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజిఎం (పర్సనల్) కె.శ్రీనివాసరావు, సీనియర్ పిఓ టి.శ్రీనివాస రావు, ఉమెన్స్ డే ఆర్గనైజర్స్ పి.కిరణ్మయి, బి.సుమలత, డి.శారద, కె.రమ, ఏ.విజయ కుమారి, జిబి.అరుణకుమారి, కె.శైలజ, ఎన్.ఉష, బి.మౌనిక, ఏ.అరుణ కుమారి, కార్పొరేట్ ఏరియా మహిళా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

32 మంది విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఈ ఏడాది ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారంతో ఏడో రోజు కు చేరాయి. నియోజక వర్గం కేంద్రమైన అశ్వారావుపేటలో ఏర్పాటు చేసిన ప్రభుత్వం జూనియర్, టిఎంఆర్, వీకేడీవీఎస్ ఆర్ జూనియర్ కళాశాలల్లో నీ మూడు పరీక్షా కేంద్రాల పరిధిలో ప్రధమ సంవత్సరం గణితం - బి/జంతు శాస్త్రం/చరిత్ర విభాగం పరీక్షలలో మొత్తం 756 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 724 మంది విధ్యార్థులు పరీక్షలకు హాజరు అయ్యారు. 32 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్, సీఐ జితేందర్, ఎస్‌హెచ్ఓ ఎస్ఐలు శ్రీను, శివరామ క్రిష్ణ బందోబస్తును పర్యవేక్షించారు. ఈ పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంట్ ఆఫీసర్‌లుగా దామెర నరసింహారావు, అలవాల వెంకటేశ్వరరావు, రామయ్య, ఝాన్సీ, యేశోబు, ఎల్.శివప్రసాద్‌లు విధులు నిర్వహిస్తున్నారు.

కేంద్రం	ఎలాట్మెంట్	అబ్సెంట్	ప్రజెంట్
జి.జేసి	305	291	14
టిఎం ఆర్ జేసీ	139	134	05
వీకేడీవీఎస్ఆర్ జేసీ	312	299	13
మొత్తం	756	724	32



సీఎం సభ ఏర్పాట్లు పరిశీలన

నవతెలంగాణ-బూర్గంపాడు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 11న భద్రాచలం పర్యటన నేపథ్యంలో బూర్గం పాడు మండలం లక్ష్మీపురంలో నిర్వహించతల పెట్టనున్న సభా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. సభా ప్రాంగణాన్ని పరిశీలించి భద్రతా చర్యలకు ఏర్పాట్లు చేయాలని కిందిస్థాయి అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, సీఐ వినయ్ కుమార్, ఎస్సై సుమన్, మాజీ సొసైటీ చైర్మెన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీపురం ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ సభా స్థలాన్ని పరిశీలించిన పొదెం

మండల పరిధిలోని లక్ష్మీపురంలో ఈనెల 11న జరగనున్న సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు సంబంధించిన స్థలాలను జిల్లా కాంగ్రెస్ అధ్య క్షులు పొదెం వీరయ్య బుధవారం నాయకులతో కలిసి పరిశీలించారు. సభకు సంబంధించి స్థలా న్ని పరిశీలించి ఏర్పాట్లు చేసేందుకు చర్యలు చేప ట్టాలని సభా నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు దుర్గాప్రసాద్, చందా సంతోష్కుమార్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు మహిమూద్, బూర్గంపహాడ్, భద్రాచలం మండ లాల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, సరెళ్ల నరేష్, ఎడారి ప్రదీప్, అడబాల వెంకటేశ్వరరావు, బెల్లంకొండ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెంకట్రావు నోరు అదుపులో పెట్టుకో

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లంకా శ్రీనివాసరావు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు నోరు అదుపులో పెట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లంకా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీనగరం ప్రధాన సెంటర్లో ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా లంక శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన పొదెం వీరయ్య నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించాడని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు విలేకరుల సమావేశంలో ఆరోపించడాన్ని కాంగ్రెస్ పార్టీగా తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ వైస్ చైర్మెన్ దర్శి సాంబశివరావు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలక వెంకటరమణ రెడ్డి, జిల్లా సోషల్ మీడియా చైర్మెన్ కనుబుద్ది దేవా, తోటమల్ల సుధాకర్, గుమ్మడి శ్రీను, కుర్సం మారయ్య రమేష్, వెంకయ్య చౌదరి, మద్ది సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన హక్కుల కోసం మనమే కదం తొక్కాలి

- శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జీ.పద్మ

నవతెలంగాణ-పాల్వంచ



మన హక్కుల కోసం మనమే కదం తొక్కాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి పద్మ పిలుపునిచ్చారు. స్థానిక లారీ అసోసియేషన్ హాల్లో పట్టణ కన్వీనర్ కే. సత్య అధ్యక్షతన నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇప్పుడున్న కేంద్ర ప్రభుత్వం మహిళలపై బిజెపి కేంద్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని, మహిళలు బయటకెళ్ళి చదువుకోకూడదని, చదువుకోవడం వల్లనే అత్యాచారాలు జరుగుతున్నాయని బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్ చెప్పడం సిగ్గుచేటని అన్నారు. ప్రతి మహిళా చైతన్యవంతురాలిగా మారాలని మనం వేసే ప్రతి అడుగు చాలా ఆలోచనదాయకంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ దీప, సిఐటియు పట్టణ కన్వీనర్ కే. సత్య, ఐద్వా పట్టణ అధ్యక్షులు క్రాంతి, అంగన్వాడి సెక్టార్ లీడర్ రమ్య , అచ్చి కృష్ణవేణి, ముంతాజ్, లక్ష్మి, నాగమణి, రమాదేవి, సావిత్రి, ఆశ, పీహెచ్సీనాయకులు రమణ, ఉష, పద్మ, మరియమ్మ, ఐద్వా నాయకులు ఇందిరా, సునీత, పద్మ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు : ప్రజల ఐక్యతకు భంగం కలిగించే మతోన్మాద చర్యలు దేశానికి ప్రమాదకరమని శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ జిల్కర పద్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఏలూరు భవన్లో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కల్లేపల్లి మరియ, తాళ్లూరి పద్మ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో అంగన్వాడి జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, మధ్యాహ్న భోజన జిల్లా కార్యదర్శి ఎస్కెచ్. సుల్తానా, ఐద్వా జిల్లా నాయకురాలు ఆలేటి సంధ్య, సుభద్ర, పద్మ, కౌసల్య, దేవమణి, కుమారి, సోమలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మన ఇసుక-మన వాహనానికి నిరాకరణ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండల పరిధిలోని రాఘవాపురం, రాయిపాడు, అనంతోగు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పిసా గ్రామ సభల్లో మన ఇసుక - మన వాహనం ద్వారా ఇసుక తోలకాల తీర్మానానికి మూడు పిసా కమిటీలు, సభ్యులు, ప్రజలు నిరాకరించినట్లు స్థానిక ఎంపీఓ బత్తిన శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ గ్రామ సభలు పిసా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, జీపీ ప్రత్యేక అధికారులు, జీపీ కార్యదర్శుల సమక్షంలో నిర్వహించామన్నారు. రాయిపాడులో జరిగిన గ్రామసభలో గత 2020 సంవత్సరంలో ఇసుక ద్వారా వచ్చిన జమా, ఖర్చులు తెలియజేయాలని పిసా కమిటీ, ప్రజలు కోరినట్లు చెప్పారు. అలాగే షెడ్యూల్డ్ ప్రాంతంలోని షెడ్యూలు తెగలకు గతంలో అసైన్డ్ పట్టాలు ఇచ్చారని, ఆ పట్టాలకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేసి, లబ్దిదారులకు అందజేయాలని అడిగినట్లు తెలిపారు. ఈ అంశాలపై అధికారులు పూర్తి అవగాహన కల్పించినా మన ఇసుక - మన వాహనం కార్యక్రమాన్ని బహిష్కరించినట్లు చెప్పారు. అలాగే అనంతోగు జీపీలో సైతం పిసా కమిటీ, ప్రజలు నిరాకరణ పరిస్థితి నెలకొందన్నారు. రాఘవాపురం గ్రామపంచాయతీలో హాజరైన వారిలో కొందరు గ్రామాభివృద్ధికి మన ఇసుక - మన వాహనం అవసరమని.. తెలియజేయగా మరికొందరు తటస్థంగా.. మరికొందరు నిరాకరించడంతో తీర్మానం తిరస్కరణకు గురైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పిసా కమిటీలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశాలలో అన్ని సౌకర్యాలు కల్పించండి

- ఎంపీడీఓ రామకృష్ణ

నవతెలంగాణ-పినపాక

ఉపాధి హామీ కూలీలు పనిచేసే ప్రదేశాలలో అన్ని సౌకర్యాలను కల్పించాలని, ఎటువంటి ఇబ్బంది లేకుండా వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని పినపాక ఎంపీడీవో రామకృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం పినపాక ఎంపీడీవో కార్యాలయంలో సెక్రటరీలు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పనులు కోరిన ప్రతి కుటుంబానికి వందరోజుల పనిని కల్పించాలని ఆదేశించారు. పని దినాలను పంచాయతీల వారీగా విభజించి ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్కు టార్గెట్లను నిర్దేశించామన్నారు. టార్గెట్ ప్రకారం పనుల డిమాండ్లు పెట్టి ప్రతి గ్రామంలో వేతనదారులకు విధిగా ఉపాధి పనులు కల్పించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనుల్లో క్వాలిటీ, క్వాంటిటీ వుండే విధంగా వేతనదారులకు పనులు చేయించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఏపీఓ వీరభద్రస్వామి, సెక్రటరీలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కృతజ్ఞత సభను విజయవంతం చేయండి

నవతెలంగాణ-జూలూరుపాడు

బీఆర్ఎస్ పార్టీ నుంచి రాజ్యసభ సభ్యునిగా రెండోసారి వద్దిరాజు రవిచంద్ర ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్కు కృతజ్ఞతలు తెలుపుతూ ఈనెల 7న ఖమ్మం మధ్యాహ్నం 3:00గంటలకు ఖమ్మం ఆర్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్ పక్కన గాయత్రి గ్రౌండ్స్లో నిర్వహించబోయే కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, వైరా నియోజకవర్గ నాయకులు లకావత్ గిరిబాబు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సభకు మాజీ మంత్రులు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ నామ నాగేశ్వరరావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు తాతా మధు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీలు, ఎంపీపీలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు అన్ని మండలాల, గ్రామాల, పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, వార్డు, గ్రామ, మండల పార్టీ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేపే శ్రీ ఆత్మ లింగేశ్వరాలయం మహాశివరాత్రి మహోత్సవం

-ఆలయ ధర్మకర్త మచ్చ శ్రీనివాసరావు

- రాష్ట్రంలోనే సూర్యకిరణాలు శివలింగంపై పడే ఏకైక శివాలయం

నవతెలంగాణ-పాల్వంచ

ఈనెల 8న శుక్రవారం మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా శ్రీ ఆత్మలింగేశ్వరాలయంలో మహాశివరాత్రి మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త మచ్చ శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని గోవర్ధనగిరి కాలనీ చింతల (మఠం) చెరువు కట్ట శ్రీ ఆత్మలింగేశ్వ ఆలయం నందు బుధవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆలయ ఆయన మాట్లాడుతూ 8వ తారీఖున జరిగే మహాశివరాత్రి సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వలె ఈ సంవత్సరం కూడా శివాలయంలోనే మహాశివరాత్రి పండుగని అత్యంత వైభవోపేతంగా జరుగుతుందని అన్నారు. ఈ ఆలయం రెండు తెలుగు రాష్ట్రాలలోనే సూర్యకిరణాలు నేరుగా స్వామివారి పైన పడే విధంగా ఆలయాన్ని మహా అద్భుతంగా నిర్మించారాని తెలిపారు. 7 న గురువారం 8 గంటలకు సుబ్రహ్మణ్య స్వామికి పంచామృత అభిషేకము, లింగార్చన, సుబ్రహ్మణ్య హెూమము.సాయంత్రం ఐదు గంటల 30 నిమిషాలకు కలిసి పూజ గణపతి పూజ పుణ్యాహవాచన పశుపత మృత్యుంజయ రుద్ర హెూమములు జరుపబడును అన్నారు. ఈ మహాశివరాత్రి ఉత్సవములకు, అన్న ప్రసాద కార్యక్రమాలకు భక్తులు ధన ధాన్య ద్రవ్య రూపేణ ఆలయ కమిటీ వారికి అందజేసి ఈ కార్యక్రమంను విజయవంతం చేయుటకు సహకరించవలసిందిగా ఈ సందర్భంగా కోరారు.

పుల్లారావుకి సీపీఐ(ఎం) నాయకులు నివాళి

నవతెలంగాణ-అశ్వారావుపేట

సీపీఐ(ఎం) ఉమ్మడి ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు, సత్తుపల్లి డివిజన్ మాజీ కార్యదర్శి మోరంపుడి పుల్లారావు(73) మృతి పార్టీకీ తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య అన్నారు. మోరంపుడి పుల్లారావు వయోభారంతో కూడిన అనారోగ్యంతో బుధవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని వారి స్వగృహం మృతి చెందారు. ఈయన మృతి సమాచారం తెలుసుకున్న పుల్లయ్య సత్తుపల్లిలోని ఆయన గృహంలో ఉన్న మోరంపుడి పుల్లారావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకర్లుతో మాట్లాడుతూ సత్తుపల్లి, దమ్మపేట మండలాల్లో పార్టీ అభివృద్ధికి నిర్విరామ కృషి చేశారని గుర్తు చేశారు. తన తుదిశ్వాస విడిచే వరకు కమ్యునిజం సిద్ధాంతాలకు అనుగుణంగా జీవించిన పుల్లారావు ఆచరణ వాద కమ్యూనిస్టు అని పార్టీ ఆయన చేసిన సేవలను కొనియాడారు. సీపీఐ(ఎం) అశ్వారావుపేట మండల కమిటీ తరుపున ఆయన సంతాపం ప్రకటించారు. మోరంపుడి పుల్లారావు నివాళులు అర్పించిన వారిలో జిల్లా కమిటీ సభ్యులు పిట్టల అర్జున్,దొడ్డా లక్ష్మినారాయణ, మోరంపుడి శ్రీనివాసరావు, చిరంజీవి ఉన్నారు. పుల్లారావుకు భార్య కూతురు, కుమారుడు ఉన్నారు.

ఆటోను ఢీకొన్న ట్రావెల్ బస్సు

- ముగ్గురికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-బూర్గంపాడు



ఆటోను వెనుక నుంచి ట్రావెల్ బస్సు ఢీకొన్న సంఘటన మండల పరిధిలోని ముసలిమడుగు బ్రిడ్జి వద్ద బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. దీనికి సంబంధించి బాధితులు తెలిపిన వివరాలప్రకారం...మహబూబాబాద్ నుంచి వస్తున్న ఆటోను హైదరాబాద్ వైపు నుంచి వచ్చే ఓ ట్రావెల్ బస్సు వెనుక నుంచి ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వారిని భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యుల సూచన మేరకు ఖమ్మంలో ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఆటోలో ప్రయాణీస్తున్న చెన్నూరు సతీష్తో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయని, చెన్నూరు సతీష్ తలకు బలమైన గాయమై పరిస్థితి విషమంగా ఉన్నట్లు బాధితుని తల్లి వెంకటరమణ తెలిపింది. అయితే ఆమె పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

శ్రద్ధతో ధరణి సమస్యలను పరిష్కరించండి

• జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ

పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి ఈనెల 9వ తేదీ వరకు చేపడుతున్న స్పెషల్ డ్రైవ్లో ఆర్డీవోలు తాసిల్దారులు, ప్రత్యేకశ్రద్ధతో తమ తమ కార్యాలయాల్లో ధరణి సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అధికారుల ఆదేశించారు. పాల్వంచ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న ధరణి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని



బుధవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఇప్పట వరకు రైతుల నుంచి ఎన్ని దరఖాస్తులు వచ్చాయని ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాల్వంచ మండలంలో భూమి వివరాలు, సర్వే నంబర్లు, పేర్లు, పాస్ పుస్తకాలలో తప్పులపై ఆరా తీశారు. ఈ స్పెషల్ డ్రైవ్లో భాగంగా అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని, ఒక్కటి కూడా పెండింగ్లో ఉండకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్డీవో మధు, తహసీల్దార్ వివేక్ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలిచ్చిన లబ్దిదారులకు ఇల్లు నిర్మించి ఇవ్వాలి

• పేదలకు ఇళ్ళస్థలాలు సాధించిన ఘనత సీపీఐ(ఎం)దే

• సీపీఐ(ఎకం) సీనియర్ నాయకులు కాసాని అయిలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం మున్సిపాలిటీలో పట్టాలిచ్చిన వారికి తక్షణమే స్థలం చూపించి, లబ్దిదారులకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కాసాని అయిలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని పాత కొత్తగూడెంలో పేదలకు పంచడానికి ప్రభుత్వం కేటాయించిన ఖాళీ స్థలాన్ని సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1997 నుండి అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) నిర్వహించిన దశలవారి పోరాటాల ఫలితంగా ఆనాటి ప్రభుత్వం పాత కొత్తగూడెంలో 40 ఎకరాల భూమి కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. 836 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఇంటి నిర్మాణం పూర్తికాక ముందే బోగస్ డ్రా పేరుతో ప్రజలను మోసం చేస్తే దానికి వ్యతిరేకంగా పోరాటం చేసి అనర్హులకు కేటాయించిన ఇళ్ళను రద్దు చేసేంత వరకు అధికారులపై సీపీఐ(ఎం) ఒత్తిడి చేసిందని గుర్తు చేశారు. ఆ తర్వాత పాత కొత్తగూడెంలలో ఉన్న ఖాళీ స్థలాన్ని పేదలకు పంపిణీ చేసి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం సహకారం అందించాలని పలుమార్లు తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల ముందు సీపీఐ(ఎం) ఆందోళన చేసిన ఫలితంగా గత ప్రభుత్వం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో 800 మందికి 77 గజాల చొప్పున స్థలం కేటాయిస్తూ పట్టాలు ఇచ్చిందని చెప్పారు. కానీ వారికి స్థలం మాత్రం చూపించలేదన్నారు. ప్రస్తుతం నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చిందని ఆ హామీలో భాగంగా గత ప్రభుత్వం ఎవరినైతే లబ్ధిదారులను గుర్తించి పట్టాలిచ్చిందో వారికి స్థలం చూపించి, అందులో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేసి తక్షణమే లబ్ధిదారులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో లబ్ధిదారులను కలుపుకొని డబుల్ బెడ్ రూం మొండి గోడలపై ఎర్ర జెండాలు ఎగరవేసి పేదలకు పంపిణీ చేస్తామని నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, డి.వీరన్న, సందకూరు లక్ష్మి జునుమాల నగేష్, నందిపాటి రమేష్, దనియాకుల శివ, ముత్తేష్, ఎస్కె. సాహెబీ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫాం సాగుదారులకు ఆర్థిక చేయూత

• డీసీసీబీ సీఈఓ ఏఆర్.రహ్మాన్

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఆయిల్ ఫాం సాగు దారులకు పంట పెట్టుబడికి ఋణాలు అందించడం ద్వారా ఆర్ధిక తోడ్పాటును అందించాలని, ప్రభుత్వ విధానం ప్రకారం ప్రత్యేకంగా ఋణాలు మంజూరు చేస్తుందని డీసీసీబీ సీఈవో ఏఆర్.రహ్మాన్ తెలిపారు. రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో వాయిదాలను చెల్లించాలని సూచించారు. నియోజక వర్గం కేంద్రమైన అశ్వారావుపేట మండలం పేరాయిగూడెం పంచాయితీ పరిధిలోని రైతు వేదికలో బుధవారం డీసీసీబీ అశ్వారావుపేట బ్రాంచ్ మేనేజర్ ఆర్.అనూష పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన పామాయిల్ రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంట ఋణం క్రింద రూ. 1 లక్ష వరకు రుణం మంజూరు చేస్తామని ఇందుకు 7 శాతం వడ్డీ లో 3 శాతం కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, మిగతా 4 శాతం రైతులు చెల్లించాలని వివరించారు. అదేవిధంగా నాబార్డు నుండి కొత్తగా సాగు చేసుకునే రైతులకు నాలుగేళ్ళ పాటు ఎకరాకు రూ.1.35 లక్షలు రుణం క్రింద అందించ నుందని, ఇందుకు రూ.0,32 వరకు వడ్డీ ఉంటుందని, దీనికి ఎటువంటి వడ్డీ రాయితీ ఉండదని చెప్పారు. డీసీబీ బ్యాంక్ ఎకరాకు రూ.50 వేల చొప్పున రుణం మంజూరు చేస్తుందని, రూ.3 లక్షల వరకు సుమారు రూ.0.20 పైసలు, రూ.3 లక్షల నుండి రూ.10 లక్షల వరకు రుణం తీసుకుంటే రూ.1 వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని, వ్యవసాయ భూమిని మార్టిగేజ్ చేసే రైతులకు ఎకరాకు రూ.4 లక్షల వరకు రుణం మంజూరు చేస్తామని,ఓ డీ పద్దతిన కూడా అమలు చేస్తామని తెలిపారు. ఓడి పద్దతిలో రైతు వినియోగించుకున్న రుణ సొమ్ముకు మాత్రమే వడ్డీ చెల్లించాలని,ఈ పద్దతి రుణానికి కూడా ఎటువంటి వడ్డీ రాయితీలు ఉండవని చెప్పారు. రైతులు మాత్రం అత్యధికంగా ఎసైన్మెంట్ భూములే ఉన్నాయని, వాటిని మార్ట్ గేజ్ చేయటం సాధ్యం కాదని, ఎసైన్మెంట్ భూములకు కూడా రుణాలు మంజూరు చేయాలని రైతులు కోరారు. ఈ సూచనపై ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని, ఇచ్చిన రుణానికి రైతు నుండి కనీస గ్యారంటీ లేకుండా పెద్ద మొత్తంలో రుణం ఇవ్వటం కుదరదని సూచనప్రాయంగా వివరించారు. ఇతర బ్యాంకుల కంటే మెరుగైన రుణ సదుపాయం కల్పిస్తే రైతులకు మేలు జరుగుతుందని పలువురు రైతు సంఘం నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, దండు రామరాజు, తుమ్మ రాంబాబు,ఆళ్ళ నాగేశ్వరరావు, బత్తిన పార్ధసారధి సీఈవోకు విజ్ఞప్తి చేశారు. రైతులు లేవనెత్తిన సమస్యలపై డీసీసీబీ పాలకవర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఈవో హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డీసీసీబీ ఏ జీఎం అజయ్‌రెడ్డి, డైరెక్టర్ నిర్మల పుల్లారావు, అశ్వారావుపేట సొసైటీ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, పూర్వ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మొగళ్ళపు చెన్నకేశవ రావు, సుంకవల్లి వీరభద్రరావు, సొసైటీ సీఈఓ మానేపల్లి విజయ్ బాబు, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, అచ్యుతాపురం,గుర్రాల చెరువు, ఊట్లపల్లి, గంగారం, జమ్మి గూడెం, పేరాయిగూడెం డైరెక్టర్ లు తెల్ల మేకల కన్నయ్య కలపాల మహాలక్ష్మి, బత్తిన పార్ధసారధి, అల్లూరి వెంకటరామారావు, చిట్టిబాబు, కలపాల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపడుచులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ భరోసా

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-కొత్తగూడెం



పేదింటి ఆడపచులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం భరోసాఅని, ఈ పథకానికి మరిన్ని మెరుగులు దిద్ది అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయమని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం క్రింది కొత్తగూడెం మున్సిపాలిటీ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో ఎంపికైన 135 లబ్దిదారులకు రూ.1.35కోట్ల విలువగల చెక్కులను బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ ఆడబిడ్డలకు వివాహాలు చేయలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఒకింత ఆసరాగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఎంపిపిలు బాదావత్ శాంతి, భూక్యా సోనా, కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్కె.సాబీర్ పాషా, సిబ్బంది, మున్సిపాలిటీ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

తునికాకు సేకరణ టెండర్లు వెంటనే పూర్తి చేయాలి

నవతెలంగాణ-లక్ష్మీదేవిపల్లి



తునికాకు సేకరణ టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి వెంటనే ప్రూనింగ్ పనులు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత గిరిజన, గిరిజనేతర పేదలకు రెండవ పంటగా తునికాకు సేకరణ ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 194 తునికాకు యూనిట్లకు టెండర్లు పిలవాల్సి ఉండగా కేవలం 26 యూనిట్లకే టెండర్లు ఖరారు చేయడం వల్ల 168 యూనిట్లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో టెండర్లు పిలిచి, ప్రూనింగ్ పనులు ప్రారంభిస్తేనే ఆకు ఎక్కువ నాణ్యత ఉంటుందన్నారు. రాష్ట్రంలో 194 తునికాకు సేకరణ యూనిట్లు ఉంటే ఇప్పటి వరకు కేవలం 26 యూనిట్లకే టెండర్లు పూర్తిచేశారు. కొమ్మకొట్టుడుప్రక్రియనూ మొదలు పెట్టలేదు. టెండర్లను,ప్రూనింగ్ ప్రక్రియలను సకాలంలో చేపట్టకుంటే లక్షలాది మంది పేదల ఉపాధికి గండి పడే అవకాశముంది.తునికాకు సేకరణ పనుల జాప్యంతో దీనిపై ఆధారపడిన ఆదివాసీలు,గిరిజనులు,గిరిజనేతరులు ఆందోళనలో ఉన్నారు. ట్రాన్స్‌పోర్టు రంగంలో గోడౌన్ల వద్ద లోడింగ్,అన్‌లోడింగ్ పనులు ద్వారా వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం,ఆటవీశాఖ చొరవ చూపి తునికాకు సేకరణ కూలీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన, పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు శెట్టి వినోద, జిల్లా కమిటీ సభ్యులు ఈసం నరసింహారావు, సిద్దెల రాములు, రఘు, జోగా ధశరద్, ఎర్రయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చర్ల : నిరుపేద ఆదివాసీలకు రెండవ పంటగా ఉన్న తునికాకు సేకరణ పనుల కోసం తునీకకు టెండర్లను వెంటనే పూర్తి చేయాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం, వ్యవసాయ కార్మికుల సంఘం కార్యదర్శులు కారం నరేష్, బందెల చంటి ఆధ్వర్యంలో బుధవారం చర్ల మండల అటవీశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కారం నరేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కుర్సం రాంబాబు, కారం ముత్తయ్య, గార లాలయ్య, సపక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి : తునికాకు సేకరణ టెండర్లు వెంటనే పిలిచి, ప్రూనింగ్ పనులు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. బుదవారం ములకలపల్లి మండల కేంద్రంలో అటవీశాఖ రేంజ్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం రేంజ్ అధికారికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించి అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గౌరి నాగేశ్వరరావు, రైతుసంఘం నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, రావుజా జగ్గు, లక్ష్మినర్సయ్య సీతారాములు, రమణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'రైతునేస్తం'తో రైతులకు మరింత భరోసా

- ఎమ్మెల్యే జారె

నవతెలంగాణ-ములకలపల్లి



మండల కేంద్రమైన ములకలపల్లి రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి, ఐటీశాఖామంత్రి, వ్యవసాయశాఖామంత్రి, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన రైతునేస్తం కార్యక్రమం రైతులకు మరింత భరోసాగా మారుతుందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. బుధవారం రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొని వీడియో కాన్ఫరెన్స్‌లో రైతుల ట్రైనింగ్ ప్రోగ్రాంను సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్లో వ్యవసాయానికి సంబంధించిన శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటారని, వ్యవసాయానికి సంబంధించి సలహాలు, సూచనలు, ప్రతి సమస్యపై అవగాహన కల్పిస్తారని, రైతులు ఈ చక్కటి కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం, మంగళవారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి సూర్యనారాయణ, టెక్నికల్ వ్యవసాయ అధికారి సాయి నారాయణ, మండల వ్యవసాయాధికారిణి కరుణామయి, నియోజకవర్గంలోని ఏవో, ఏఈవోలు, అన్ని శాఖల అధికారులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలతో మహిళలపై ప్రభావం

- మహిళలపై హింస పెరిగింది...అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం

- ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ

నవతెలంగాణ-కొత్తగూడెం



దేశంలో బిజెపి మతోన్మాద విధానాలు మహిళలపై అనేక రకాల ప్రభావము చూపుతుందని, కేంద్రంలో, రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హింస పెరిగిందని, వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అఖిళ భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ అన్నారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), సిఐటియూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్థానిక మంచి కంటి భవన్లో నిర్వహించారు. ఐద్వా టౌన్ కార్యదర్శి సందకూరి లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యాక్షురాలు బుగ్గవీటి సరళ, శ్రామిక మహిళ సంఘం జిల్లా కన్వినర్ జీలకర పద్మ, ఐద్వా జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హింస పెరిగి పోతున్నాయన్నారు. వీటిని ప్రోత్సహించే విధంగా ఈ ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విమర్శించారు. మహిళలు వంటింటికే పరిమితం. కాకుండా ప్రతి ఉద్యమంలోకి రావాలని, హక్కులు సాధించుకోవాలన్నారు. పని ప్రదేశాలో "హింసలు ఎక్కువయ్యాయని ఆందోళన చెందారు. మహిళ ఆటో నడిపే దగ్గర నుండి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. పని ప్రదేశాల్లో వివక్షత అన్ని చోట్ల జరుగుతుందని, సమాన పనికి సమాన వేతనం కూడా తేడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వీటిని ఎదుర్కోనే విధంగా ప్రతి మహిళ ఆత్మస్థైర్యంతో ముందుకు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ అధ్యక్షురాలు జయశ్రీ, కళావతి, అన్నవరపు పద్మ, జునుమాల మహేశ్వరి, రజిత, సువర్ణ, మీనా, జె.లక్ష్మీ, రమ, డి. వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఆయన ఉంటేనే అభివృద్ధి సాధ్యం

- మా గ్రామాలకు వచ్చి చూసిన అధికారి ఆయనే

- ఎంపీఓను కలిసిన 9 వలస ఆదివాసీ గ్రామాల ప్రజలు

నవతెలంగాణ-పినపాక



ఇంతవరకు వలస ఆదివాసి గ్రామాలను చూసిన అధికారి లేడని, కానీ ప్రస్తుతం పినపాక మండలానికి వచ్చిన ఎంపీఓ వెంకటేశ్వరరావు సమస్య తెలపగానే తమ గ్రామాలకు వచ్చారని, గతంలో తాగునీటి కోసం అనేక సమస్యలు పడ్డామని పినపాక మండలంలోని తొమ్మిది ఆదివాసి వలస గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పినపాక మండలం సుందరయ్య నగర్ గ్రామంలో తాగు నీటి సమస్యను తెలుసుకొని తమ గ్రామానికి వచ్చి వెంటనే స్పందించి సాయంత్రం వరకు అక్కడే ఉండి పనిచేసే తమ గ్రామానికి తాగునీరు అందించారని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు మడివి రమేష్ అన్నారు. ఆ నమ్మకంతోనే 9 గ్రామాల వలస ఆదివాసి ప్రజలం బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పినపాక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీఓ వెంకటేశ్వరరావును కలిసి సమస్యలు తెలిపామన్నారు. ఇలాంటి అధికారి ఉంటేనే తమ సమస్యలు దూరం అవుతాయని తెలియజేశారు. ఇంతకాలం తమ కష్టాలు విన్నవారు కానీ తీర్చిన వారు కానీ లేరన్నారు. ఎంపీఓ వచ్చిన అనతి కాలంలోనే సార్‌కు చెబితే సమస్య తీరుతుంది అనే నమ్మకం మండలంలో కలిగిందని తెలిపారు. వారి సమస్యలు విన్న ఎంపీఓ వెంకటేశ్వరరావు స్పందిస్తూ వెంటనే గ్రామాలను సందర్శిస్తానని వారికి తెలియజేశారు. కొద్ది రోజుల్లోనే తాగునీటి సమస్యను పూర్తిగా జిల్లా అధికారుల మండల అధికారుల సమన్వయంతో పూర్తి చేస్తానని తెలియజేశారు. తాను కేవలం తన విధులు మాత్రమే నిర్వహిస్తున్నారని కొత్తగా గ్రామాలకు చేసింది ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో 9 వలస ఆదివాసి గ్రామాల ప్రజలు పాల్గొని ఎంపీవోకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇష్టపడి చదవి పాఠశాల ప్రతిష్టను పెంచాలి

- సింగరేణి సెంట్రల్ వర్క్‌షాప్ జీఎం దామోదర్‌రావు

ఫ్రెండ్స్ ఫౌండేషన్ కొత్తగూడెం ఆధ్వర్యంలో పరీక్షా కిట్లు వితరణ

నవతెలంగాణ-కొత్తగూడెం

విద్యార్థులు ఇష్టపడి చదవాలని, పాఠశాల ప్రతిష్టను మరింత పెంచాలని సింగరేణి సెంట్రల్ వర్క్‌షాప్ జనరల్ మేనేజర్ ఎస్.దామోదర్‌రావు అన్నారు. బుధవారం ఫ్రెండ్స్ ఫౌండేషన్ కొత్తగూడెం ఆధ్వర్యంలో చుంచుపల్లి మండలం బాబుక్యాంప్‌లోని ప్రభుత్వ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు రూ.10 వేల విలువ గల పరీక్ష కిట్లు 52 మంది విధ్యర్ధులకు వితరణగా అందచేశారు. ఈ సందర్భంగా దామోదర రావు మాట్లాడారు. పేద విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, జామెట్రీ కిట్‌లు అందజేయడం మంచి కార్యక్రమం అన్నారు. ఫ్రెండ్స్ ఫౌండేషన్ కొత్తగూడెం వ్యవస్థాపకుడు సిహెచ్ శ్రీకాంత్‌ను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు బి.నీరజ అద్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ దస్తగిరి, రమాదేవి, సౌందర్య, డిప్యూటీ జనరల్ మేనేజర్ రమేష్ బాబు, ఇంజినీర్ యాదగిరి, రషీద్, మహేష్, శ్రీకాంత్, సంజయ్, వినోద్, భీమన్నా జయంత్ , సత్య సాయి. రాము .తదితరులు పాల్గొన్నారు.

మరో బీజేపీ నేత హతం



నవతెలంగాణ-చర్ల
మావోయిస్టు చేతిలో మరో బీజేపీ నేత హత్యకు గురయ్యాడు. ట్రేడర్స్ సెల్ డివిజనల్ వైస్ ప్రెసిడెంట్ కైలాష్ నాగ్‌ను మావోయిస్టులు పదునైన ఆయుధంతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని కోటమెట్ట అడవుల్లో మావోయిస్టు సంస్థకు చెందిన చిన్న యాక్షన్ టీమ్ ఈ ఘటనను నిర్వహించింది. పోలీసులు అధికారికంగా ధృవీకరించలేదు.

కరువును కలిసికట్టుగా ఎదుర్కొందాం

నవతెలంగాణ -టేకులపల్లి
కరువు వచ్చినా.. ఎంత కష్టం వచ్చినా రైతులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో కరువు పరిస్థితులున్నాయని, కలిసికట్టుగా కరువును ఎదుర్కొందామని సీఎం పిలుపునిచ్చారు. ఈ రైతు నేస్తం ప్రారంభ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టూరిజం, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సంబంధిత అధికారులు తదితరులున్నారు. ఈ కార్యక్రమాన్ని టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్ రోడ్డులోని రైతు వేదికలో బుధవారం ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ఆన్లైన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీడియో కాన్ఫరెన్స్ దృశ్య శ్రవణ విధానం ద్వారా రైతులకు ఆధునిక సాంకేతిక విధానాలపై అవగాహన కల్పించారు. రైతు వేదికల్లో ప్రతి మంగళవారం, శుక్రవారం రైతులకు నేరుగా ఆన్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఏడిఏ వాసవిరాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, ఇల్లందు వ్యవసాయ అధికారి పీ.సతీష్, టేకులపల్లి ఏవో అన్నపూర్ణ, జిల్లా వ్యవసాయ శాఖ ఏవో అశోక్, తహసీల్దార్ నాగ భవాని, ఎంపీడీవో రవీంద్రరావు, టేకులపల్లి పిఏసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందరరావు, ఇల్లందు పిఏసిఎస్ చైర్మన్ మెట్ల క్రిష్ణ, మాణిక్యారం ఎంపీటీసీ రోజా, మాజీ ఆత్మ చైర్మన్ కిన్నెర నర్సయ్య, వైస్ఎంపీపీ ఉండేటి ప్రసాద్, ఎంపీటీసీలు రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు

నవతెలంగాణ -టేకులపల్లి
మండలంలోని సింగరేణి కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళ క్లబ్ ఆవరణలో ఉద్యోగుల కుటుంబాల మహిళలకు బుధవారం ఆటల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో బహుమతులు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సభ్యులు, డివై పియం కృష్ణ, మహిళాలు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి భూనిర్వాసితులకు న్యాయం చేయాలి

పేదల భూములు లాక్కోవడం సహించం : టీడీపీ

నవతెలంగాణ-మణుగూరు
పినపాక నియోజకవర్గంలో బూర్గంపాడు నుండి పినపాక మండలం వరకు వరదల కారణంగా పరివాహక ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రజలకు ఇసుకను స్వేచ్ఛగా వాడుకునే అవకాశం కల్పించాలని తెలుగుదేశం పార్టీ మహబూబాబాద్ పార్లమెంటరీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి చలపతిరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గోదావరి ప్రతి సంవత్సరం వరదల రూపంలో ప్రజలను అనేక రకాలుగా నష్టానికి గురి చేస్తుందని అన్నారు. పంట నష్టం వరదల కారణంగా సర్వం కోల్పోతున్న వారికి ఇల్లు పునర్నిర్మానానికి గోదావరి ఇసుకను స్వేచ్ఛగా వాడుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. మణుగూరు ఓసి విస్తరణలో భాగంగా తెర్లాపురం, తిర్లాపురం ప్రాంతాలలో సింగరేణి 813 ఎకరాల భూమిని రైతుల నుండి సేకరిస్తుందన్నారు. భూ నిర్వాసితులకు సరైన ప్యాకేజీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ రాజా, మల్లిడు లోకేష్, మద్దెల భద్రయ్య పూర్ణ రామారావు, హరి తదితరులు పాల్గొన్నారు.

దానధర్మ ట్రస్ట్ ఆర్థిక వితరణ

మణుగూరు : పినపాక మండలం ఏడూళ్ళ బయ్యారం ఎస్సీ కాలనీకి చెందిన చిట్టిమల్ల పున్నం అనారోగ్యంతో పేదరికంతో చనిపోయారు. మృతునికి కుటుంబానికి దానధర్మ ట్రస్ట్ చైర్‌పర్సన్ గంటా రాధ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సహాయం నిత్యావసర సరుకులు అందజేశారు.

నేడు ఎస్ఆర్ కన్వెన్షన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో గురువారం ఉదయం పది గంటలకు మహిళాదినోత్సవ వేడుకలను నిర్వహించనున్నారని కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం శక్తి సూపర్ షీ జిల్లా కోఆర్డినేటర్ హారిక నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో భాగంగా మహిళా మణులకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ మహిళా నేతలు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

టిప్పర్ ఢీకొని యువకుడు మృతి

నవతెలంగాణ-ముదిగొండ
యడవల్లి లక్ష్మీపురం (పాతలక్ష్మీపురం) నుండి ముదిగొండ వైపు వస్తున్న టిప్పర్ కూసుమంచికు చెందిన పెంద్ర రాము(30) అనే యువకుడు ముదిగొండ నుండి కూసుమంచి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఢీకొట్టింద. దీంతో బైక్ నుండి రాము రోడ్డుపై పడటంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటిని తీర్చిదిద్దే విషయంలో ఆడవారికి వారే సాటి

జెడ్పీ చైర్మెన్ లింగాల కమల్ రాజు

నవతెలంగాణ-మధిర
ఇంటిని తీర్చిదిద్దే విషయంలో ఆడవారికి వారే సాటి అని జెడ్పీ చైర్మెన్ లింగాల కమల్ రాజు అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మధిర ఐసీడీఎస్ ప్రాజెక్టు కేంద్రం నందు సీడీపీవో శారద శాంతి అధ్యక్షతన మహిళా సాధికారిక సమానత్వంపై నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. సిడిపిఓ శారద శాంతి మాట్లాడుతూ... లీగల్ అవేర్నెస్, వాలంటీర్లుగా న్యాయపరమైన సలహాలు సూచనలు గురించి మహిళలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ విషయాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా బాగా పని చేసిన ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని కొందరికి ప్రశంస పత్రాలను జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు చేతుల మీదుగా అందజేశారు.

మంద్రాజుపల్లిలో పిచ్చి కుక్కల స్వైర విహారం

ఒకేరోజు ఇద్దరు వ్యక్తులు, ఓ గేదెపై దాడి

నవతెలంగాణ నేలకొండపల్లి



మండలంలోని మంద్రాజుపల్లి గ్రామంలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. బుధవారం గ్రామానికి చెందిన తుమ్మ కొండయ్య, సామల గౌతమీపై కుక్కల గుంపు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ప్రతిరోజు కుక్కల గుంపు గ్రామంలో వీధుల వెంట బిగ్గరగా అరుస్తూ పశువులపై కూడా దాడికి దిగాయి. దీంతో ఇంటిలో నుండి వీధుల్లోకి రావాలంటేనే ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. స్కూలుకు వెళ్లే పిల్లలు, చెట్ల కింద సేద తీరే వృద్ధులు కుక్కల స్వైర విహారంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రజలు కుక్క కాటుకు గురికాకుండా ఉండేందుకు గతంలో గ్రామ సర్పంచ్, పాలకవర్గం ఉంటే ప్రజలు తమ బాధలని చెప్పుకునే వారు. వారి పదవి కాలం ముగియడంతో ప్రభుత్వం పాలన అధికారాలను స్థానిక అధికారులకు అప్పగించింది. వారు తమ విధులు నిర్వర్తిస్తూ, గ్రామాలకు వచ్చి ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాలలో ప్రజలను కుక్కల బెడద నుండి కాపాడాలని ఏ ఒక్కరూ కుక్క కాటుకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కార్మికుడి అవతారం ఎత్తిన ఉపాధ్యాయుడు

నవతెలంగాణ-అశ్వారావుపేట



పాఠశాలల్లో స్కావెంజర్లు, కనీసం ఊడ్చే వాళ్ళు సైతం లేకపోవడంతో పారిశుధ్యం ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ఉపాధ్యాయులే పారిశుధ్యం కార్మికుల అవతారం ఎత్తుతున్నారు. మండలంలోని గుర్రాల చెరువు మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో శ్రీనివాస్ అనే ఉపాధ్యాయుడే స్వయంగా మంచినీటి ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న వైనం ఇది. ఉపాధ్యాయులకు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడమే కాదు ప్రస్తుతం పాఠశాల ప్రాంగణం శుభ్రం గా ఉంచడంతో పాటు ఆ పాఠశాలలోని మరుగుదొడ్లు, వాటర్ ట్యాంక్ శుభ్రం చేయడం వారి విధుల్లో చేరాయి. ఉపాధ్యాయుడు బుధవారం స్కూల్ లోని వాటర్ ట్యాంకు శుభ్రంగా లేకపోవడంతో పంచాయతీ సిబ్బందికి తెలిపాడు. వారు వాటర్ ట్యాంకులో దిగి మేము శుభ్రం చేయలేమని చెప్పటంతో స్కూల్ పిల్లలతో ఆ పని చేయించడం భావ్యం కాదని స్వయంగా తానే శుభ్రం చేసారు. పాఠశాలను శుభ్రం చేసే స్కావెంజర్‌లను (పాఠశాలను శుభ్రం చేసే వ్యక్తి) గత ప్రభుత్వం తీసివేయడంతో పాఠశాల శుభ్రం చేయడం చాలా కష్టంగా ఉపాధ్యాయులు వాపోయారు. ప్రభుత్వం దృష్టిసారించి తిరిగి స్కావెంజర్ లను నియమించాలని కోరారు.

మొరంపాడి పుల్లారావు మృతి సీపీఐ(ఎం)కి తీరంలోటు

- పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య
- నివాళులు ప్రకటించిన జిల్లా కమిటీ

నవతెలంగాణ -కొత్తగూడెం
నిజాయితీకి నిలవటంగా మార్కిస్టు పార్టీ క్రమశిక్షణ కార్యకర్తగా, నాయకుడిగా, ఉద్యమకారుడిగా, కొనసాగుతున్నటువంటి మోరంపూడి పుల్లారావు (70) బుధవారం అనారోగ్యంతో మరణించడం పార్టీకి తీరంలోటని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి. అన్నవరపు కనకయ్య అన్నారు. కామ్రేడ్ అమరజీవి మోరంపుడి పుల్లారావు యువజన ఉద్యమంలో 1990 దశకంలో కీలక పాత్ర పోషిస్తూ యువజన సంఘం డివిజన్ కార్యదర్శిగా అంచలంచలుగా ఎదిగి పార్టీ సత్తుపల్లి డివిజన్ కార్యదర్శిగా పనిచేశారని అన్నారు. నిరంతరం ప్రజల మధ్యనే పార్టీ అభివృద్ధి కోసం ప్రజా సంఘాల నిర్మాణాన్ని చేపడుతూ ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడిగా అనంతరం పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొదటి మహాసభలో జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నికై అనేక ఉద్యమాలు నిర్మించారు. యువజన ఉద్యమంలో, పార్టీ పోరాటాల్లో కీలక పాత్ర పోషిస్తూ అనేక ప్రభుత్వ నిర్బంధాలను ఎదుర్కొంటూ సాగుభూమి పోరాటాలు నిర్వహించిన చరిత్ర మొరంపాడి పుల్లారావుకే దక్కిందని అన్నారు. అశ్వరావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాలలో ప్రజాసంఘాల నిర్మాణం ఏర్పాటులో మంచి కృషి చేశారు. మోరంపూడి పుల్లారావు నిర్మించిన కీలకమైన పోరాటాలు ఆనాడు ఉన్న భూస్వాములకు



వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాల సమయంలో జలగం ప్రసాదరావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పార్టీపై నిర్బంధాలు ఉన్న కాలంలో అనేక సమస్యలను ఎదుర్కొంటూ, నిర్బంధాలు సైతం ఎదుర్కొంటూ పార్టీ అభివృద్ధి కోసం కృషిచేసిన మహోన్నత వ్యక్తి గా కమ్యూనిస్ట్ ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన నేత పుల్లారావు. అంతిమయాత్రలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రముఖులు పార్టీ శ్రేణులు అభ్యుదయవాదులు అన్ని రంగాల ప్రజలు పాల్గొని అంతిమ యాత్రలో పాల్గొనవలసిందిగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య కోరారు.

భవన నిర్మాణ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

నవతెలంగాణ-ఇల్లందు
తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ మండలి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఏలూరి భవన్‌లో సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్మిక శాఖ మంజూరు చేసిన గుర్తింపు కార్డుల ఆధారంగా భవన నిర్మాణ కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరీక్షల క్యాంపు కోఆర్డినేటర్ జి.మహేష్ మాట్లాడుతూ థైరాయిడ్, హెచ్ఐవి, ఊపిరితిత్తులు, గుండె కంటి, చెవి, రక్తపోటు, చక్కర వ్యాధి, రక్త మూత్ర పరీక్షలు తదితర 130 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. దీని మూలంగా వ్యాధిని ముందుగానే కనిపెట్టవచ్చని, అధునాతన వైద్య చికిత్సల కోసం సులభంగా ఆసుపత్రిలో చేరవచ్చు అని ముందస్తు ఆరోగ్యపరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పావని, నవీన, దుర్గ లక్ష్మీ, గౌతమి, బేబీ, సరిత, భవన నిర్మాణ కార్మిక రంగ సంఘం జిల్లా నేత కామ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి
లక్ష్మీదేవిపల్లి మండలంలో లోతు వాగు గ్రామపంచాయతీ నందు రోడ్డు పనులకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు చౌదరి, మండల అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సై, ఐసిడిఎస్ అధికారులు, ఎంపీపీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచ్లు. తదితరులు పాల్గొన్నారు.

ఆరో బెటాలియన్‌ను సందర్శించిన ఎమ్మెల్యే కూనమినేని సాంబశివరావు
ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు చాతకొండ గ్రామాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా, 6వ బెటాలియన్‌కు వచ్చి అక్కడ పరిస్థితులను క్షుణ్ణంగా పరీక్షించి, బెటాలియన్ అదనపు కమాండెంట్ ఏ.అంజయ్య రోడ్డు నిర్మాణం గురించి ఎమ్మెల్యేకి విన్నవించారు. దానికి ఎమ్మెల్యే సానుకూలంగాస్పందించారు. ఈ కార్యక్రమానికి బెటాలియన్ అసిస్టెంట్ కమాం డెంట్లు డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే
కొత్తగూడెం పట్టణం, లక్ష్మీదేవి పల్లి మండలానికి సంబంధించిన కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను లబ్దిదారులకు కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అందించారు.

తాట తీయడం మాకు తెలుసు

- కాంగ్రెస్ నాయకులు అవాకులు చవాకులు మానుకోవాలి
- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అన్నె సత్యనారాయణమూర్తి

నవతెలంగాణ -దుమ్ముగూడెం
భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యను అనకూడని మాటలు అన్నట్లుగా వక్రీకరిస్తూ కాంగ్రెస్ నాయకులు అవాకులు చవాకులు పేలడంతో పాటు దిష్టిబొమ్మలను దహనం చేసే ఆంధ్ర సంస్కృతిని తెలంగాణకు తీసుకువస్తున్నారని, దిష్టిబొమ్మలు దహనం చేయడం, తాట తీయడం మాకు చేతనవుతుందని, కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అన్నె సత్యనారాయణ మూర్తి హెచ్చరించారు. బుధవారం లక్ష్మీ నగరం బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయంలో ఎంపీపీ రేసు లక్ష్మి



జెడ్పీటీసీ తెల్లం సీతమ్మలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భద్రాచలం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారని అన్నారు. గతంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన పొదెం వీరయ్య నియోజకవర్గం అభివృద్ధిని పట్టించుకోకపోవడం నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోని అగ్రగామిగా నిలిపిన ఘనత కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. నిజాయితీపరుడు అని చెప్పుకుంటున్న పొదెం వీరయ్య దళిత బంధు లబ్దిదారుల వద్ద డబ్బులు వసూలు చేసి ఎన్నికల సమయంలో తిరిగి లబ్దిదారులకు చెల్లించిన సంగతి నియోజకవర్గ ప్రజలకు తెలుసు అని ఆయన అన్నారు. సీతమ్మ సాగర్ బహుళార్ధక సాధక ప్రాజెక్టు పనులు ఎందుకు ఆగిపోయాయో కాంగ్రెస్ నాయకులు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రిని, రాష్ట్ర మంత్రులను కలిస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రధాని మోడీని పెద్దన్న అన్న మాటలు ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కనితి రాముడు, మండల అధికార ప్రతినిధి ఎండి జానీ పాషా, ఎంపిటిసి మడకం రామారావు, సోషల్ మీడియా మండల అధ్యక్షులు దామెర్ల శ్రీనివాస్, నాయకులు జుంజూరి జయసింహ, కొమ్ము రంజిత్ కుమార్ తదితరులు ఉన్నారు.

400 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

- ప్రజా పంపిణీ బియ్యంతో దందా చేస్తే క్రిమినల్ కేసులు : ఏసీపీ

నవతెలంగాణ బోనకల్
బోనకల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రావినూతల ఆర్ఓబి బ్రిడ్జి ముందు అక్రమంగా రవాణా చేస్తున్న 400 బస్తాల రేషన్ బియ్యాన్ని బోనకల్లు ఎస్సై కడగండ్ల మధుబాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బుధవారం పట్టుకున్నారు. వైరా ఏసిపి మహమ్మద్ రహమాన్ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు బోనకల్లు పోలీసులు ఆర్ఓబి బ్రిడ్జి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట



నుంచి రాజమండ్రికి వెళ్తున్న లారీని తనిఖీ చేశారు. ఏపీ16 టీవై 6599 నెంబర్ గల లారీలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 400 బస్తాలు, (20 టన్నుల రేషన్ బియ్యం) రేషన్ బియ్యాన్ని ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు జగ్గయ్యపేట కు చెందిన యజమాని షేక్ ఇనౌతుల్లా, ఆర్గనైజర్ ఖమ్మంకు చెందిన ఆత్మకూరు జగదీష్, జగ్గయ్యపేటకు చెందిన లారీ డ్రైవర్ షేక్ మస్తాన్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలనే పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు పోలీసులు అధికారులు అక్రమ వ్యాపారులపై ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. అక్రమ వ్యాపారం చేస్తున్న నిర్వాహకులపై కేసు నమోదు చేయడంతో పాటు తరచూ నేరం చేస్తూ పట్టుబడితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. రేషన్ బియ్యాన్ని పట్టుకున్న ఎస్సై, సిబ్బందిని ఏసీపి అభినందించారు.

అంగన్‌వాడీ సహాయకురాలి మృతి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్
మండల పరిధిలోని గోళ్లపాడు గ్రామానికి చెందిన అంగన్వాడీ సహాయకురాలు సైదమ్మ అలియాస్ శైలజ(36) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృదేహాన్ని బుధవారం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు, అంగన్వాడీ టీచర్లు, సహాయకులు సందర్శించి నివాళులర్పించారు. అంగన్వాడీ టీచర్లు, సహాయకులు, సూపర్‌వైజర్లు, సీడీపీఓ అందరూ కలిసి మృతురాలి కుటుంబానికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం తరుపున రూ.10 వేల చెక్కును మృతురాలి కుటుంబానికి అందజేశారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

నవతెలంగాణ-ఖమ్మంరూరల్
మండల పరిధిలో మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సర విద్యార్థులు బుధవారం క్షేత్ర పర్యటనకు వెళ్లారు. మండలంలోని ముత్తగూడెంలో వర్మీకంపోస్టు కేంద్రం,సేంద్రీయ వరిసాగును పరిశీలించారు. వర్మీకంపోస్టు ఎరువు తయారీ, సేంద్రీయ సాగు పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఖమ్మంలోని విజయడైరీని సందర్శించారు. డెయిరీ నిర్వహణను పరిశీలించారు. అధ్యాపకులు సరళ, కల్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు మానసికంగా ధృడంగా ఉండాలి

చైల్డ్ లైన్ కో-ఆర్డినేటర్ సంధ్య

నవతెలంగాణ-ఖమ్మంరూరల్
కౌమారదశలో శారీరకంగా వచ్చే మార్పుల వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందని, ఇటువంటి పరిస్థితుల్లోనే మానసికంగా ధృడంగా ఉండాలని చైల్డ్ లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ సంధ్య అన్నారు. మండల పరిధిలోని గొల్లగూడెంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సంధ్య మాట్లాడారు. బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. బాలికలు, మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి వివరించారు. బాలికలు, మహిళలు డయల్ 100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ 1098ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, చైల్డ్ లైన్ కౌన్సిలర్ నిరోషా, ఉపాధ్యాయులు శ్యామ్, ఆసిఫ్మియా, నాగమణి, వీరన్న సింగ్య, సుజాత, లక్ష్మీ, అనూష, సరస్వతి పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కృష్ణకు మాతృవియోగం

నవతెలంగాణ-ఖమ్మం
సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మండల కమిటీ మాజీ సభ్యులు బిఎం కృష్ణ మాతృమూర్తి మునుస్వామి కాళీయమ్మ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. 43వ డివిజన్ తమిళ్ సెంటర్‌లోని వారి నివాసంలో మృతదేహాన్ని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వై.విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.ప్రకాష్, యుటిఎఫ్ జిల్లా నాయకులు బుర్రి వెంకన్న, సిపిఎం టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు సిహెచ్ భద్రం, ఏఎం రెడ్డి, శెట్టి రవీందర్, బోడపట్ల రాజేందర్, ఎస్కే షఫీ, చిన్న హుస్సేన్‌లు సందర్శించి నివాళులర్పించారు.

రూరల్ ఎస్‌హెచ్‌ఓగా శిక్షణ ఐపీఎస్ అధికారి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్
ఖమ్మంరూరల్ ఎస్‌హెచ్‌ఓగా శిక్షణ ఐపీఎస్ అధికారి మౌనిక బుధవారం బాధ్యతలు చేపట్టారు. శిక్షణలో భాగంగా ఎస్‌హెచ్‌ఓగా మూడు నెలల పాటు విధులు నిర్వహించనున్నారు. ఎస్ఐ విధులు, కేసుల నమోదు తదితర విషయాలపై మూడు నెలల పాటు శిక్షణ తీసుకుంటారు.

ఎండీఆర్‌టీ అర్హత సాధించిన ఏజెంట్ సురేందర్‌రెడ్డి

సన్మానించిన ఎల్ఐసీ అధికారులు

నవతెలంగాణ-కారేపల్లి
ఇన్సూరెన్స్ రంగంలో ప్రతిష్టాత్మకమైన ఎండిఅర్‌టి ఏజెంట్‌గా ఐదోసారి కారేపల్లికి చెందిన సీనియర్ ఎల్ఐసి ఏజెంట్ ఇందుర్తి సురేందర్‌రెడ్డి అర్హత సాధించారు. ఎల్ఐసీ పాలసీల అమ్మకాలలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన సురేందర్‌రెడ్డి మండలంలోని అనేక గ్రామాలను భీమా గ్రామాలకు చేసి ఆ గ్రామాల అభివృద్ధికి నిధులను సంస్థ నుండి రప్పించారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని ఇన్సూరెన్స్ కంపెనీల ఏజెంట్లతో జరిగే మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్ (ఎం.డి.అర్.టి) సమావేశానికి లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వరంగల్ డివిజన్ నుండి ఇందుర్తి సురేంధర్‌రెడ్డి అర్హత సాధించారు. ఎండీఆర్‌డీ సమావేశానికి అర్హత సాధించిన ఏజెంట్లతో బుధవారం వరంగల్‌లో ఆ సంస్థ అధికారులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో సురేందర్‌రెడ్డిని ఎల్ఐసి సంస్థ వరంగల్ డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ ఎం.సుబ్రహ్మణ్యన్ సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ బస్వరాజు ప్రసాద్, మేనేజర్ సేల్స్ చిరంజీవి, ప్రోడక్ట్ మేనేజర్ సి.హెచ్.ఎన్.ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వాణి వివేకానంద విద్యాలయంలో ఇంగ్లీష్ ఫెయిర్ ప్రోగ్రాం

నవతెలంగాణ-వైరా
వాణి వివేకానంద విద్యాలయంలో ఇంగ్లీష్ ఫెయిర్ ప్రోగ్రాం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈవెంట్లో భాగంగా స్కూల్ విద్యార్థులు రైల్వే ప్లాట్ఫామ్ అండ్ ట్రైన్ సెటప్‌ను అద్భుతంగా తయారు చేశారు. ఇంగ్లీష్ ట్రెని టీచర్స్ అండ్ స్కూల్ ఇంగ్లీష్ టీచర్ గైడెన్స్‌లో స్కూల్ విద్యార్థులంతా రకరకాల ఆక్టివిటీస్ నిర్వహించి పాఠశాల ఉపాధ్యాయులను తల్లిదండ్రులను మెప్పించారు. స్కూల్ రూమ్స్ అన్ని ఒకటి నుండి 18 రూమ్స్‌లో ఒక్కొక్క రూమ్‌లో ఒక్కొక్క యాక్టివిటీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చుండూరి కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ వాణి, స్పోకెన్ టీచర్స్ దాసు, లక్ష్మీచంద్ర, భావన, మనోజ్, సాయికుమార్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఏర్పాట్లు

నవతెలంగాణ- వేంసూరు
తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సత్తుపల్లి డివిజన్ ఆధ్వర్యంలో వేంసూర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మహిళలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గురువారం సన్మానించనున్నట్లు వేంసూరు మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు జి.చంద్రశేఖర్ ఈశ్వరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి బాధ్యులతో పాటు ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు.

అంబరాన్నింటిన త్రివేణి సంబరాలు

నవతెలంగాణ- ఖమ్మం



ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో ఫన్‌ఫెస్ట్ పేరుతో జరిగిన పాఠశాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు .ఈ ఉత్సవాల్లో విద్యార్థినీ విద్యార్థులు జానపద నృత్యాలు వన్ యాక్ట్ ప్లేలు సాంప్రదాయ నృత్యాలు స్కిట్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ చిన్న పిల్లల్లో మానసిక ఎదుగుదల, శారీరక ఎదుగుదల రెండిటిని సమన్వయం చేసుకుంటూ ఉంటేనే వారిలో వికాసం బావుంటుందన్నారు. ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ కావ్య చందు మాట్లాడుతూ పసిపిల్లల ఎదుగుదలలో పోషకాహారం పాత్ర ఎంతో ముఖ్యమైనదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్, పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు

వైరా మునిసిపాలిటీ నూతన బడ్జెట్ ఆమోదం

నవతెలంగాణ-వైరా
వైరా మునిసిపాలిటీ బడ్జెట్ ప్రత్యేక సమావేశం చైర్మన్ సూతకాని జైపాల్ అధ్యక్షతన బుధవారం జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 705.42 లక్షల ఆదాయం వస్తుందని, 697.94 లక్షలు వ్యయం అవుతుందని అంచనా వేస్తూ 7.48 లక్షల మిగులు బడ్జెట్‌ను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించినట్లు మునిసిపల్ కమిషనర్ సిహెచ్ వేణు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు కౌన్సిలర్స్, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. గత సంవత్సరం కూడా ఇదే బడ్జెట్‌ను ఆమోదించింది. కాని ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్నులను ఊహించని రీతిలో పెంచి డిమాండ్ నోటీసులు ఇస్తున్న మునిసిపాలిటీ గత సంవత్సరం బడ్జెట్‌నే ఆమోదించడం ఏంటనే ప్రశ్న వస్తుంది. ఈ బడ్జెట్ సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్ బిఆర్ఎస్ కౌన్సిలర్ ముళ్ళపాటి సీతారాములు ఇప్పటికే పెంచిన ఇంటి పన్నులు, నీటి పన్నులను తగ్గించాలని డిమాండ్ చేశారు. భారీగా పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) గతనెల 29న మునిసిపల్ కార్యాలయాన్ని స్తంభింపజేసీ ధర్నా నిర్వహించింది. తొలిసారి జిల్లా కలెక్టర్‌గాని, అదనపు కలెక్టర్‌గాని, స్థానిక శాసన సభ్యులు గాని లేకుండా కేవలం పాలకవర్గమే నిర్వహించడం కూడా ఆశ్చర్యం కలిగిస్తుందని కూడా ప్రతిపక్ష సభ్యులు ఆరోపిస్తున్నారు.

హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	65,130	▲	280
22 క్యారెట్లు	59,700	▲	250
కిలో వెండి	78,000	▼	200

చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	116
రిటైల్ (లైవ్)	రూ.	138
స్కిన్‌తో	రూ.	200
స్కిన్‌లెస్	రూ.	228

'బీజేపీని ఓడించడమే లక్ష్యం'

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఠాగూర్
- పార్టీ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ఖమ్మం

సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్ అన్నారు. బుధవారం ఖమ్మంలోని రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ (ఎంఎల్), సీపీఐ (ఎంఎల్) ఆర్ఐ.. విప్లవ పార్టీలు రాజకీయ సైద్దాంతిక చర్చల తరువాత సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పేరుతో ఒకే వేదిక మీదకు వచ్చాయని తెలిపారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ మహాసభ ఖమ్మంలో మూడు రోజులు (3, 4, 5 తేదీల్లో) జరిగాయన్నారు. అఖిల భారత శ్రామికవర్గ కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుకు కృషి చేస్తామని, ఐక్యంగా పోరాడాలని తీర్మానించినట్టు చెప్పారు. తక్షణ కర్తవ్యంగా అన్ని ఫాసిస్టు వ్యతిరేక శక్తులతో ఏకమై 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఫాసిస్ట్ బీజేపీ-ఆర్ఎస్ఎస్‌ను ఓడించాలని స్పష్టంచేశారు. మహాసభలో ప్రతినిధులు కూలంకుషంగా చర్చించిన తర్వాత కొత్త ప్రజాస్వామ్య విప్లవం, పార్టీ రాజ్యాంగం, రాజకీయ తీర్మానం అనే మూడు పత్రాలను సమావేశం ఆమోదించిందని తెలిపారు.

జియోనిస్ట్ ఇజ్రాయెల్ రాజ్యం ద్వారా జరిగిన మారణహోమం దురాక్రమణకు వ్యతిరేకంగా పాలస్తీనా ప్రజలతో కలిసి నిలబడాలని తీర్మానం చేసినట్టు చెప్పారు. మణిపూర్‌లో మెయిటీకి వ్యతిరేకంగా బీజేపీ-ఆర్ఎస్ఎస్ హింసను ఈ సందర్భంగా ఖండించారు. జీఎన్ సాయిబాబా, ఇతరులపై కేసులను ముంబై కోర్టు కొట్టివేసిందని, అతన్ని చాలా ఏండ్లుగా నిర్బంధించినందుకు భారత ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారతీయ సమాజంలోని శ్రామిక, కర్షకులు, అణగారిన వర్గాల ప్రజలందరి పోరాటాలకు అండగా నిలవాలని నిర్ణయించినట్టు తెలిపారు. యూఏపీఏ, ఏఎఫ్ఎస్పీఏ వంటి అన్ని క్రూరమైన చట్టాలను వ్యతిరేకించాలని కోరారు. కొత్త పార్టీ అయిన సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్.. కేరళ, తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, అస్సాం, త్రిపుర, పశ్చిమ బెంగాల్, ఒడిశాలో కార్యవర్గాలను కలిగి ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

9 మంది సభ్యుల పొలిట్ బ్యూరో, 21 మందితో సెంట్రల్ కమిటీ, ముగ్గురు సభ్యులతో కంట్రోల్ కమీషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్ సింగ్ ఠాకూర్ (పశ్చిమ బెంగాల్), సంయుక్త కార్యదర్శులుగా సుభాష్ దేబ్ (త్రిపుర), పోటు రంగారావు (తెలంగాణ), కంట్రోల్ కమిషన్ చైర్మెన్‌గా రాయల చంద్రశేఖర్ ఎన్నికయ్యారని వెల్లడించారు. విలేకరుల సమావేశంలో జాతీయ నాయకులు పోటు రంగారావు, సుభాష్ దేవ్, కేజీ రాంచందర్, కె.రమ, అలెక్ చక్రవర్తి, దేవబ్రత శర్మ, దినేష్ గోహైన్, సంజయ్ సింగ్వి, కెచ్చేలా రంగయ్య, గోకినేపల్లి వెంకటేశ్వరావు, కంట్రోల్ కమిషన్ చైర్మెన్ రాయల చంద్రశేఖర్ ఉన్నారు.

ఏం చూసి మీకు ఓటెయ్యాలి?

కాంగ్రెస్ రాగానే కరువొచ్చింది

- వరికి బోనస్ ఏమైంది? :సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్ రావు సూటి ప్రశ్న



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ ప్రభుత్వాన్ని, నిర్ణయాలను చూసి ఓటేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు ముఖ్యమంత్రిపై సెటైర్లు వేశారు. కాంగ్రెస్‌కు ఏం చూసి ఓటేయాలంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్ మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో కరువొచ్చిందని వాపోయారు. ఇటీవల ప్రధాని మోడీ రాష్ట్రంలో పర్యటించిన సందర్భంగా సీఎం రేవంత్ ఆయన్ను పొగడ్తలతో ముంచెత్తారని విమర్శించారు. మళ్లీ మోడీనే అధికారంలోకి వస్తారంటూ చెప్పడం ద్వారా కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి రాబోదంటూ రేవంత్ చెప్పకనే చెప్పారని ఎద్దేవా చేశారు. గత మూడు నెలల పాలనలో ఆయన ఇటు ప్రజలను, అటు కాంగ్రెస్ పార్టీని మోసం చేశారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు ఎందుకు ఓటేయాలంటూ ప్రశ్నించారు. ఇప్పటి వరకు రైతులకు రుణమాఫీ చేయలేదనీ, మొన్నటి బడ్జెట్ లో అందు కోసం నిధులు కూడా కేటాయించలేదని విమర్శించారు. వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఏమైందని నిలదీశారు. ఆసరా పెన్షన్లు రూ.4 వేలకు పెంచుతామన్న హామీ ఏమైందని అడిగారు. తమ ప్రభుత్వం ఇచ్చిన రూ.2 వేల పెన్షన్ కూడా నెల నెలా అందటం లేదని వాపోయారు. ఆరు గ్యారంటీల్లో మొత్తం 13 హామీలున్నాయనీ, అవన్నీ ఎప్పుడు అమలు చేస్తారంటూ ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్‌ను చేస్తామంటూ చెప్పిన సీఎం ఇప్పుడు ప్రజల రక్తం పిండి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల ఆర్థిక సాయం చేస్తామన్న హామీ అటకెక్కిందని విమర్శించారు. ఆటోవాలాలకు రూ.12 వేలు ఇస్తామంటూ ప్రకటించిన సీఎం ఇప్పుడు ఆ విషయాన్నే మరిచిపోయారని విమర్శించారు. దాదాపు 70 వేల మందికి సీఎంఆర్ఎఫ్ అందటం లేదనీ, సంబంధిత దరఖాస్తులన్నీ పెండింగ్ లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీకి రావటం లేదంటూ పదే పదే మాజీ సీఎం కేసీఆర్ ను విమర్శిస్తున్న రేవంత్‌కు ఆయన ఆరోగ్యం బాగోలేదన్న సంగతి తెలియదా? అని హరీశ్ ప్రశ్నించారు. ఒక రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తిని పట్టుకుని ఇలాగేనా మాట్లాడేది? అని వాపోయారు.

ప్రభుత్వం జోలికొస్తే ప్రజలు ఊరుకోరు

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా ప్రజలకు బొంద పెట్టేది కూడా తెలుసని హెచ్చరించారు. మాదిగలకు రిజర్వేషన్ విషయంలో మోసం చేసిన మోడీ ప్రభుత్వాన్ని అనేకసార్లు మెచ్చుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో బీఎస్పీ అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జతకట్టడం హాస్యాస్పదమన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు పార్లమెంట్ నియోజకవర్గాలు, ఎమ్మెల్సీ సీటును గెలిపించి పాలమూరు సత్తాను రాష్ట్ర ప్రజలకు చెప్పాలని పిలుపునిచ్చారు. ఐదారు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని జోస్యం చెబుతున్న బీఆర్ఎస్ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చడానికి ఎవరైనా ప్రయత్నిస్తే అగ్ని కనికలౌతారని హెచ్చరించారు. 'కేసీఆర్ పదేండ్లు, మోడీ పదేండ్లు ప్రధానిగా ఉండొచ్చు.. కానీ ఇందిరమ్మ ప్రభుత్వాన్ని పడగొడతారట.. మేధావులు, విజ్ఞులైన వారు ఆలోచన చేయాలి.. ఇటువంటి దుర్భర రాజకీయాలను పాతరేయాలి' అని అన్నారు. హరీశ్‌రావు, కేటీఆర్‌ను చూస్తుంటే బీఆర్ఎస్ బిల్లా, రంగా సమితిలా కనిపిస్తోందన్నారు. అనేక త్యాగాలతో కూడిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో మరో 10 ఏండ్లు అధికారంలో ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో యువత, మహిళలు, విద్యార్థుల తిరుగుబాటు వల్లే రాష్ట్రం ఏర్పాటయింది తప్ప కేసీఆర్ కుటుంబ గొప్పతనం ఏమీలేదన్నారు. భారత ప్రధాని మన రాష్ట్రానికి వస్తే విజ్ఞతతో వినతిపత్రం ఇస్తే.. బీజేపీలో రేవంత్ రెడ్డి చేరిపోతాడు అంటూ విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. రాత్రిపూట రహస్యంగా చెవిలో గుసగుస చెప్పే వ్యక్తిని కాదని, నికార్సైన నల్లమల నుంచి వచ్చిన నిజమైన రాజకీయ వారసత్వాన్ని కలిగిన వ్యక్తినని చెప్పారు. 90 రోజుల్లోనే ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేసే ప్రయత్నం చేశామ న్నారు. పాలమూరుతో పాటు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న పెండింగ్ ప్రాజెక్టులకు ప్రాధాన్యతాక్రమంగా నిధులు ఇచ్చి పనులు పూర్తిచేసి తమ చిత్తశుద్ధిని చాటుకుంటామని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి, సాగునీరు తదితర పనులను పూర్తి చేయడానికి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఏపీ మంత్రి రోజా వండిపెట్టిన చేపల పులుసు తిని తెలంగాణ నీటి వాటాను ఆంధ్రకు వదులుకున్న ద్రోహి కేసీఆర్ అని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేదంటూ మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులకు అభివృద్ధి పనులపై రెఫరండం పెడదామా అని సవాల్ విసిరారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుడతామని చెప్పారు. ఉద్యోగస్తులకు ఏనాడూ నెల మొదటి రోజు వేతనాలు రాలేదని, ఇప్పుడు ఎన్ని ఇబ్బందులున్నా మొదటి రోజునే వేతనాలు వేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకున్నామన్నారు. నక్క వినయాలతో ప్రజలను మోసం చేయడానికి మరోసారి ఎన్నికల పేరుతో గ్రామాలకు వస్తున్నారని, 10 ఏండ్ల వారి పరిపాలన గుర్తుచేసుకొని ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సభలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు ఎస్ఎం.శ్రీనివాస్ రెడ్డి, వాకిట శ్రీహరి, వర్ణికా రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, తుడి మెగారెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేష్ రెడ్డి,వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీలు దామోదర్ రెడ్డి, బల్మూర్ వెంకట్, నాయకులు అనిల్ యాదవ్, మల్లు రవి, సంపత్ కుమార్, గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరిత తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం స్కీం ఉద్యోగులకు వేతన బకాయిలు చెల్లించాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి కూనంనేని లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మూడు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన బుధవారం లేఖ రాశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ స్కీంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 17 వేల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వారు నిరంతరం ప్రజల మధ్యలో ఉండి జిల్లా స్థాయి, పీహెచ్‌సీ, సబ్ సెంటర్ స్థాయి దాకా గ్రామాల్లో ప్రజల మధ్య ఉండి వారి ఆరోగ్యం కోసం నిత్యం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సేవలను అందిస్తున్నారని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీన అందాల్సిన జీతాలు గత మూడు నెలలుగా వారికి అందకపోవటంతో పేద, మధ్యతరగతి ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

పాలమూరు శాసనమండలి బరిలో బీఆర్ఎస్

- మాజీ మంత్రి సింగిరెడ్డి వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి శాసనమండలి స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వెల్లడించారు. ఒకట్రెండు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేస్తామన్నారు. ఈ ఎన్నికలో ఖచ్చితంగా బీఆర్ఎస్ గెలుస్తుందని ఆయన ఒక ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపు కోసం నాయకులందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మా దీక్షకు అనుమతివ్వండి

- డీజీపీకి ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీవో నెంబర్ 3కు సంబంధించి భారత జాగృతి ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించ తలపెట్టిన దీక్షకు అనుమతివ్వాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాష్ట్ర డీజీపీ రవిగుప్తాకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనతో ఫోన్‌లో మాట్లాడిన కవిత జీవో 3 వల్ల మహిళలకు తీవ్ర అన్యాయం జరగనుందని తెలిపారు. హైదరాబాద్ లోని ఇందిరాపార్కు వద్ద శాంతియుతంగానే తాము దీక్షను నిర్వహిస్తామనీ, అందువల్ల అనుమతినివ్వాలని కోరారు.

కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడింది

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కే.పీ.వివేకానంద

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కే.పీ.వివేకానంద విమర్శించారు. ఇందుకు సంబంధించి బుధవారం తమ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలు విజయవంతమయ్యాయని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివేకానంద మాట్లాడుతూ ఎల్ ఆర్ఎస్ కు ఫీజులు వసూలు చేయకుండా ఉచితంగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్ ను తీసుకొస్తున్న ప్రభుత్వం మ్యారేజ్ రెగ్యులరైజేషన్ స్కీంను కూడా తీసుకొస్తుందా అని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ తన పదవిని కాపాడుకునేందుకు ప్రధాని మోడీని పొగుడుతున్నారంటూ విమర్శించారు.

ఉపాధ్యాయులకు ఇంటర్ పరీక్షల విధులు వేయొద్దు

ప్రభుత్వ బడులు మూతపడేలా వ్యవహరిస్తున్న కమిషనర్

పాఠశాలలను బాగుచేసే డైరెక్టర్‌ను నియమించాలి :సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల నిర్వహణ కోసం ప్రభుత్వ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు విధులను వేయొద్దని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనకు ఆయన బుధవారం లేఖ రాశారు. ఈ ఏడాది దాదాపు పదివేల మంది ప్రభుత్వ ఉపాధ్యా యులకు ఇంటర్ పరీక్షల విధులను వేశారని తెలిపారు. ఆయా పాఠశాలల్లో విద్యాసంవత్సరం చివరిలో చదువు అంతంత మాత్రంగానే కొనసాగుతుందని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవ త్సరంలో ఈ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఇంకా తగ్గిపోతుం దని వివరించారు. ఈ క్రమం ఇలాగే కొనసాగితే రాబోయే నాలు గేండ్ల తర్వాత ప్రభుత్వ బడులు నామమాత్రంగానే మిగులుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పుడు ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం ఉపాధ్యాయులకు విధులు వేస్తారా?, ఆ విధులను ఎవరు చేస్తారు?అని ప్రశ్నించారు. ఇంటర్ విద్యార్థులకు బోధించే ప్రభుత్వ, ప్రయివేటు అధ్యాపకులు చేస్తారని తెలిపారు. ఇప్పుడూ అదే పని చేయాలంటూ జనవరి, ఫిబ్రవరిలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు లేఖలు రాశానని గుర్తు చేశారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి లేఖ రాస్తే తగు చర్య తీసుకోవాలంటూ కమిషనర్‌కే ఆయన పంపిం చారని పేర్కొన్నారు. ఈ విషయంలో కీలకంగా వ్యవహరించాల్సిన కమిషనర్ మాత్రం చాలా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శిం చారు. ప్రాథమిక విద్యలో ప్రమాణాలు సరిగా లేవం టూ ఫండమెంటల్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని గతేడాది నుంచి నిర్వహిస్తున్నా రని తెలిపారు. విద్యాసంవత్సరం చివరలో మాత్రం యధాలాపంగా ఉపాధ్యాయులను ఇంటర్, పదో తరగతి పరీక్షల విధులకు, టెన్త్ మూల్యాంకనానికి అనుమతిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను క్రమంగా మూసేయాలనే లక్ష్యంతో వారు పనిచేస్తున్నట్టు కనిపిస్తున్నదని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రికి ఈ విషయంపై లేఖ రాశాననీ, ఎలాంటి చర్య కనిపించలేదని తెలిపారు. శాసన మండలిలో ప్రస్తావన చేయబోతే నాటి అధికారపక్షం సంఖ్యా బలంతో మూకదాడి చేసిందని పేర్కొన్నారు. గత ముఖ్యమంత్రి ప్రేరణతోనే కమిషనర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను నాశనం చేస్తున్నారని విమర్శించారు. మూతపడ్డ పాఠశాలలను తెరిపిస్తా మంటూ కొత్త ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. కానీ ప్రభుత్వ బడులను మూసే కమిషనర్‌నే బాధ్యతల్లో కొనసాగిస్తు న్నారని తెలిపారు. ఏ రోటి పాట ఆ రోటి కాడ పాడే అధికారులున్న నేటి రోజుల్లో ఏదైనా జరగొచ్చని పేర్కొన్నారు. ప్రస్తుత డైరెక్టరేట్‌ను ప్రభుత్వ పాఠశాలల మూతేసే డైరెక్టరేట్ అంటూ పేరు మార్చాలని కోరారు. లేదంటే ప్రభుత్వ పాఠశాలలను బాగుచేసే డైరెక్టర్‌ను నియమించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా అధ్యాపకులకు విధులను వేస్తే ఉపాధ్యా యులకు విధులు వేసే అవసరముండబోదని కమిషనర్‌కు వివరించానని తెలిపారు. అయినా ఉపాధ్యాయులకు ఇంటర్ పరీక్షల విధులకు అనుమతించారనీ, ప్రాథమిక పాఠశాలలు మూతపడాలనే లక్ష్యంతోనే ఆ కమిషనర్ పని చేస్తున్నట్టు స్పష్టమవుతున్నదని పేర్కొన్నారు. ప్రయివేటు బడుల్లో ఎలాంటి ఆటంకం లేకుండా బోధన జరుగు తున్నదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు ఇంటర్, పదో తరగతి పరీక్షలు ఓ గండంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల క్రమంగా విద్యార్థుల నమోదు తగ్గిపోతున్నదని పేర్కొన్నారు. ప్రస్తుతమున్న బడులను సరిగ్గా నిర్వహించేలా పాఠశాల విద్యాపాలన ఉండేలా సీఎం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

మేడారం జాతర ఆదాయం రూ.13 కోట్లు

నవతెలంగాణ- హన్మకొండ

తెలంగాణ గిరిజన జాతర మేడారం సమ్మక్క సారలమ్మ హుండీ ఆదాయం రూ.13 కోట్లకు పైగా చేరింది.

హన్మకొండ జిల్లా కేంద్రంలోని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) కళ్యాణ మండపంలో జరుగుతున్న జాతర హుండీల ఆదాయం బుధవారం ముగిసింది. ఈ లెక్కింపులో రూ.12,84,94,482 కరెన్సీ రాగా రూ.40,28,029 నగదు వచ్చాయి.

అలాగే బంగారం 779 గ్రాముల నుంచి 800 గ్రాముల వరకు, వెండి 55 గ్రాముల నుంచి 150 గ్రాముల వరకు వచ్చాయి. విదేశీ 308 డాలర్లు (ఆరు దేశాల నుంచి) నగదు వచ్చినట్టు ఈవో రాజేందర్ తెలిపారు.

నైపుణ్యాన్ని వెలికితీద్దాం

- స్టెమ్ ద్వారా గ్రామీణ తెలంగాణ విద్యార్థుల భవితకు ఎస్‌ఎక్స్ ప్లోరర్స్ కృషి



నవతెలంగాణ-ఖమ్మం

షెల్ ఇండియా మద్దతుతో, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో స్మైల్ ఫౌండేషన్ ఖమ్మంలో ఎస్ఎక్స్ ప్లోరర్స్ కార్నివాల్‌ను నిర్వహించింది. గ్రామీణ పాఠశాల పిల్లలకు స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్)లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి, జాతీయ స్థాయి విద్యావిధానం (ఎన్ఈపీ) 2020 కనుగుణంగా ఎస్డీజీలను (యునైటెడ్ నేషన్స్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్) అవగాహన చేసుకోవడానికి ఒక వేదికను అందించాలనే లక్ష్యంతో బుధవారం కార్నివాల్ నిర్వహించింది.

స్మైల్ ఫౌండేషన్ తెలంగాణలో వరంగల్, ఖమ్మం, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం వంటి ఎనిమిది జిల్లాల్లోని 116 ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మకమైన సోషల్ ఇన్వెస్ట్‌మెంట్ స్టెమ్ ఎడ్యుకేషనల్ కార్యక్రమమైన ఎస్ఎక్స్‌ప్లోరర్స్ జూనియర్ ప్రోగ్రాముల్ని నిర్వహిస్తోంది.

ఈ కార్నివాల్‌కు హాజరైన ప్రముఖుల్లో టి.అంజలి, రీజనల్ కో ఆర్డినేటింగ్ ఆఫీసర్ (ఆర్సీఓ), ఎంజేపీ స్కూల్స్, పూర్వపు ఖమ్మం జిల్లా చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ రాజ్ శేఖర్ , ఖమ్మం జిల్లా సైన్స్ ఆఫీసర్ డి. జగదేశ్వర్ ఉన్నారు. తెలంగాణలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన 17 పాఠశాలలకు చెందిన 101 మంది విద్యార్థులు ఈ కార్నివాల్ సందర్భంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) విభాగాల్లో ఎంపిక చేసిన 31 ప్రాజెక్టులు, వినూత్న నమూనాలను ప్రదర్శించారు. ఖమ్మం జిల్లా సైన్స్ అధికారి డి.జగదేశ్వర్ మాట్లాడుతూ.. ప్రతి సమస్యకు ప్రకృతి మాత పరిష్కారం చూపుతుంది. సమాజంలో స్థిరమైన పరిష్కారాలను రూపొందించడానికి విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి, విజ్ఞాన శాస్త్రాన్ని జీవన విధానంగా అంగీకరించాలి" అని అన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్‌కు షాక్

- హస్తం గూటికి కోనప్ప..!
- సీఎం రేవంత్‌తో భేటీ.. త్వరలో చేరిక

అదే బాటలో ఓ మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ
ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాజకీయ పరిణామాల్లో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇన్నాండ్లు బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్న నాయకులు తాజాగా పార్టీని వీడేందుకు సిద్ధం కావడం చర్చనీయాంశమవుతోంది. సిర్పూర్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప పార్టీని వీడేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. త్వరలోనే హస్తం కండువా కప్పుకొంటారని, ఇందుకు తేదీ ఖరారు చేస్తారని తెలిసింది.

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ మంగళవారం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కలవడం.. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేయాలని ఒక నిర్ణయానికి వచ్చిన విషయం తెలిసిందే. సిర్పూర్‌లో తన ఓటమికి కారణమైన ఆర్ఎస్పీతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భేటీ కావడం, పొత్తు పెట్టుకుంటామని చెప్పడం నచ్చకనే కోనప్ప పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఆయనతో పాటు పలువురు కీలక నాయకులు సైతం గులాబీ పార్టీని వీడేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. త్వరలోనే కాంగ్రెస్‌లో చేరే తేదీని ఖరారు చేస్తారని తెలిసింది.

మరోపక్క అదే బాటలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రితోపాటు మాజీ ఎమ్మెల్యే సైతం కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధమైనట్టు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిపోగా.. ఆదిలాబాద్ జడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్దన్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. లోక్‌సభ ఎన్నికల నాటికి ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్‌కు చెందిన మరికొందరు కీలక నాయకులు సైతం హస్తం గూటికి చేరేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. దీనిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏమి నిర్ణయం తీసుకుంటారనేది ఆ పార్టీ నేతల్లో చర్చ నడుస్తోంది.

పాడి రైతుల బిల్లులు చెల్లించండి

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, ఉపాధ్యక్షులు నంద్యాల నరసింహారెడ్డి డిమాండ్
విజయ డెయిరీ కార్యాలయం ముందు ధర్నా




నవతెలంగాణ-ఓయూ

పాడి రైతులకు విజయ డెయిరీ పెండింగ్ పెట్టిన బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని, లీటర్‌కు రూ.5 ఇన్సెంటివ్ ఇవ్వాలని, సబ్సిడీపై దాణా సరఫరా చేయాలని కోరారు. సబ్సిడీపై పశువులను సరఫరా చేయాలని, రైతులకు, పశువులకు బీమా సౌకర్యం కల్పించాలని, విద్యుత్ అధికారులు ఫైన్‌లు వేయడాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ బుధవారం తెలంగాణ రైతు సంఘం, విజయ డెయిరీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ లాలాపేటలోని విజయ డెయిరీ భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టి.సాగర్, నంద్యాల నరసింహారెడ్డి మాట్లాడుతూ.. పాడి రైతులకు ప్రతి 15 రోజులకోసారి పాల బిల్లులు చెల్లించాలని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టీపీ కమిటీలు వేయాలని డిమాండ్ చేశారు. ఈ మధ్యలో వివిధ జిల్లాల్లో విద్యుత్ అధికారులు డెయిరీ ఫామ్‌ల యజమానులపై జరిమానాలు వేస్తున్నారని, బావుల వద్ద పశువులను పెంచుకుంటే.. బావిలోని నీళ్ల పశువులు తాగినా ఫైన్ వేస్తామనడంపై ఆవేదన వ్యక్తం చేశారు. పాడిరైతులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని అధికారులకు, ప్రభుత్వానికి డెయిరీ ఎండీ లెటర్ రాయాలని కోరారు. లీటర్ పాలకు రూ.4 ఇన్సెంటివ్ మూడు సంవత్సరాల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కొత్త ప్రభుత్వం ఎన్నికల ముందు పాడి రైతులకు లీటర్‌కు రూ.5 ఇన్సెంటివ్ ఇస్తానని హామీనిచ్చిందని.. దాన్ని వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. పాడి పశువులకు ఇన్సూరెన్స్ పథకం ప్రవేశ పెట్టాలని, పాడిరైతులకు గడ్డి కటర్ మిషన్, పాలు పిండే మిషన్, దాణా 50 శాతం సబ్సిడీతో సరఫరా చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ పరిరక్షణ సమితి నాయకులు సాదం రమేష్, ఉప్పలయ్య, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు రావుల జంగయ్య, రాష్ట్ర నాయకులు టి.కిషోర్, రాష్ట్ర కో కన్వీనర్ విరమల్ల రాజయ్య సునీల్, కోటగిరి నాగేశ్వరరావు, పెంట రమేష్, రాజేష్, జిల్లాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో బిల్లులు చెల్లిస్తాం : డెయిరీ ఎండీ

పాడి రైతుల ఆందోళనతో విజయ డెయిరీ ఎండీ చిట్టెం లక్ష్మి వారితో చర్చలు జరిపారు. నాలుగు రోజుల్లో ఒక బిల్లు చెల్లిస్తామని, రెండు బిల్లులు 15 రోజుల్లో చెల్లిస్తామని ఎండీ హామీ ఇవ్వడంతో రైతులు నిరసన విరమించారు.

రాజకీయ చైతన్యాన్ని నింపేది విద్యనే





కృపస్కయా... సోవియట్ యూనియన్‌లో విద్యా వ్యాప్తికోసం ఎంతో కృషి చేసింది. కార్మికులకు అక్షరాలు నేర్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. విద్యనే వారిలో రాజకీయ చైతన్యం నింపే ఆయుధం అని విశ్వసించింది. అలాగే మహిళా హక్కుల కోసం అహర్నిశలూ తపించింది. గొప్ప విప్లవకారుడు లెనిన్‌కు భార్యగానే గాక అతని రచనలు ప్రపంచం ముందుకు వచ్చేందుకు నిరంతరం శ్రమించింది. కమ్యూనిస్టు పార్టీలో అనేక బాధ్యతలు నిర్వహించిన ఆ మహిళా నాయకురాలి పరిచయం రాబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నేటి మానవిలో...

కృపస్కయా సెయింట్ పీటర్స్ బర్గ్‌లో కులీన కుటుంబంలో జన్మించింది. ఆమెలో మొదటి నుండి పేదల జీవితాలను మెరుగుపరచాలనే బలమైన కోరిక ఉండేది. తర్వాత కాలంలో మార్క్సిజంలోకి అడుగుపెట్టింది. 1894లో మార్క్సిస్ట్ చర్చా బృందంలో లెనిన్‌ను కలుసుకుంది. విప్లవ కార్యకలాపాలు నిర్వహిస్తూ 1896లో ఇద్దరూ అరెస్టయ్యారు. లెనిన్ సైబీరియాకు బహిష్కరించబడిన తర్వాత కృపస్కయా 1898లో ఆయన్ని వివాహం చేసుకుంది. 1905 విప్లవంలో పాల్గొనడానికి రష్యాకు తిరిగి వచ్చే ముందు వారిద్దరూ కొంత కాలం మ్యూనిచ్, లండన్‌లో నివసించారు. 1917 విప్లవం తర్వాత కృపస్కయా రాజకీయాలో కీలకపాత్ర పోషించారు. 1924లో కమ్యూనిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. 1929 నుండి 1939 వరకు డిప్యూటీ ఎడ్యుకేషన్ కమీషనర్, సోవియట్ అభివృద్ధితో సహా సోవియట్ విద్యా వ్యవస్థపై బలమైన ప్రభావం చూపించారు. 1939లో ఆమె మాస్కోలో మరణించింది.

దుర్భర జీవితాలకు వ్యతిరేకంగా

కృపస్కయా పుట్టింది ఉన్నత కుటుంబంలోనే. కానీ ఆమె పుట్టేనాటికి వారి పరిస్థితి ఆర్థికంగా దిగజారిపోయి ఉంది. ఆమె తండ్రి కాన్‌స్టాంటిన్ ఇగ్నాటీవిచ్ క్రుప్‌స్కీ, రష్యన్ సైనిక అధికారి. మంచి పేరుతున్న వ్యక్తి. తర్వాత కాలంలో అతనికి విప్లవకారులతో పరిచయాలను ఉన్నాయనే అనుమానంతో ఎక్కడా మని దొరక్కుండా చేశారు. తల్లి యెలిజవేటా వాసిలీవ్నా టిస్ట్రోవా, భూమిలేని రష్యన్ ప్రభువుల కుమార్తె. ఆమె తన చిన్నతనంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకుంది. అప్పట్లో ఆమె రష్యాలో మహిళలకు అందుబాటులో ఉన్న అత్యున్నత అధికారిక విద్య బెస్టుజేవ్ కోర్సులలో చేరింది. డిగ్రీని సంపాదించిన తర్వాత వివాహం చేసుకునే వరకు ఉన్నత కుటుంబాలకు గవర్నెస్‌గా పనిచేసింది. బాగా చదువుకున్న, కులీన వంశానికి చెందిన తల్లిదండ్రుల ప్రభావం వల్లనో ఏమో కృపస్కయా అనేక రకాల సైద్ధాంతిక విషయాలపై అవగాహన పెంచుకుంది. చిన్నతనం నుండే తన చుట్టూ ఉన్న దుర్భర జీవితాలకు వ్యతిరేకంగా స్పందిస్తుండేది.

విద్యపై ఆసక్తితో...

తండ్రి మరణంతో కృపస్కాయా తన తల్లితో పాటు కుటుంబ పోషణ కోసం టీచర్‌గా పని చేసింది. చిన్నప్పటి నుండి ఆమెకు విద్యంటే ఆసక్తి. పాఠాలు చెబుతూ ప్రతి విద్యార్థి వ్యక్తిగత అభివృద్ధిపై దృష్టి సారించేది. ఆమె మొదటి నుండి టాల్‌స్టాయ్ రచనలను బాగా అధ్యయనం చేసేది. ఆ ప్రభావం ఆమెపై పడింది. ఆ ప్రభావంతోనే ఆమె ఎప్పుడూ నిరాడంబరంగా ఉండేది. కొత్త విషయాలు నేర్చుకునేందుకు ప్రాధాన్యం ఇచ్చేది. అందుకోసం అనేక చర్చల్లో పాల్గొనేది. మొదట ఆమెకు మార్క్స్ సిద్ధాంతం పరిచమయింది. ఇది తన ప్రజల జీవితాన్ని మెరుగుపరిచేందుకు సరైన మార్గంగా గుర్తించింది. అందుకే మార్క్సిస్ట్ తత్వశాస్త్ర లోతైన అధ్యయనాన్ని ప్రారంభించింది. అప్పట్లో ఈ పుస్తకాలను రష్యన్ ప్రభుత్వం నిషేధించడంతో అధ్యయనం చాలా కష్టంగా మారింది. అందుకే సేకరించి భూగర్భ లైబ్రరీలలో ఉంచేవారు. 1890లో ఆమె ఇంజనీర్ రాబర్ట్ క్లాసన్ నిర్వహించిన మార్క్సిస్ట్ సర్కిల్‌లో చేరింది. తర్వాత యువ కార్మికుల కోసం నడిచే సండే స్కూల్లో పని చేసింది.

లెనిన్‌తో వివాహం

కృపస్కయా మొదటిసారిగా లెనిన్‌ను ఫిబ్రవరి 1894లో ఓ చర్చా సమూహంలో కలుసుకుంది. అక్కడ అతని వ్యక్తిత్వం కన్నా ప్రసంగం ఆమెను ఎంతగానో ఆకట్టుకుంది. అక్టోబరు 1896లో లెనిన్ అరెస్టయిన చాలా నెలల తర్వాత ఆమె కూడా అరెస్టయ్యింది. ఆమెను కొంతకాలం పీటర్, పాల్ కోటలో నిర్బంధించారు. అయితే అక్కడ ఓ మహిళ తనను తాను కాల్చుకుని మరణించడంతో కృపస్కయను కూడా విడుదల చేశారు. ఆమె యుఫాలో మూడేండ్లు బహిష్కరణకు గురయ్యింది. బహిష్కరణకు ముందు తన తల్లి ద్వారా ఆమెకు లెనిన్ నుండి ఓ ఉత్తరం అందింది. అతను ఉంటున్న ప్రవాస ప్రదేశానికి ఆమెను అనుమతించే లేఖ అది. ఆమెకు లెనిన్‌తో పాటు వెళ్లేందుకు అనుమతి దొరికింది. అయితే వచ్చిన వెంటనే ఇద్దరూ వివాహం చేసుకోవాలని తల్లి షరతు పెట్టింది. మే 1898లో కృపస్కయా లెనిన్‌న్ని వివాహం చేసుకుంది. అప్పటి నుండి లెనిన్ రచనలను ఆమె అనువాదం చేసేది.

సోవియట్ యూనియన్‌లో విద్య

విప్లవానికి ముందు ఆమె ఉద్యోగులకు ఐదేండ్ల పాటు సాయంత్రం తరగతులను బోధించింది. చదవడం, రాయడంతో పాటు వారికి లెక్కలు నేర్పించేది. ఈ ప్రాంతంలో దాదాపు 30,000 మంది ఫ్యాక్టరీ కార్మికులు మెరుగైన వేతనాల కోసం సమ్మె చేయడానికి అవసరమైన చైతన్యాన్ని నింపారు. విప్లవం తర్వాత కూడా ఆమె 'యువత సంస్థ – విద్య యొక్క సమస్యలపై' దృష్టి సారించింది. కార్మికులు విద్యా వంతులుగా మారడానికి వారికి పుస్తకాలు అవసరమని ఆమె గుర్తించారు. కార్మికులకు అలాంటి పుస్తకాలు అందుబాటులో ఉండచంలో ఆమె ప్రముఖ పాత్ర పోషించారు. సోషలిస్ట్ రాజకీయ విలువలు పెంపొందేందుకు విద్య చాలా అవసరమని ఆమె విశ్వసించింది.

అనారోగ్యం వెంటాడినా...

కృపస్కయా గ్రేవ్స్ వ్యాధి బారిన పడింది. ఇది థైరాయిడ్ గ్రంధిని ప్రభావితం చేస్తుంది. దీని వలన కళ్ల ఉబ్బి, మెడ బిగుసుకుపోతుంది. అంతేకాదు ఋతు చక్రానికి కూడా ఇబ్బందిగా మారింది. ఇలా ఎన్ని అనారోగ్య సమస్యలు వెంటాడినా తన రాజకీయ లక్ష్యాన్ని మాత్రం విడనాడలేదు. విడుదలైన తర్వాత లెనిన్ యూరప్ వెళ్లి మ్యూనిచ్ వెళ్ళాడు. ఆమె కూడా విడుదలై అతని వద్దకు వెళ్ళింది. తర్వాత ఇద్దరూ కలిసి లండన్‌కు వెళ్లారు. కృపస్కయా లెనిన్‌తో తన జీవితపు జ్ఞాపకాలను 1930లో 'మెమొరీస్ ఆఫ్ లెనిన్' అని రాసుకుంది.

రాజకీయ జీవితం

1903 నుండి ఆమె రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన బోల్షెవిక్ కార్యకర్తగా ఉండేది. అప్పట్లో లెనిన్ నడిపిస్తున్న ఇస్క్రా వార్తాపత్రిక కోసం ఆమె ఎంతో కృషి చేసింది. 1905లో ఆమె రష్యాకు తిరిగి వచ్చింది. 1905 విప్లవం విఫలమైన తర్వాత మళ్లీ వెళ్లిపోయి ఫ్రాన్స్‌లో కొన్నేండ్లు ఉపాధ్యాయురాలిగా పనిచేసింది. 1917లో రష్యన్ విప్లవం తర్వాత ఆమె పీపుల్స్ కమీసర్ ఫర్ ఎడ్యుకేషన్ అనాటోలీ లునాచర్స్కీకి డిప్యూటీగా నియమితులయ్యింది. అక్కడ ఆమె వయోజన విద్యా విభాగానికి బాధ్యతలు స్వీకరించారు. 1920లో విద్యా కమిటీకి అధ్యక్షురాలై 1929 నుండి 1939 వరకు డిప్యూటీ ఎడ్యుకేషన్ కమిషనర్ (ప్రభుత్వ మంత్రి)గా పని చేసింది. సోవియట్ విద్యా వ్యవస్థను స్థాపించడంలో కీలక పాత్ర పోషించింది. సోవియట్ లైబ్రేరియన్‌షిప్ అభివృద్ధిలో కూడా భాగస్వామిగా ఉంది. 1924లో సోవియట్ యూనియన్ కమ్యూనిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యురాలిగా, 1927లో దాని కంట్రోల్ కమిషన్ సభ్యురాలిగా, 1931లో సుప్రీం సోవియట్ సభ్యురాలిగా ఉంది.

నిబద్ధత కలిగిన మార్క్సిస్ట్

కృపస్కయా నిబద్ధత కలిగిన మార్క్సిస్ట్. ప్రజల జీవితాన్ని మెరుగుపరచడానికి అహర్నిశలూ కృషి చేసింది. అలాగే మహిళా కార్మికులను విద్యా వంతులుగా చేయడంలో, రాజకీయంగా వారిని చైతన్య పరచడంలో ముఖ్య పాత్ర పోషించారు. మహిళా హక్కుల కోసం జరిగిన అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. జనవరి 1924లో లెనిన్ మరణానంతరం కూడా ఆమె పార్టీలో కొనసాగుతూ పార్టీలో జరుగుతున్న అంతర్గత పొరపాట్లను ఎప్పటికప్పుడు తిప్పికొడుతుండేది. కృపస్కయా 27 ఫిబ్రవరి 1939న మాస్కోలో మరణించింది. ఆమె డెబ్బైవ పుట్టినరోజు తర్వాత రోజు ఆమెను క్రెమ్లిన్ వాల్ నెక్రోపోలిస్‌లో ఖననం చేశారు.





ఉదయనిధి, రాజాలకు ఊరట

- సనాతన ధర్మంపై వ్యాఖ్యల కేసులో వారెంట్ ఇవ్వలేం: తేల్చి చెప్పిన మద్రాసు హైకోర్టు



చెన్నై: సనాతన ధర్మంపై వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో తమిళనాడు క్రీడా మంత్రి, డీఎంకే నాయకులు ఉదయనిధి స్టాలిన్, మరో ఇద్దరు ప్రజా ప్రతినిధులకు కో -వారెంటు జారీ చేయాలన్న అభ్యర్థనను మద్రాస్ హైకోర్టు బుధవారం తోసిపుచ్చింది. ఉదయనిధితో పాటు ధర్మాదాయ శాఖ మంత్రి పికె శేఖర్‌బాబు, నీలగిరి పార్లమెంట్ సభ్యులు ఎ. రాజాలను చట్టసభ సభ్యులుగా కొనసాగడానికి అనర్హులుగా ప్రకటించాలన్న పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. వీరిపై ఎలాంటి నేరారోపణలు లేనందున కో-వారెంట్ జారీ చేసే ప్రశ్నే ఉత్పన్నం కాదని జస్టిస్ అనితా సుమంత పేర్కొన్నారు. గతేడాది సెప్టెంబరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయనిధి మాట్లాడుతూ.. "సనాతన ధర్మం హెచ్ఐవి లాంటిది. దీనిని నిర్మూలించాలి" అని వ్యాఖ్యానించారు.

లష్కర్‌లో లక్ ఎవరిదో..!

(మొదటిపేజి తరువాయి)

కోరుతూ పార్టీ ముఖ్య నాయకులు ఏ కార్యక్రమం జరిగినా వివరిస్తూ ముందుకెళ్తున్నారు. ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రధానంగా చేరికలపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే ఇటీవల మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులు, డిప్యూటీ మేయర్ దంపతులు, ఇతర కార్పొరేటర్లు, ముఖ్యనేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ పరిణామం కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధంగా మారింది. అధికార అహంకారంతో కాంగ్రెస్ నాయకులు తమ నేతలను ప్రలోభాలకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, తాము చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసే పార్టీలోకి చేరుతున్నారని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బొంతు రామ్మోహన్ బరిలో దిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. అదేవిధంగా ఈ టికెట్‌పై ప్రముఖ విద్యావేత్త డాక్టర్ విద్యాస్రవంతి కూడా ఆశలు పెట్టుకున్నారు. వీరితోపాటు మరో డజను మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఎవరివైపు మొగ్గుచూపుతుందో వెచిచూడాల్సిందే.

బీఆర్ఎస్ అభ్యర్థిపై స్పష్టత కరువు..!

అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో సీట్లు గెలిచినా.. గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రం చతికిలపడింది. గ్రేటర్‌లోని నాలుగు పార్లమెంట్ స్థానాల పరిధిలో 28 స్థానాలుండగా.. వీటిలో కాంగ్రెస్ కేవలం మూడు స్థానాలనే గెలిచింది. బీఆర్ఎస్ 17, ఎంఐఎం ఏడు, బీజేపీ ఒక స్థానాన్ని గెలుపొందాయి. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో అందరూ బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు కావడం.. రెండుసార్లు ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించడం ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో కలిసొచ్చే అంశమే. కానీ బీఆర్ఎస్ తరపున బలమైన అభ్యర్థి లేరు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ తరపున మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు సాయికిరణ్ యాదవ్ బరిలో నిలిచి ఓటమిచెందారు. ప్రస్తుతం బీఆర్ఎస్ తరపున పోటీలో దిగేందుకు ఎవరూ ఆసక్తి చూపెట్టకపోవడంతో.. సాయికిరణ్‌కే మరోసారి టికెట్ దక్కనుందని సమాచారం.

సిట్టింగ్‌కే ఛాన్స్..

అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లో ఒక స్థానానికే పరిమితమైన బీజేపీ.. లోక్‌సభ ఎన్నికల్లో ఎలాగైనా సత్తా చాటాలని చూస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు భిన్నంగా పార్లమెంట్ ఫలితాలు ఉంటాయనే ధీమాతో ఉన్న కమలం పార్టీ.. ఇప్పటికే రాష్ట్రంలోని 17 స్థానాలకు తొమ్మిది మంది అభ్యర్థులను ప్రకటించింది. సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి మరోసారి కిషన్‌రెడ్డి బరిలో నిలవనున్నారు. ఈ స్థానంలో మరోసారి కాషాయ జెండాను ఎగురవేయాలని ఆ పార్టీ ఉవ్విళ్లూరుతోంది. విజయసంకల్ప యాత్ర చేపట్టి సికింద్రాబాద్ పార్లమెంట్‌లోని అన్ని నియోజకవర్గాల్లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను జనాలకు వివరించడంతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలంటూ ప్రజల ఆదరాభిమానాలు పొందేందుకు యత్నిస్తోంది. అయితే సికింద్రాబాద్ ఎంపీగా గెలిచిన కిషన్‌రెడ్డి.. గడిచిన ఐదేండ్లలో నియోజవర్గాన్ని పెద్దగా పట్టించుకోకపోగా.. ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కోవలెంట్ పరిశ్రమలో ఘోర ప్రమాదం

(మొదటిపేజి తరువాయి)

జార్ఖండ్‌కు చెందిన ఫాదర్ మారండి, లాల్ బాబ్ తూరి, స్వాధీన్ రాజు కార్మికులుగా పనిచేస్తున్నారు. మంగళవారం సాయంత్రం కెమికల్ పౌడర్ అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో రియాక్టర్ వద్ద అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దాంతో అక్కడే పని చేస్తున్న వారిని మంటలు చుట్టుముట్టాయి. సేఫ్టీ లేకపోవడంతో మంటలు అంటుకొని తీవ్ర గాయాలయ్యాయి. ఎగసిపడిన మంటలకు భయపడి కార్మికులు ప్రాణాలను అరచేతిలో పట్టుకొని ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కానీ రియాక్టర్ వద్ద పనిచేస్తున్న నలుగురు కార్మికులు కెమిస్ట్‌తో కలిసి మంటల్లో చిక్కుకొని తీవ్రంగా గాయపడ్డారు. పరిశ్రమ యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వినోద్‌కుమార్ మృతి చెందాడు. కాగా మంగళవారం సాయంత్రం ప్రమాదం జరిగితే.. ఎవరికీ చెప్పకుండా.. రాత్రి సమయంలో మృతుడు వినోద్ కుమార్ కుటుంబీకులకు యాజమాన్యం చెప్పింది. దాంతో ఆగ్రహించిన వారు బుధవారం ఉదయం కోలెంట్ పరిశ్రమ గేటు ఎదుట బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. యాజమాన్యం స్పందించకపోవడంతో సంగారెడ్డి నర్సాపూర్ ప్రధాన రోడ్డుపై పరిశ్రమ ఎదుట బైటాయించి.. ప్రమాదానికి కారకులైన పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మీ ఆంక్షలు తగవు..?

(మొదటిపేజి తరువాయి)

కోసం విజ్ఞప్తి చేయాలని సూచించింది. చట్టపరమైన ఆశ్రయం పొందే హక్కు రాష్ట్రానికి ఉందని అంగీకరిస్తూ, ముందస్తు షరతుగా కేరళ దావాను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేయొద్దని కోర్టు కేంద్రానికి సూచించింది.

రూ.13,608 కోట్ల మేరకు అదనపు రుణాలు తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, అయితే పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలనే షరతు విధించిందని ధర్మాసనానికి కేరళ తెలిపింది. కేంద్ర ప్రభుత్వం తరపు అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్. వెంకటరామన్‌ను ఉద్దేశించి జస్టిస్ సూర్యకాంత్ అలాంటి షరతును ఎలా విధించగలరని కేంద్ర ప్రభుత్వ వైఖరిని ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలనే షరతు మినహా రాజ్యాంగంలోని నిబంధనల పరిధిలోని ఇతర షరతులను కేంద్ర విధించవచ్చని అన్నారు. కేరళ రాష్ట్రం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ రూ. 13,608 కోట్ల మొత్తం రాష్ట్రానికి సంబంధించినదేనని, అది కేంద్రం ఇచ్చే రాయితీ కాదని వాదించారు. రాష్ట్రానికి అదనంగా రూ.50 వేల కోట్ల రుణాలు అవసరమని సిబల్ కోరారు. దీంతో ధర్మాసనం జోక్యం చేసుకొని సమస్యల పరిష్కారానికి నేడు, రేపు సమావేశం నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. కేసు తదుపరి విచారణను వాయిదా వేసింది. అయితే, చర్చలు విఫలమైతే కేరళ, కేంద్రం విచారణను అభ్యర్థించవచ్చు.అని ధర్మాసనం స్పష్టం చేసింది.

గ్రూప్స్ రాతపరీక్షల తేదీలు ఖరారు

(మొదటిపేజి తరువాయి)

టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. 503 గ్రూప్-1 పోస్టుల భర్తీకి 2022, ఏప్రిల్ 26న ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు ఈనెల 14వ తేదీ వరకు తుది గడువున్నది. పాత నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిందేననీ, అయితే ఫీజు మాత్రం మినహాయింపునిస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ స్పష్టం చేసింది. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన నిర్వహించనుంది. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. గ్రూప్-2 రాతపరీక్షలు పలుమార్లు వాయిదా పడ్డాయి. 1,388 గ్రూప్-3 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 30న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,36,477 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.


ప్రాజెక్టులపై ఆరా..

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిశీలన నిమిత్తం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన ఎన్‌డిఎస్‌ఏ చైర్మెన్ చంద్రశేఖర్ అయ్యర్ నిపుణుల కమిటీ బుధవారం రాష్ట్రానికి చేరుకుంది. నాలుగు రోజుల పాటు బ్యారేజీలను పరిశీలించనుంది. తొలిరోజు హైదరాబాద్‌లోని జలసౌధలో రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో భేటీ అయింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ల కుంగుబాటు, ప్రస్తుత పరిస్థితులు, ఇతర అంశాలపై చర్చించారు. దాదాపు 19 అంశాలకు సంబంధించి సమాచారం ఇవ్వాలని మంత్రి దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించిన మంత్రి ఉత్తమ్, అక్కడే ఉన్న సాగునీటి శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జానుద్దేశించి మాట్లాడుతూ కమిటీ అడిగిన సమాచారం అంతా ఇవ్వాలని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు జరగరాదన్నారు. దాదాపు రెండు గంటల పాటు ఈ సమావేశం జరిగింది. ఈ భేటిలో ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఈఎన్సీ అనిల్‌కుమార్ ఇతర అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు. నిపుణుల బృందం క్షేత్రస్థాయి పర్యటన అనంతరం ఈనెల తొమ్మిదిన మళ్లీ జలసౌధలో సాగునీటి శాఖ ఉన్నతాధికారులతో భేటీ కానుంది.

నిపుణులతో కమిటీ అనేక అంశాలపై చర్చించాం: ఉత్తమ్

మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు గత ఏడాది అక్టోబర్ 21వ తేదీన కుంగిపోయిన సంగతిని ఎన్‌డీఎస్‌ఏ నియమించిన నిపుణుల కమిటీకి వివరించామని రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిపుణుల కమిటీకి కాళేశ్వరం ప్రాజెక్టు వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ తాము కోరిన వెంటనే కేంద్ర జలశక్తి శాఖ కమిటీ వేసి పరిశీలనకు పంపినందుకు హర్షం వ్యక్తం చేశారు. మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోయిన నేపథ్యంలో పునరుద్ధరణకు ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని కోరుతున్నామని అన్నారు. కమిటీ సలహాలను పాటించి మేడిగడ్డను తిరిగి ఉపయోగంలోకి తెస్తామని అన్నారు. మూడు రోజుల పాటు కాళేశ్వరం ప్రాజెక్టుపై ఫీల్డ్ వర్క్ చేయనుందని చెప్పారు. ఎన్‌డీఎస్‌ఏ బృందానికి అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. నిపుణుల బృందం గురువారం మేడిగడ్డ, ఆ తర్వాత అన్నారం, రాత్రి రామగుండం, శుక్రవారం సుందిళ్ల బ్యారేజీని సందర్శిస్తుందన్నారు. ప్రభుత్వం దగ్గర ఉన్న అన్ని డాక్యుమెంట్లను ఎన్‌డీఎస్‌ఏ కమిటీకి ఇవ్వాలని కోరారు. ఎవరైనా ఆ కమిటీకి సహకరించకపోయినా, డాక్యుమెంట్లు దాచిపెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. బ్యారేజీ దెబ్బతినడానికి కమిటీ కారణాలు చెప్పాల్సి ఉంటుందన్నారు. సమస్యకు ప్రధాన కారణం ఎవరనేది కమిటీని అడిగామనీ, వర్షాలు రాకముందే ఎలాంటి చర్యలు తీసుకోవాలో చెప్పాలని కమిటీని కోరినట్టు వివరించారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా తప్పులు ఉంటే నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎల్ అండ్ టీ రాష్ట్రంలో అనేక వ్యాపారాలు చేస్తున్నదనీ, తాము చట్ట ప్రకారం ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. న్యాయ విచారణపై త్వరలోనే ముందుడుగు పడుతుందని మంత్రి తెలిపారు.



ఎన్‌డీఎస్‌ఏ కమిటీకి సహకరిస్తాం : సాగునీటి శాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్

ఎన్‌డీఎస్‌ఏ అడిగిన సమాచారం అంతా ఇస్తామని సాగునీటి శాఖ ఈఎన్సీ బి. అనిల్‌కుమార్ అన్నారు. కమిటీ సలహాలు, సూచనలు పాటిస్తామన్నారు. ఇప్పటికే ఆ కమిటీ నుంచి లేఖ అందిందనీ, ఆ మేరకు అంతా ఇచ్చినట్టు చెప్పారు. అంశాలవారీగా వారి సందేహాలకు సమాధానాలు చెప్పినట్టు వివరించారు.

మోడీవి విచిత్రమైన విమర్శలు:ఉత్తమ్

కాళేశ్వరం అవినీతిలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన విమర్శలు విచిత్రంగా ఉన్నాయని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ విచారణ చేయడం కాదనీ, మేడిగడ్డ విషయంలో కేంద్రం ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్‌డీఎస్‌ఏ కమిటీకి నాలుగు నెలల సమయం ఉందని చెప్పారు. వీలైనంత త్వరగా తాత్కాలిక నివేదిక అడుగుతున్నామనీ, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. పదేండ్లు బీజేపీ, బీఆర్ఎస్ అలయ్ బలయ్ చేసుకున్నాక, కాళేశ్వరం ఏటీఎం అని ఇప్పుడు తెలిసిందా అని ప్రశ్నించారు. భారీస్థాయిలో అవినీతి జరిగినా ఎందుకు చర్యలు తీసుకోలేదని వ్యాఖ్యానించారు. కలిసి ప్రయాణం చేశారు, రూ. 80 వేల కోట్ల రూపాయల రుణాలు ఇప్పించారు, ఇందులో మీకు వాటా ఉందా అని అడిగారు. గౌరవనీయ ప్రధాని హోదాలో ఉండి మోడీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వాస్తవం లేని విషయాలు ప్రచారం చేయడం దారుణమని విమర్శించారు. కాళేశ్వరం తొలుత రూ. 80 వేల కోట్ల డీపీఆర్ చేశారనీ, ఇప్పుడా ఖర్చు రూ.94 వేల కోట్లకు చేరిందని గుర్తు చేశారు.

ఇప్పుడు ప్రధాని కాంగ్రెస్‌పై బురదచల్లే పనిచేయడం ఎంతమాత్రం సరికాదని అన్నారు. మోడీ ప్రధాని అయిన వెంటనే తెలంగాణకు అన్యాయం చేశారని వ్యాఖ్యానించారు. సీలేరు ప్రాజెక్టు, ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపారని విమర్శించారు. పునర్విభజన చట్టంలో ఇచ్చిన ఐటీఐఆర్ ఏమైందని ప్రశ్నించారు. 50 లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉన్నా, తెలంగాణ దక్కనీవ్వకుండా బీజేపీ అడ్డుకుందన్నారు. మోడీ ప్రధాని అయ్యాకే ఐటీఐఆర్ రద్దు అయిందన్నారు. చట్టపరంగా వచ్చిన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఎందుకు మంజూరు కాలేదన్నారు. దేశ పౌరుల ఖాతాల్లో విదేశీ నల్లధనం ద్వారా వచ్చిన సొమ్మును రూ. 15 లక్షలు వేస్తామన్నారు. ప్రధాని హోదాలో ఉన్న వ్యక్తి ఎన్నికల కోసం అబద్దాలు చెప్పడం, చిల్లర విమర్శలు చేయడం మోడీకే చెల్లిందన్నారు. మేడిగడ్డ విషయంలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా అధికారులపై చర్యలు తీసుకున్నామనీ, ఎన్‌డిఎస్‌ఏ నివేదిక రాగానే మరింత మందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



రెండోరౌండ్‌కు లక్ష్యసేన్

ఫ్రెంచ్ ఓపెన్ సూపర్-750

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో యువ షట్లర్ లక్ష్యసేన్ శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో లక్ష్యసేన్ మూడుసెట్ల హోరాహోరీ పోరులో లక్ష్యసేన్ 15-21, 21-15. 21-3 తేడాతో జపాన్ ఆటగాడు కాంత సునేయమను చిత్తు చేశాడు. అయితే, ఈ మ్యాచ్‌లో లక్ష్యసేన్‌కు తొలి గేమ్‌లో ప్రత్యర్థి షాకిచ్చాడు. 8-5తో ఆధిక్యంలోకి కొనసాగిన లక్ష్యసేన్ ఆ తర్వాత పట్టు కోల్పోయి గేమ్‌ను చేజార్చుకున్నాడు. తొలి గేమ్ తర్వాత లక్ష్యసేన్ అద్భుతంగా పుంజుకున్నాడు. వరుసగా రెండు గేమ్‌లను ఏకపక్షంగా గెలుచుకున్నాడు. లక్ష్యసేన్ జోరు ముందు ప్రత్యర్థి నిలువలేకపోయాడు. మరోవైపు, యువ ఆటగాడు ప్రియాన్ష్ రజావత్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. టాప్ సీడ్, డెన్మార్క్ స్టార్ విక్టర్ అక్సెల్సెన్ చేతిలో 21-8, 21-15 తేడాతో పరాజయం పాలయ్యాడు. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్, మహిళల డబుల్స్‌లో ట్రీసా జోలీ-గాయత్రి గోపీచంద్ జంట రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లిన సంగతి తెలిసిందే.

అదే జోరు చివరి టెస్ట్‌లోనూ..

- ఇంగ్లండ్‌తో ఐదో టెస్ట్ నేటినుంచే..
- ఉదయం 9.30గం॥ల నుంచి

ధర్మశాల: ఇంగ్లండ్‌తో ఆఖరి, ఐదో టెస్ట్‌కు టీమిండియా సిద్ధమైంది. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను 3-1తో ఇప్పటికే కైవసం చేసుకున్న టీమిండియాకు ఇది నామమాత్రపు మ్యాచ్ కాగా.. ఇందులోనూ విజయం సాధించి ఆధిపత్యాన్ని కొనసాగించాలని రోహిత్ సేన భావిస్తోంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని పటిష్టం చేసుకోవాలంటే ప్రతి మ్యాచ్ భారత్‌కు కీలకమే. నాలుగో టెస్టుకు విశ్రాంతి తీసుకున్న స్టార్ పేసర్ బుమ్రా.. ధర్మశాలలో జరిగే చివరి మ్యాచ్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. బుమ్రా మూడు టెస్టుల్లో 17 వికెట్లు తీసి అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. బుమ్రా రాకతో మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్‌లో ఒకరిపై వేటు పడే ఛాన్స్ ఉంది. ఇక బ్యాటింగ్‌లో అదరగొడుతున్న జైస్వాల్-రోహిత్ ఓపెనింగ్ చేయనున్నారు. నాలుగో టెస్టు విజయంలో కీలక పాత్ర పోషించిన వికెట్ కీపర్ ధృవ్ జురెల్ తుది జట్టులో ఉండటం ఖాయమే. గాయపడ్డ కేఎల్ రాహుల్, ఫామ్ లేమితో బాధపడుతున్న రజత్ పటీదార్‌లకు చోటు దక్కడం కష్టమే. మూడోటెస్ట్‌లో రాణించి సర్ఫరాజ్ ఖాన్‌తోపాటు దేవదత్ పడిక్కల్ టెస్టులో అరంగేట్రం చేసే అవకాశం ఉంది. అలాగే కెరీర్‌లో వందో టెస్టు ఆడుతున్న సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తుది జట్టులో ఉంటాడు. అతడితో కలిసి ఆల్‌రౌండర్ కోటాలో రవీంద్ర జడేజాతోపాటు టీమ్ మేనేజ్‌మెంట్ స్పిన్నర్ వైపు మొగ్గు చూపితే కుల్దీప్ యాదవ్ జట్టులో చోటు ఖాయం.

చల్లటి వాతావరణంలో...

నాల్గోటెస్ట్ జరిగే హిమాచల్ క్రికెట్ అసోసియేషన్ చల్లటి వాతావరణంతో కూడి ఉంటుంది. ధర్మశాల పిచ్ తొలుత సీమర్లకు అనుకూలంగా, ఆ తర్వాత స్పిన్నర్ల ప్రభావం కనిపిస్తుంది. ఈ వేదికపై 2017లో జరిగిన ఏకైక టెస్టులో భారత్ 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై



ఘన విజయం సాధించింది. ఈ పిచ్ వన్ సైడెడ్‌గా ఉండదని.. రెండు జట్లకు అనుకూలిస్తుందని ఇంగ్లండ్ బ్యాటర్, వందో టెస్టు ఆడుతున్న జానీ బెయిర్‌స్టో తెలిపాడు. ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో న్యూజిలాండ్ ఘోర ఓటమితో పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉన్న టీమిండియా తొలి స్థానానికి ఎగబాకింది. ప్రస్తుతం టీమిండియా 64.58 విజయాల శాతంతో అగ్రస్థానంలో నిలవగా.. న్యూజిలాండ్ 60 శాతం, ఆస్ట్రేలియా 59.09 శాతంతో తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

జట్లు(అంచనా)..

ఇండియా : రోహిత్ శర్మ(కెప్టెన్), జైస్వాల్, శుభ్‌మన్, పడిక్కల్/పటీదార్, సర్ఫరాజ్, ధృవ్ జురెల్(వికెట్ కీపర్), జడేజా, అశ్విన్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్/ఆకాశ్ దీప్.

ఇంగ్లండ్: బెన్ స్టోక్స్(కెప్టెన్), క్రాలే, డకెట్, రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్(వికెట్ కీపర్), హార్ట్ లీ, మార్క్ వుడ్, బషీర్, ఆండర్సన్, రాబిన్సన్.

అశ్విన్ @ 100వ టెస్ట్

ధర్మశాల టెస్టు మ్యాచ్ ఆడటంతో రవిచంద్రన్ అశ్విన్ భారత్ తరఫున 100 టెస్టు మ్యాచ్‌లు ఆడిన 14వ టీమిండియా ప్లేయర్‌గా ఘనత సాధించనున్నాడు. అంతర్జాతీయంగా టెస్ట్ క్రికెట్‌లో మొత్తం 79మంది క్రికెటర్లు 100 టెస్టులు ఆడారు. అలాగే స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మరో ఘనతను అందుకోనున్నాడు. ఈ మ్యాచ్ ఆడటంతో అశ్విన్ టెస్టు క్రికెట్‌లో భారత జాతీయ జట్టు తరఫున 100 మ్యాచ్‌లు ఆడిన 14వ ప్లేయర్, ఐదో బౌలర్‌గా రికార్డు సృష్టించనున్నాడు. అంతకుముందు, కపిల్ దేవ్, అనిల్ కుంబ్లే, హర్భజన్ సింగ్, ఇషాంత్ శర్మలు భారత్ తరఫున 100 టెస్టు మ్యాచ్‌లను ఆడారు. అలాగే మూడో స్పిన్నర్‌గా అశ్విన్ నిలుస్తాడు. దీంతో పాటు దిగ్గజ బౌలర్ల రికార్డులను కూడా అశ్విన్ బ్రేక్ చేయనున్నాడు. ఈ సిరీస్‌లో ఇప్పటికే అనిల్ కుంబ్లే తర్వాత 500 టెస్టు వికెట్లు తీసిన రెండో భారతీయుడిగా అశ్విన్ చరిత్ర సష్టించాడు. టెస్టుల్లో కుంబ్లే భారత్ తరఫున అత్యధిక వికెట్లు (619 వికెట్లు) తీసిన బౌలర్ కాగా, అశ్విన్ కేవలం 98 మ్యాచ్‌ల్లోనే 500 వికెట్ల మైలురాయిని అత్యంత వేగంగా అందుకున్నాడు.

అంతర్జాతీయ క్రికెట్‌లో రెండో క్రికెటర్‌గా రికార్డు..

99 టెస్టులు ఆడి 584 వికెట్లు తీసిన ముత్తయ్య మురళీధరన్ తర్వాత 100వ టెస్టు ఆడే ముందు 500 వికెట్లు తీసిన తర్వాత ఈ మైలురాయిని పూర్తి చేసిన రెండో క్రికెటర్‌గా అశ్విన్ చరిత్రలో నిలిచాడు. 100 టెస్టు మ్యాచ్‌లకు ముందు 500 వికెట్లు తీసిన ఇద్దరిలో అశ్విన్ ఇప్పటికే రికార్డు సృష్టించాడు. 2011లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో అశ్విన్ భారత్ తరఫున తన అరంగేట్రం చేసాడు. అప్పటి నుంచి టీమిండియా టాప్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు.

99టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లు..

మురళీధరన్(శ్రీలంక)	: 584
అశ్విన్(ఇండియా)	: 507
అనిల్ కుంబ్లే(ఇండియా)	: 478
మెక్‌గ్రాత్(ఆస్ట్రేలియా)	: 446
షేన్ వార్న్(ఆస్ట్రేలియా)	: 436

సామాజిక భద్రత లేదు

డొమెస్టిక్ వర్కర్స్ హక్కుల రక్షణకు చట్టం కావాలి **వెల్లడిస్తున్న ఉపాధి డేటా గణాంకాలు**



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఇండ్లల్లో పని చేసే కార్మికులు వారి హక్కులకు నోచుకోలేకపోతున్నారు. క్రమబద్ధీకరించబడని, తక్కువ సామాజిక భద్రతను కలిగిన ఇంటి పని(డొమెస్టిక్ వర్క్), అనధికారిక శ్రామికశక్తిలో వ్యవసాయం తర్వాత రెండో అతిపెద్ద ఉపాధి రంగంగా ఉద్భవించింది. ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా కేంద్రం సేకరించిన అధికారిక డేటా దీనిని సూచిస్తుంది. అయినప్పటికీ.. ఇతర కార్మికులతో పోలిస్తే.. వారు నిర్లక్ష్యానికి గురవుతున్నట్టు స్పష్టమవుతున్నది.
కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు చెందిన ఈ-శ్రమ్ పోర్టల్‌లోని డేటా ప్రకారం.. 29.43 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు ప్రభుత్వ పోర్టల్‌లో ఇప్పటివరకు నమోదు చేసుకున్నారు. వారిలో 15.39 కోట్ల మంది కార్మికులు వ్యవసాయంలో ఉన్నారు. తర్వాత స్థానంలో డొమెస్టిక్ వర్కర్స్ (2.84 కోట్ల మంది), నిర్మాణ (2.65 కోట్ల మంది) ఉన్నారు.
అసంఘటిత రంగ కార్మికులలో అధిక వాటాగా ఇంటిపని (డొమెస్టిక్ వర్క్) ఎదుగుతున్న దృగ్విషయం వారి హక్కులను పరిరక్షించటానికి చట్టం ఆవశ్యకతను నొక్కిచెప్పిందని కార్మిక ఆర్థికవేత్తలు అంటున్నారు. ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులను 2021, ఆగస్టులో నమోదు చేయటం ప్రారంభించింది. వారు ఏ వృత్తిలో నిమగ్నమై ఉన్నారు? వారి నెలవారీ ఆదాయం ఎంత? వంటి పలు వివరాలను ఇవ్వాలని ప్రభుత్వ పోర్టల్ కార్మికులను కోరింది. ఇంటి పని అంటే ఊడ్చటం, పాత్రలు శుభ్రం చేయటం, బట్టలు ఉతకటం, వంట చేయటం, పిల్లలను చూసుకోవటం వంటివి. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఓ) నివేదిక ప్రకారం.. 2004-05లో భారత్‌లో 47.5 లక్షల మంది గృహ కార్మికులు ఉన్నారు.

కనీస వేతనం లేదు.. ఎక్కువ గంటల పని : ఐఎల్ఓ



ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఓ) వెబ్‌సైట్ ప్రకారం.. ఈ కార్మికులలో చాలా మందికి కనీస వేతనం కూడా లభించదు. చాలా ఎక్కువ గంటలు పని చేస్తున్నారు. తరచుగా ఒక రోజు విశ్రాంతి కూడా తీసుకోరు. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు కార్మికులను రప్పించే ప్లేస్‌మెంట్ ఏజెన్సీల చేతుల్లో వారు తరచూ దోపిడీకి గురవుతున్నారు. భారత్‌లో ఈ మహిళా గృహ కార్మికులు గణనీయమైన సంఖ్యలో జార్ఖండ్, బీహార్, బెంగాల్,ఒడిశా వంటి రాష్ట్రాల నుంచి వలస వస్తున్నారు. ఇటీవలి కాలంలో పట్టణీకరణ, ప్రపంచీకరణ కారణంగా గృహ కార్మికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని నిపుణులు అంటున్నారు. "తల్లిదండ్రులిద్దరూ కొన్ని ఉద్యోగాల్లో నిమగ్నమై ఉండటంతో చిన్న కుటుంబాలు ట్రెండ్‌గా మారాయి. గృహ కార్మికులు ఈ కుటుంబాల ఇంటి పనులను నిర్వహిస్తారు. అయితే, వీరి ఉద్యోగ రక్షణ, కార్మిక ప్రమాణాలు, కనీస వేతనాలు వర్తింపజేసేందుకు చట్టం తేవాలని డిమాండ్ చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు చట్టాన్ని ఆమోదించాల్సిన అవసరం ఉన్నది. గృహ కార్మికుల దోపిడీని అరికట్టడానికి ఒక చట్టం కనీస అవసరం"అని కార్మిక సంఘాల నాయకులు, సామాజికవేత్తలు సూచిస్తున్నారు.

'నిరాశతో పనిలో చేరుతున్న మహిళలు'

సీఐటీయూ కార్యదర్శి ఎ.ఆర్.సింధు మాట్లాడుతూ.. ఎక్కువ మంది ఇంటి పనిలో చేరటమంటే లేబర్ మార్కెట్‌లో ఒత్తిడిగా అభివర్ణించారు. "వేతనంతో కూడిన ఉద్యోగం అందుబాటులో లేనప్పుడు, ప్రజలు ఇంటి పనిని ఎంచుకుంటారు. ముఖ్యంగా, మహిళా కార్మికులు నిరాశతో ఇంటి పనిలో చేరుతున్నారు " అని ఆమె అన్నారు.

కేరళ బడిలో తొలి రోబో టీచర్!

మూడు భాషల్లో ముచ్చటించే ఉపాధ్యాయురాలు

త్రివేంద్రం : తొలి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపాధ్యాయురాలు ఐరిస్ త్రివేంద్రంలోని కేటీసీటీ హయ్యర్ సెకండరీ పాఠశాలలో విద్యా బోధన ప్రారంభించింది. ఈ రోబోను మేకర్‌ల్యాబ్స్ ఎడ్యుటెక్ ప్రయివేట్ లిమిటెడ్ అభివృద్ధి చేసింది. దేశంలో ఏఐ పరిజ్ఞానానికి ప్రాధాన్యత పెరుగుతున్న తరుణంలో కేరళలోని ఈ పాఠశాల దాని ప్రయోజనాలను అందిపుచ్చుకొని చరిత్ర సృష్టించింది. ఏఐ టీచర్ ఐరిస్ విద్యార్థులతో కనీసం మూడు భాషల్లో ముచ్చటించగలదు. క్లిష్టతరమైన ప్రశ్నలకు సమాధానం చెప్పగలదు. గాత్ర సహకారం అందించగలదు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా విద్యను అభ్యసించడంలో విద్యార్థులను భాగస్వాములను చేయగలదు. తోటి వారి సాయం అవసరం లేకుండానే విద్యార్థులు నైపుణ్యాన్ని సంపాదించేలా వారి సామర్థ్యాన్ని పెంచగలదు.



వారు స్వేచ్ఛగా, సులభంగా విద్యను అభ్యసించేలా చేయగలదు. ఐరిస్ టీచర్ వీడియోను మేకర్‌ల్యాబ్స్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో షేర్ చేసింది. ఆ వీడియో ఇప్పటికే నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. 'ప్రతి విద్యార్థి అవసరాలు, ప్రాధాన్యతలను ఐరిస్ గుర్తిస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సమర్థవంతంగా పాఠాలు బోధించేలా విద్యావంతులను తీర్చిదిద్దుతుంది' అని మేకర్‌ల్యాబ్స్ ఆ పోస్ట్‌లో తెలిపింది.

గొడ్డు మాంసం ఎగుమతుల్లో భారత్‌ది రెండో స్థానం

న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యధికంగా గొడ్డు మాంసం ఎగుమతి చేసే దేశాల జాబితాలో భారత్ రెండో స్థానంలో ఉంది. 2022లో నాలుగో స్థానంలో ఉన్న భారత్ గతేడాది రెండో స్థానానికి చేరింది. మాంసం విక్రయాల పేరుతో దేశంలో సంఘ్ పరివార్ మూకలు సామూహిక హత్యలకు పాల్పడుతున్న వేళ నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో గొడ్డు మాంస ఎగుమతులు పెరిగిపోయాయన్న వార్త ప్రాధాన్యత సంతరించుకుంది. అమెరికా వ్యవసాయ శాఖ రిపోర్టు ప్రకారం, 2023వ సంవత్సరంలో గొడ్డు మాంసం ఎగుమతుల్లో అమెరికా మొదటి స్థానంలో ఉంటుంది. అమెరికా మూడవ స్థానంలోను, ఆస్ట్రేలియా నాల్గవ స్థానంలో నిలిచాయి.



హర్ష

పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్

హీరో గోపీచంద్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమా'. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె కె రాధామోహన్ నిర్మించారు. ఈనెల 8న మహా శివరాత్రి సందర్భంగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.
ఈ నేపథ్యంలో దర్శకుడు హర్ష మీడియాతో మాట్లాడుతూ, 'నేను బెంగళూరులో పుట్టి, పెరిగాను. ఇప్పటివరకూ అన్నీ కన్నడ సినిమాలే చేశాను. రాధామోహన్ నిర్మాణంలో వచ్చిన 'బెంగాల్ టైగర్' సినిమాలో రెండు పాటలకు కొరియోగ్రఫీ చేశాను. ఇప్పుడు వారి బ్యానర్‌లోనే ఈ సినిమాతో తెలుగులో దర్శకుడిగా పరిచయం కావడం ఆనందంగా ఉంది. ప్రేక్షకులు ఎప్పుడూ చాలా పరిణితితో ఉంటారు. వారిని కథలో యంగేజింగ్‌గా ఉంచడం కోసం కొత్త తరహా స్క్రీన్ ప్లేని అనుసరించాలి. భీమా స్క్రీన్ ప్లే గ్రిప్పింగ్‌గా ఉంటుంది. ఎంటర్‌టైన్, ఎలివేషన్, ఎమోషన్‌తో ఇది మంచి కమర్షియల్ సినిమాగా అలరిస్తుంది. సోషల్ మెసేజ్ కూడా ఉంది. ముఖ్యంగా భీమా క్యారెక్టర్ చాలా ఎంటర్‌టైనింగ్‌గా అనిపిస్తూ, అందరూ ఇష్టపడేలా ఉంటుంది. అలాగే ఈ కథలో సెమీ ఫాంటసీ ఎలిమెంట్ కూడా ఉంది. కమర్షియల్ టచ్‌లో ఫాంటసీ ఎలిమెంట్ బ్లెండ్ చేయడం చాలా కొత్తగా వచ్చింది. ఆడియన్స్‌కు ఇది సరికొత్త అనుభూతిని ఇస్తుంది. అయితే ట్రైలర్ చూశాక అందరూ 'అఖండ'తో పోలిక తెచ్చారు. కానీ దానికి దీనికి సంబంధం లేదు. నిర్మాత రాధామోహన్ చాలా ప్యాషన్ ఉన్న నిర్మాత. దీన్ని మంచి క్వాలిటీతో నిర్మించారు.



అరుదైన అవార్డులు

ఎంతో మంది గొప్ప నటీనటులు, సాంకేతిక నిపుణులు, దర్శక నిర్మాతలు తెలుగు సినిమా ఘనతను ప్రపంచానికి చాటారు. అలాంటి వారిని గౌరవించుకునే ప్రయత్నం చేస్తోంది ఐకాన్స్ ఆఫ్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ అవార్డ్స్ కార్యక్రమం. తెలుగు ఫిల్మ్ అండ్ టెలివిజన్ వెల్ఫేర్ ఫోరమ్ నుంచి నాగబాల సురేష్ ఆధ్వర్యంలో ఈ అవార్డ్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.
ఈ అవార్డ్స్ కార్యక్రమానికి విజన్ వివికె హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత విజయ్ కుమార్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు. జ్యూరీ ఛైర్మన్‌గా తమ్మారెడ్డి భరద్వాజ బాధ్యతలు తీసుకున్నారు. ఈ నెల 16వ తేదీన ప్రసాద్ ల్యాబ్స్‌లో ఈ అవార్డ్స్ కార్యక్రమం జరుగనుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఫిలిం ఛాంబర్‌లో ఈ అవార్డ్స్ కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ దర్శకులు రేలంగి నరసింహారావు, నిర్మాత ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజన్ వివికె హౌసింగ్ సంస్థ అధినేత విజయ్ కుమార్ మాట్లాడుతూ, 'ఆ కార్యక్రమ స్పాన్సర్ షిప్ మాకు దక్కడం సంతోషంగా ఉంది. తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి చేసిన గొప్ప వారికి ఈ అవార్డ్స్ అందజేస్తాం' అని అన్నారు. 'తెలుగు చిత్ర పరిశ్రమ ప్రయాణం ప్రారంభమై 92 ఏళ్లు అవుతోంది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో 24 విభాగాల నుంచి వేలాది మంది లెజెండ్స్ ఈ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేశారు. అలాంటి గొప్పవారిని గుర్తుంచుకుని, గౌరవించుకునేందుకే ఈ అవార్డ్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం' అని నాగబాల సురేష్ చెప్పారు.

నవచిత్రం

రామ్‌చరణ్ సరసన..




జాన్వీ కపూర్

రామ్ చరణ్ తన నెక్ట్స్ పాన్ ఇండియా చిత్రం కోసం 'ఉప్పెన' దర్శకుడు బుచ్చిబాబు సానతో చేతులు కలిపారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై హై బడ్జెట్‌తో భారీ ఎత్తున నిర్మిస్తున్న ఈ సినిమాతో గ్రాండ్‌గా చిత్ర నిర్మాణంలోకి అడుగు పెడుతున్నారు. ఈ చిత్రం కోసం బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్‌ను ఆమె పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ స్వాగతం పలికారు. ఈ జోడి తెరపై అద్భుతమైన కెమిస్ట్రీతో ప్రేక్షకులని మంత్రముగ్దులను చేయబోతోంది.
ఈ మెగా వెంచర్‌కి ఆస్కార్- విన్నింగ్ కంపోజర్ ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.
దర్శకుడు బుచ్చిబాబు యూనివర్సల్ అప్పీల్ ఉండే పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే తెలియజేస్తారు.
రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: బుచ్చిబాబు సాన, సమర్పణ: మైత్రి మూవీ మేకర్స్, బ్యానర్: వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాత: వెంకట సతీష్ కిలారు, సంగీతం: ఏఆర్ రెహమాన్.

ఇటలీలో కల్కి పాట



ప్రభాస్, డైరెక్టర్ నాగ్ అశ్విన్ క్రేజీ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఫ్యూచరిస్ట్ సైన్స్ ఫిక్షన్ గ్లోబల్ ఫిల్మ్ 'కల్కి 2898 ఎడి'. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, దిశా పటానీ వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రం అద్భుతమైన సినిమా అనుభవాన్ని అందించబోతుంది. తాజాగా చిత్ర యూనిట్ సాంగ్ షూటింగ్ కోసం ఇటలీ వెళ్ళింది. ప్రభాస్, నాగ్ అశ్విన్, దిశా పటానీతో పాటు యూనిట్ అంతా కలిసి దిగిన ఫోటోని ఈ సందర్భంగా మేకర్స్ షేర్ చేశారు. ఇటలీలోని అద్భుతమైన లోకేషన్స్‌లో ఈ పాటని చాలా గ్రాండియర్ చిత్రీకరించనున్నారు.
ఈ సినిమా గత సంవత్సరం శాన్ డియాగో కామిక్-కాన్‌లో సంచలనం సృష్టించింది. టీజర్ గ్లింప్స్ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలను పొందింది. వైజయంతీ మూవీస్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మైథాలజీ ఇన్స్పైర్డ్ ఫ్యూచరిస్ట్ సైన్స్ ఫిక్షన్ చిత్రంగా ప్రేక్షకులకు దృశ్యకావ్యాన్ని అందించబోతుంది. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం మే 9న ప్రపంచవ్యాప్తంగా చాలా గ్రాండ్‌గా విడుదల కానుంది.



శర్వానంద్

ఏకంగా మూడు సర్‌ప్రైజ్‌లు

తన పుట్టినరోజు సందర్భంగా హీరో శర్వానంద్ తన సినిమాల అప్‌డేట్స్ ఇచ్చి అభిమానులను సర్‌ప్రైజ్ చేశారు. ఇందులో భాగంగా ఆయన నటిస్తున్న 35వ చిత్రం 'మనమే' విడుదలకు సిద్ధమైంది. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వ ప్రసాద్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పై నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత కాగా, కృతి ప్రసాద్, ఫణి వర్మ ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు. శర్వా బర్త్‌డే కానుకగా టైటిల్, ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు.
దీని తర్వాత తన 36వ సినిమాని సూపర్ హిట్ వెబ్ సిరీస్ 'లూజర్' ఫేమ్ దర్శకుడు అభిలాష్ కంకరతో చేయబోతున్నారు. విక్రమ్ సమర్పణలో వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ చిత్ర పోస్టర్ సూచించినట్లుగా, ఇది స్పోర్ట్స్ బేస్డ్ మూవీగా ఉండబోతోంది, ఇందులో హీరో బైక్ రైడర్‌గా కనిపిస్తారు. ఇది మూడు తరాల కుటుంబానికి సంబంధించిన అద్భుతమైన కథ. 90, 20వ దశకం ప్రారంభంలో మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంతో పాటు లవ్, డ్రీమ్స్ ప్రధానాంశాలుగా ఉంటుందని మేకర్స్ తెలిపారు.
తన గత సినిమా 'సామజవరగమన'తో సెన్సేషనల్ హిట్ అందించిన డైరెక్టర్ రామ్ అబ్బరాజు శర్వానంద్ 37వ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి అనిల్ సుంకర ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రకారం ఇది జాయ్ ఫుల్ హిలేరియస్ రైడ్‌గా ఉండబోతుంది.

ఇన్వెస్టిగేషన్ బ్యాక్‌డ్రాప్‌లో విశాలాక్షి

కేతిక హన్మయశ్రీ సమర్పణలో యు.కె. ప్రొడక్షన్స్ పతాకంపై విజయ్ శంకర్, మహేష్ యడ్లపల్లి, ఆయూషి పటేల్, అనుశ్రీ లీడ్ రోల్స్‌లో పవన్ శంకర్ దర్శకత్వంలో పల్లపు ఉదయ్ కుమార్ నిర్మిస్తున్న చిత్రం 'విశాలాక్షి'.
బుధవారం ప్రసాద్ ల్యాబ్‌లో సినీ ప్రముఖుల చేతుల మీదుగా ఈ చిత్రం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. దర్శకుల సంఘం అధ్యక్షులు వీరశంకర్ ఫస్ట్ షాట్‌కు దర్శకత్వం వహించగా, నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్ ఇచ్చారు. దర్శక, నిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. అనంతరం ఈ చిత్ర కాన్సెప్ట్ పోస్టర్‌ను వీరశంకర్, రాజ్‌కందుకూరి, ప్రతాని రామకృష్ణగౌడ్‌లు సంయుక్తంగా లాంచ్ చేశారు.
దర్శకుడు పవన్ శంకర్ మాట్లాడుతూ,'ఇది ఇన్వెస్టిగేషన్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే యాక్షన్ ఎంటర్‌టైనర్. అలాగే మంచి సస్పెన్స్‌తో నడుస్తుంది. ఇందులో 5 పాటలు, 5 ఫైట్‌లు ఉంటాయి. మొత్తం 4 షెడ్యూల్స్‌లో సినిమాని కంప్లీట్ చేస్తాం. టాకీ మొత్తం రాయలసీమ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో



ఉంటుంది. పాటలను ఊటీ, అరకుల్లో చిత్రీకరించటానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. 'ఈ కథ ఇన్వెస్టిగేషన్, స్టింగ్ ఆపరేషన్, ఎమోషనల్ వంటి అన్ని అంశాలతో కూడుకున్నది. యూత్, ఫ్యామిలీ ఆడియెన్స్‌ను దృష్టిలో పెట్టుకుని కథను మలిచాం' అని నిర్మాత పల్లపు ఉదయ్ కుమార్ చెప్పారు.

బుల్లెట్ రిలీజ్‌కి రెడీ

శ్రీ బండి సదానంద్ అండ్ మెమరీ మేకర్స్ సోమిసెట్టి హరికృష్ణ సమర్పించు, తుమ్మూరు కోట ఫిలిం సర్క్యూట్ బ్యానర్ పై నిర్మించిన చిత్రం 'బుల్లెట్'. చౌడప్ప దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హీరో రవి వర్మ, సంజనా సింగ్, ఆలోక్ జైన్ ,మనీషా దేవ్, జీవ, విజయ రంగరాజు, సంధ్య శ్రీ, నర్సింగ్ యాదవ్, జబర్దస్త్ అప్పారావు ప్రధాన పాత్రలు పోషించారు. ఈనెల 8న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రసాద్ ల్యాబ్స్‌లో గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రొడ్యూసర్ ఏ.ఎం రత్నం, దర్శకులు వి సముద్ర ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.
హీరో రవి వర్మ మాట్లాడుతూ, "హీరోగా నాకు అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. ప్రతి ఒక్కరూ థియేటర్లో ఈ చిత్రాన్ని చూడాలని కోరుకుంటున్నా. ప్రేక్షకులకు మంచి అనుభూతినిస్తుంది' అని చెప్పారు.
'ఇదొక యాక్షన్ మూవీ. కర్నూల్‌లోని అద్భుతమైన లొకేషన్స్‌లో ఈ చిత్రాన్ని చిత్రీకరించాం. టెక్నీషియన్స్ అందరూ బెస్ట్ అవుట్ పుట్ ఇచ్చారు. ఈ చిత్రం



అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే విధంగా ఉంటుంది. హీరో రవి వర్మ కొత్తవాడైనా చాలా బాగా చేశాడు' అని దర్శకుడు చౌడప్ప అన్నారు.
బండి సదానంద్ మాట్లాడుతూ, 'టీం వర్క్‌తో చేసిన చిత్రమిది. యూత్‌తో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే ఎలిమెంట్స్ ఈ చిత్రంలో ఉన్నాయి. కచ్చితంగా అందర్నీ ఆకట్టుకుంటుందని భావిస్తున్నాం' అని అన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886